30-3Pg1exHMNWJQE.qxd:30-3Pg1exHMNWJQE.qxd 1/1/02 7:07 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శ్రీకాకుళం
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital
Published from Srikakulam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
30-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 58 పేజీలు: 16 వెల: 6.50


ఆదివారం టిడిపి ఆవిర్భావ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

# అమరావతి నిర్మాణం రెండేళ్లలో పూర్తి

**• ప్రధానిచేత 2028 ఆగస్టులో ప్రారంభింపచేస్తాం**

**క్రమశిక్షణ ఉంటేనే పార్టీలో స్థానం • దేవతల నగరం రాక్షసులకు ఇష్టంలేదు..**

**ఏ ఎన్నికలొచ్చినా గెలుపు టిడిపిదే: పార్టీ 44వ ఆవిర్భావ సభలో సిఎం చంద్రబాబు**

**విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత దేశం మెచ్చే నగరంగా అమరావతి ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందులో అనుమానమే లేదని. గ్రీన్ ఎనర్జీ హబ్ గా రాయలసీమను అభివృద్ధి చేస్తామన్నారు. డ్రోన్లు, టెక్నాలజీ ఉపయోగించి మనం ముందుకు పోతాం. కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఒకప్పుడు ఎన్టీఆర్ ఒక రైతు ఇప్పుడు ఎన్టీఆర్ ఒక చరిత్ర. ఎవరు బాగా పనిచేస్తే వాళ్లే ప్రజాప్రతినిధులు అన్నారు. ఆడబిడ్డలకు 33శాతం రిజర్వేషన్లు వస్తున్నాయి అన్నారు. కార్యకర్తలను పట్టించుకోని వాళ్లు, ఇబ్బంది పెట్టే నాయకులు పార్టీకి అవసరం లేదని తెలుగుదేశం అధినేత, సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తెలుగుదేశం 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కష్టపడిన వాళ్లను కాపాడుకుంటూ పని చేసిన వాళ్లను గుర్తించి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఈ సారి 50 శాతం సీట్లు పెరగడంతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తున్నందున రాజకీయ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉంటేనే రాష్ట్రం బలంగా ఉంటుందని ఉద్ఘాటించారు. ఏ స్థాయి ఎన్నికయినా అందులో టీడీపీ పోటీ చేస్తే గెలిచి తీరాలన్నారు. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదని జగన్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. కార్యకర్తలను >>2

**కూటమి ఐక్యతే రాష్ట్రానికి శ్రీరామరక్ష: డి.సిఎం పవన్ -2- రికార్డులు సృష్టించాలంటే టిడిపితోనే: మంత్రి లోకేష్**

# పలువురు ఐఎఎస్‌ల బదిలీ

**విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ఆదివారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ కలెక్టర్ షణ్మోహన్‌ను ఏపీఈడీబీ సీఈవోగా బదిలీ చేసింది. ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఏపీఐఐసీ ఎండీగా, సాయికాంత్ వర్మను గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, అభిషిక్త్ కిశోర్‌ను విశాఖ జిల్లా కలెక్టర్‌గా, హరేంద్రప్రసాద్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్‌గా, టి. నిశాంతిని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా, తమిమిన్ అన్సారియాను పాఠశాల విద్య డైరెక్టర్‌గా, కోనసీమ జిల్లా కలెక్టర్ బదిలీ కావడంతో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆ జిల్లా జాయింట్ కలెక్టరే.. కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తారని ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

ఏప్రిల్ 5 నుండి
**'సూర్యఘర్ ఉత్సవ్'**
2లో

**విమానసర్వీసుల్లో వచ్చేనెల 20 నుంచి 60 శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు**






30-3Pg2exHMNWJQE F.qxd:30-3Pg2exHMNWJQE F.qxd 1/1/02 7:09 AM Page 1



## టిడిపి సీనియర్ కార్యకర్తలకు
# చంద్రబాబు, లోకేష్ ఆత్మీయ విందు



**విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉండవల్లిలోని నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆత్మీయ విందు ఇచ్చారు. పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించిన కార్యకర్తలను విందుకు ఆహ్వానించారు. విందుకు హాజరైన కార్యకర్తల ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను సీఎం చంద్రబాబు, లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల పోరాటాలు, త్యాగాలు మర్చిపోలేమని స్పష్టంచేశారు. కుటుంబ సభ్యులుగా భావించి ఇంటికి ఆహ్వానించి విందు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేమని కార్యకర్తలు తెలిపారు. అనంతరం కార్యకర్తలకు బట్టలు పెట్టి శాలువాతో చంద్రబాబు, లోకేశ్‌లు సత్కరించారు.

**ఇరాన్ ఆయుపట్టు**



# ఖర్గ్ ద్వీపం అమెరికా స్వాధీనం

## యుఎస్ నిఘావిమానం ధ్వంసం చేసిన ఇరాన్
## వార్ మరింత ఉధృతం

**టెహ్రాన్, వాషింగ్టన్, మార్చి 29:** పశ్చిమాసియాలో ఇరాన్‌పై ఓదేశం ఇప్పటికీ ఉధృత దాడులుచేస్తుంటే మరోవైపు అగ్రరాజ్యం దాడులకు బ్రేక్ ఇచ్చినట్లుప్రకటించే ఇరాన్ కీలక స్థావరాలను ఆక్రమిస్తోంది. నెలరోజులు దాటిన మధ్యప్రాచ్య యుద్ధంలో ఇరాన్‌కు అపారమైన నష్టం వాటిల్లినప్పటికీ అమెరికా సైనికస్థావరాలు, వైమానిక స్థావరాలు లక్ష్యంగా దాడులుచేస్తున్న ఇరాన్ అకస్మాత్తుగా అమెరికా అవాక్స్ విమానాన్ని ధ్వంసంచేయడంతో ఒక్కసారిగా అగ్రరాజ్యం ఖంగుతిన్నది. ఈ-3 సెంట్రీ అవాక్స్ విమానం కదనరంగంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది. 250 మైళ్లపరిధిలో గగనతలంలో ఏంజరిగినా ఈ విమానం గుర్తిస్తుంది. ఇపుడు ఈ విమానాన్ని ధ్వంసంచేయడంతో అమెరికాకు సుమారు ఆరువేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా ఇదిలా ఉంటే ఇరాన్‌పై భూతలదాడులకోసం 3500 మంది మెరైన్లను సెంట్రల్ కమాండ్ పరిధిలోకి తెచ్చారు. ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని ఈ మెరైన్‌ల సాయంతోనే స్వాధీనంచేసుకున్నట్లు అమెరికా చెపుతోంది. ఇదిలా ఉంటే అమెరికాతో చర్చలకు సిద్ధమేనని అయితే ఐదు షరతులు అంగీకరించాల్సిందేనని ఇరాన్ చెపుతోంది. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, హార్ముజ్‌జలసంధిపై ఎలాంటి జోక్యం ఉండకూడదని, గల్ఫ్‌దేశాల్లోని స్థావరాలన్నింటినీ ఎత్తివేయాలని, అలాగే భవిష్యత్తులో ఎలాంటి దాడులు ఉండవన్న హామీలతోనే తాము అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలకు సిద్ధం అవుతామని ఇరాన్ ప్రకటించినా అమెరికా వైపునుంచి మాత్రం ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఖతార్, ఒమన్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో షరతులు లేని చర్చలకు మాత్రమే సిద్ధమని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిణామాలపై ఆసక్తి నెలకొంది. కాల్పుల విరమణ వంటి కొన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినా నష్టపరిహారం వంటి డిమాండ్‌కు అమెరికా అంగీకరించడం కష్టమనే అంచనాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఇపుడు యుద్ధంలోకి ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హౌతీలు యుద్ధంలోకి ప్రవేశించారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణిదాడిచేసారు. మావేళ్లు ట్రిగ్గర్‌మీదే ఉన్నాయని, రెడ్‌లైన్ దాటితే యుద్ధం తప్పదని సైనిక బ్రిగేడియర్ జనరల్ యాహ్యాసారీ హెచ్చరించారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని సున్నితమైన సైనిక స్థావరాలే టార్గెట్‌గా వీటిని ప్రయోగించారు. అయితే ఐడిఎఫ్ తన రక్షణ వ్యవస్థతో అడ్డుకుంది. దక్షిణ ఆక్రమిత పాలస్తీనాలోని సున్నితంగా ఉన్న ఇజ్రాయెల్ సైనిక స్థావరాలే లక్ష్యంగా హౌతీలు ముమ్మరదాడులుచేసాయి.

# ఏప్రిల్ 5 నుండి 'సూర్యఘర్ ఉత్సవ్'

- రూఫ్ టాప్ సోలార్‌కు ప్రోత్సాహం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్



**తిరుపతి, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను విరివిగా అమర్చేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు అంశాలపై ఆయన సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందు వీలుగా వినియోగదారుల్లో అవగాహనను మరింత పెంపొందించాలని సూచించారు. ఈ యేడాది జగ్జీవన్ రామ్ జయంతి రోజైన ఏప్రిల్ 5 నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14వతేదీ వరకు ఎపిఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే సూర్యఘర్ ఉత్సవ్ కార్యక్రమం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు కోసం ఇప్పటికే ఎంపికైన గుత్తేదారులతో సమన్వయం చేసుకుంటా పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సోలార్ సిస్టమ్స్ ఏర్పాటుకు అవసరమైన సామాగ్రిని కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**వ్యవసాయ విద్యుత్ మంజూరులో జాప్యం వద్దు..**

సంస్థ పరిధిలో రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన మంజూరు చేయాలని సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. సర్వీసులను మంజూరు చేయడంలో జాప్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంస్థ పరిధిలోని ప్రతి అసిస్టెంట్ ఇంజనీర్ తమ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులతో స్వయంగా మాట్లాడి, సీనియారిటీతో పాటు సర్వీసు మంజూరు అంశంపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. అదే విధంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసు కోసం అందిన దరఖాస్తుల సీనియారిటీ లిస్టును ఆయా సెక్షన్ల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించి మెటీరియల్ ను డ్రా చేసి, పనులను సకాలంలో పూర్తి చేయని శ్రీసత్యసాయి సర్కిల్లోని మడకశిర (64 సర్వీసులు), అగళి (61), అమరాపురం (46), గుడిబండ (41), రొళ్ళ (37 సర్వీసులు) సెక్షన్ల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పనితీరుపై మండిపడ్డారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఒకే అంశంపై వినియోగదారుల నుంచి పలుమార్లు అభ్యర్థనలు నమోదైతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడ బోమని తెలిపారు.

**ఇద్దరిపై క్రమశిక్షణాచర్యలు**

అనంతపురం సర్కిల్‌లో నిబంధనలను పాటించకుండా వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసిన అంశంపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసులు నాయుడుకు షోకాజ్ నోటీసును జారీ చేశారు. అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. బాలచంద్రను విధుల నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్‌హెచ్ ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, కె. ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్లు జి.చక్రపాణి, వి.విజయన్, 9 సర్కిళ్ళ సూపరింటెం డింగ్ ఇంజనీర్లు రమణ, ఇస్మాయిల్ అహ్మద్, శేషాద్రి శేఖర్, రాఘవేంద్రం, మోసెస్, సోమశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు, ప్రదీప్ కుమార్, సుధాకర్లతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కూటమి ఐక్యతే రాష్ట్రానికి శ్రీరామరక్ష

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్
- ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీకార్యకర్తలకు డి.సిఎం శుభాకాంక్షలు



**విజయవాడ మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధికి కూటమి ఐక్యతే అత్యంత కీలకమని, ఈ స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దామని డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆపార్టీ నేతలు, కార్యకర్తలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిఖ్యాత నందమూరి తారక రామారావు తెలుగు జాతి ఆత్మగౌరవం అనే మహోన్నత ఆశయంతో స్థాపించిన ఈ పార్టీ, ఉమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక అద్భుత అధ్యాయాన్ని లిఖించిందని ఆయన స్మరించుకున్నారు. నాలుగు పదుల కాలంగా ప్రజాక్షేత్రంలో అజేయంగా నిలవడంలో టీడీపీ చూపిన పోరాట పటిమ సామాన్యమైనది కాదని పవన్ అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రయాణంలో ఎదురైన ఎన్నో కఠిన సవాళ్లను, సంక్షోభాలను చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో సమర్థవంతంగా అధిగమించాలని పవన్ కొనియాడారు. క్లిష్ట సమాయాల్లో ఆయన ప్రదర్శించిన నాయకత్వ లక్షణాలు కార్యకర్తల్లో కొండంత ధైర్యాన్ని నింపాయని పేర్కొన్నారు. కేవలం రాజకీయాలే కాకుండా, రాష్ట్ర పురోగతిని, ప్రజల బాగును కాంక్షిస్తూ చంద్రబాబు పార్టీని నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి పథంలోనూ, ప్రజల పక్షాన నిలబడి పోరాడటంలోనూ చంద్రబాబు తనదైన ముద్ర వేశారని పవన్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, అభివృద్ధి కేవలం కూటమి ఐక్యతతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే స్నేహాన్ని సమన్వయాన్ని భవిష్యత్తులోనూ మరింత బలోపేతం చేసుకుంటూ రాష్ట్ర శ్రేయస్సు కోసం కలిసి అడుగులు వేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## వచ్చేనెల 20 నుంచి 60 శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు...

**విమానసర్వీసులపై డిజిసిఎ ఉత్తర్వులు జారీ**

**న్యూఢిల్లీ, మార్చి 29:** ఇకనుంచి అన్ని విమానసర్వీసుల్లో 60శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జిలు వసూలు చేయకూడదని పౌరవిమానయాన పర్యవేక్షక సంస్థ డిజిసిఎ అన్ని విమాన సంస్థలకు కీలక ఉత్తర్వులు జారీచేసింది. వచ్చేనెల 20వ తేదీనుంచి ఈ అదనపు ఛార్జిల రద్దు అమలులోకి వస్తుందని కూడా సూచించింది. డిజిసిఎ జారీచేసిన సర్క్యులర్ జారీచేసిన 30 రోజులనుంచి ఈ నిబంధనలు అమలవుతాయి. ఆవిధంగాచూస్తే వచ్చే ఏప్రిల్ 20వ తేదీనుంచి ప్రయాణీకులకు అదనపు ఛార్జీలభారం తప్పుతుంది. విమానాల్లో విండోసీటు, పక్కన ఉండే సీట్లు కాస్త ఎక్కువ సౌకర్యంగా ఉండటంతో ఆసీట్లకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. విమాన సంస్థలు వీటికి ఎక్కువ ఛార్జిలు వసూలుచేస్తారు.

## పదో తరగతి పరీక్షల వాల్యుయేషన్
# ఫలితాల వెల్లడి షెడ్యూల్ ఖరారు

**విజయవాడ, మార్చి29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పదో తరగతి పరీక్షలు చివరి దశకు వచ్చాయి. ఈ నెల 16న ప్రారంభమైన పరీక్షలు వచ్చే నెల ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాల మూల్యాకనం ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏప్రిల్ 4వ తేదీ నుంచి పది రోజుల పాటు ఏప్రిల్ 13 వరకు మూల్యాంకనం ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. మూల్యాంకనంలో పాటించాల్సిన నిబంధనలపై డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి తాజాగా మార్గదర్శకాలు విడుదల చేశారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లా కేంద్రాల్లో 10 రోజుల పాటు ఈ మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు ఒక రోజుకు 40 జవాబు పత్రాలను అందిస్తారు. ఇందులో ఉదయం 20, మధ్యాహ్నం నుంచి 20 చొప్పున జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోవాల్యుయేషన్ ఫలితాల వెల్లడి షెడ్యూల్ ఖరారు చేసారు. ఏప్రిల్ 2వ తేదీతో పదో తరగతి పరీక్షలు పూర్తి కానున్నాయి. వీలైనంత త్వరగా మూల్యాంకనం పూర్తి చేసిన ఫలితాలను విడుదల చేయాలని ఏపీ విద్యా శాఖ భావిస్తోంది. ఫలితాలను సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. దీంతో.. పది రోజుల పాటు పరీక్షా పత్రాల వాల్యుయేషన్ తేదీలను ఖరారు చేసారు. ఫలితాల వెల్లడి పైన అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

## రికార్డులు సృష్టించాలన్నా, వాటిని తిరగరాయాలన్నా
# ఒక్క టిడిపితోనే సాధ్యం: మంత్రి లోకేష్



**విజయవాడ, మార్చి29, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అని, రికార్డులు సృష్టించా లన్నా, వాటిని తిరగరాయాలన్నా అది ఒక్క టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర ఐటీ, మానవ వన రుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో జరిగిన సభలో ఆయన ఉద్వేగభరితం గా ప్రసంగించారు. జెండా మోసే కార్యకర్తలే పార్టీకి నిజమైన అధినేతలని, వారిని కాపాడు కోవడమే తన ప్రథమ కర్తవ్యమని ప్రకటించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, అధినేత చంద్ర బాబు దేశానికి చేసిన సేవలను లోకేశ్ గుర్తుచేశారు. ఎన్టీఆర్ తెచ్చిన సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణల గురించి చెప్పాలంటే రోజంతా పడుతుంది. చంద్రబాబు గారికి 75 ఏళ్లు వచ్చినా, ఆయన పనితీరు 25 ఏళ్ల యువ కుడి వేగంతో (స్పీడ్ 25) ఉంటుంది అని కొని యాడారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేయడంలో, దళితుడిని లోక్‌సభ స్పీకర్‌గా నిలబెట్టడంలో చంద్రబాబు దార్శనికత గొప్పదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంపై లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. క్లేమోర్ మైన్ల కే భయపడని రక్తం మాది. అలాంటిది అక్రమ కేసులకు భయపడతామా? టీడీపీ అడ్రస్ లేకుం డా చేస్తామన్న వాళ్లే ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్నారు. కార్యకర్తల సంక్షేమానికి రూ. 150 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో స్థాయికి తీసుకెళతా మని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు అహంకా రం వీడి ప్రజలతో మమేకం కావాలని, లేదంటే గత పాలకుల గతే పడుతుందని హితవు పలికా రు. మాజీ సీఎం జగన్‌పై లోకేశ్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. జగన్‌కు క్రెడిట్ చోరీ డిజార్డర్ అనే వింత వ్యాధి వచ్చింది. అందుకే ఇతరుల కష్టాన్ని తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవాలి అని ఎద్దేవా చేశారు.

# అమరావతి నిర్మాణం రెండేళ్లలో పూర్తి

>> పట్టించుకోని నేతలు తనకు అక్కర్లేదంటూ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్రమశిక్షణతో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను గుర్తించే పని లోకేశ్‌దే అని చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఆదర్శంగా ఉండాలని వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలో టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదని పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు అని పసుపు జెండా నిరంతరం ఎగురుతూ రాష్ట్రం ఎప్పుడూ గెలవాలని అన్నారు. తెలుగుదేశం పుట్టుక నుంచి నేటి వరకు పార్టీ సిద్దాంతాలు, విజయాలు, ప్రయాణం అన్నీ సంచలనమే అని గుర్తుచేశారు. ప్రసంగం చివర్లో జై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జై కొట్టారు. పార్టీ బలోపేతం కోసం పని చేస్తానంటూ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఎవరు బాగా పని చేస్తే వారే ప్రజాప్రతినిధులు అవుతారని చెప్పారు. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్దాంతాలకు, విధానాలను, క్రమ శిక్షణకు కట్టుబడి ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల వల్లనే మనం ఇక్కడ ఉన్నాం అని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నామని చెప్పారు. నాయకత్వం పెంపు కోసం నిరంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ టీడీపీనే అని చెప్పారు. కార్యకర్తలకు రాజకీయ సాధికారత కల్పిస్తామని అన్ని పదవుల్లోనూ జనాభా దామాషా పద్ధతిన అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పిస్తామని న్యాయ బద్ధమైన సంపాదన వచ్చేలా సహకరిస్తామని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ప్రస్థానాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. "టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి అడుగూ సంచలనమే, ప్రతి నిర్ణయమూ ప్రజాక్షేమమే. నాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా బర్తరఫ్ చేస్తే, ప్రజలే రోడ్లపైకి వచ్చి ఉద్యమించి తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన రూ.2కే కిలో బియ్యం పథకమే నేటి జాతీయ ఆహార భద్రతా చట్టానికి స్ఫూర్తి. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వంటివి మనమే దేశానికి పరిచయం చేశాం. ద్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశాం. బీసీలకు రాజ్యాధికారం, ఎస్సీలకు వర్గీకరణ, ఎస్టీలు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశాం అని వివరించారు. పోలవరాన్ని పూర్తి చేస్తామని అమరావతిలో మొదట ప్రారంభించిన పనులు 2028 ఆగస్టుకు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇక మూడు ముక్కలాట లేదని ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అదే అమరావతి అని తేల్చిచెప్పారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి రాజకీయాలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలను పార్టీ తిప్పికొట్టాలని నిత్యం ప్రజల్లో ఉంటూ చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న 19 మంది కార్యకర్తలను చంద్రబాబు సత్కరించారు. సామాజిక మాధ్యమాల్లో 44ఈయర్స్ఆఫ్ టీడీపీ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో ఉంది. ఎక్స్‌లో రెండో స్థానంలో టీడీపీ హ్యాష్ ట్యాగ్ కొనసాగుతోంది. పెద్దసంఖ్యలో తెలుగుదేశం శ్రేణులు, ప్రజలు మద్దతు తెలిపారు. పార్టీ ప్రస్థానంలో ఎన్నో సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొన్నామని చంద్రబాబు అన్నారు. "టీడీపీని ఫినిష్ చేస్తామన్న వారే ఫినిష్ అయ్యారు. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు కోల్పోయారు. నాపై అలిపిరిలో హత్యాయత్నం జరిగింది. 201924 మధ్య కాలంలో నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా కార్యకర్తల అండతోనే ముందుకు సాగాం. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాల ఫలితమే" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చంద్రయ్య అనే కార్యకర్త త్యాగాన్ని గుర్తుపెట్టుకుని, ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.



## వారం - వర్జ్యం

30-03-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
ద్వాదశి ఉ.7.10
మఖ మ.2.50
వర్జ్యం : రా.11.01-రా.12.39
దు.మ.12.36-మ.1.25, 2)మ.3.03-మ.3.52
శుభసమయం:ఉ.7.30-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** మీ ఓర్పు, సహనం మాటల చాతుర్యం వల్ల లాభపడతారు. విలువైన సమాచారం అందుకుంటారు.

**వృషభం:** కొన్ని బాధ్యతల నుండి తప్పుకోవాలని భావిస్తారు. పరిస్థితులు మాత్రం అందుకు అనుకూలించవు.

**మిథునం:** కుటుంబంలో ఐకమత్యత, అప్యాయత, అనురాగాలు లోపిస్తాయి. నరఘోష అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** కొన్ని బాధ్యతల నుండి తప్పుకోవాలని భావిస్తారు. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధించగలుగుతారు.

**సింహం:** ఓ మంచి కార్యక్రమం కోసం వసూలు చేసిన చందాల విషయంలో వివాదం, నిందలు ఏర్పడతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఉద్యోగంలో మీ ప్రత్యేక శైలి నిలబెట్టుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**తుల :** కొన్ని విషయాలలో పట్టుదలతో వ్యవహరిస్తారు. సంతాన విద్యా విషయమై ఆందోళన వద్దు. వాహన సౌఖ్యం కలదు.

**వృశ్చికం:** ఇతరులు చేయవలసిన శ్రమ మీరు చేయవలసి వస్తుంది. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**ధనుస్సు:** సామాజికంగా జరిగే మార్పులు మీపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాన్ని చూపిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మకరం:** జీవితంలో కొన్ని ముఖ్యమైన విషయాలు అనుకూల ఫలితాలను సాధిస్తారు. పరిస్థితి బలపడుతుంది.

**కుంభం:** స్థిరాస్తులు కొనుగోలుచేస్తారు. నమ్మకద్రోహం అడుగడుగునా ఎదురవుతుంది. మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష.

**మీనం :** ప్రయోజనాలు పగవాళ్ళకు చేరకుండా జాగ్రత్త వహించండి. సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కేజి బేసిన్ గ్యాస్‌లో సగం రాష్ట్రానికి ఇవ్వాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

**అమరావతికి చట్టబద్ధతపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడాన్ని సిపిఎం ఆహ్వానిస్తోంది**

**విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా- గోదావరి బేసిన్ గ్యాస్ ఉత్పత్తిలో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. 12వ ఆర్థిక సంఘం కూడా ఇదే సిఫార్సు చేసిందని డిమాండు చేశారు. అమరావతికి చట్టబద్ధతపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడాన్ని సిపిఎం ఆహ్వానిస్తోందన్నారు. సరైన నిర్ణయమని, అదే సమయంలో తీర్మానంపై మరింత స్పష్టత కావాలని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రం విభజన అయినప్పటి నుండి అమరావతి రాజధానికి చట్టబద్ధత ఉండాలని సిపిఎం డిమాండు చేస్తోందని, 2024 ఎన్నికల తరువాత సిపిఎం తొలిగా డిమాండు చేసిందని అన్నారు. అయితే చేసిన తీర్మానంలో అస్పష్టత ఉందని అన్నారు. అమరావతి అంటే ఏమిటో స్పష్టం చేయాలన్నారు. సిఆర్‌డిఏ మూడు జిల్లాల్లో ఉన్న విశాల ప్రాంతం అని అన్నారు. ఇందులో అమరావతి ఎక్కడ వరకో గుర్తించాలని అన్నారు. ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథంతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోందని, వినియోగదారులు, హోటల్ నిర్వాహకులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బుక్‌చేస్తే సిలిండర్ ఎప్పుడు వస్తుందో తెలియకపోవడంతో ఏజెన్సీల వద్దకు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు. ఈ సంక్షోభానికి ఇరాన్‌పై దాడి ఫలితం అని అనిపిస్తున్నా ప్రభుత్వం గ్యాస్ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని తెలిపారు. రాష్ట్ర వనరులను సరిగా వినియోగించుకుంటే సంక్షోభం వచ్చేది కాదని పేర్కొన్నారు. కృష్ణా గోదావరి డి6 బేసిన్‌లో రోజుకు 21 వేల టన్నుల గ్యాస్‌ను ఉత్పత్తి చేసే సామర్థం ఉంటే దాన్ని రిలయన్స్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధంగా కేటాయించాయని, దీనివల్ల అత్యంత విలువైన మన సహజవనరులను రాష్ట్రం కోల్పోయిందని తెలిపారు. రిలయన్స్ పైపులైన్ల ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ నుండి విదేశాలకు పంపించి వేల కోట్లు సంపాదిస్తోందని వివరించారు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం మన రాష్ట్రంలో ఉత్పత్తయ్యే గ్యాస్, అయిల్‌లో సగం మన రాష్ట్రానికి ఇవ్వాలని, దీనిలో కేంద్రానికి ఉన్న వాటాలో సగం వాటా ఉచితంగా ఇవ్వాలని అయినా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కేజీ బేసిన్ డి6 రిలయన్స్‌కు కేటాయించిన సమయంలో 50 వేలమందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, నిర్మాణ సమయంలో 12 వేలమందికి ఉపాధి వచ్చిందని, తర్వాత ఉత్పత్తి సమయంలో నాలుగువేల నుండి ఐదువేలమంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కంపెనీల అబద్ధాలకు మచ్చుతునకని, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని మోయడం మానుకోవాలన్నారు.

# ఇరాన్‌పై భూతల దాడుల కోసం 3500 మంది

**ఇప్పటికే పశ్చిమాసియాకు చేరాయంటున్న అమెరికా**

**వాషింగ్టన్, మార్చి 29:** ఇరాన్‌తో యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా కీలక చర్యలు చేపట్టింది. పశ్చిమాసియాలో తన సైనిక శక్తిని గణనీయంగా పెంచుతూ 3,500 మంది మెరైన్లు, నావికులతో కూడిన ఓ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను మోహరించింది. ఈ బలగాలు మధ్యప్రాచ్యానికి చేరుకున్నాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) ప్రకటించింది. యూఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధ నౌకపై ఈ బలగాలు సెంటకామ్ బాధ్యతలు నిర్వర్తించే ప్రాంతానికి వచ్చాయని తెలిపింది. ఈ బృందంలో దాదాపు 3,500 మంది సైనికులతో పాటు, రవాణా, ఫైటర్ విమానాలు, దాడులకు అవసరమైన ఇతర యుద్ధ సామాగ్రి కూడా ఉన్నాయి. సముద్రం నుంచి, నేలపై నుంచి ఏకకాలంలో దాడులు చేయగల సామర్థం ఈ బలగాలకు ఉంది. వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తీరప్రాంత లక్ష్యాలపై దాడులు చేయడం వంటి వేగవంతమైన ఆపరేషన్ల కోసం ఈ తరహా యూనిట్లను ఉపయోగిస్తారు. మధ్యప్రాచ్యానికి మరో 10వేల మంది సైనికులను పంపే ప్రతిపాదనను పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. దౌత్య మార్గాలతో పాటు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరిన్ని సైనిక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉంచడమే దీని లక్ష్యమని తెలుస్తోంది. ఈ బలగాలను ఇరాన్‌కు సమీపంలో, ముఖ్యంగా ఆ దేశానికి కీలకమైన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ద్వీపంపై దాడికి వీలుగా ఉండే ప్రాంతాల్లో మోహరించే అవకాశం ఉందని రక్షణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

30-3Pg3exHMNWJQEBV.qxd:30-3Pg3exHMNWJQEBV.qxd 1/1/02 6:33 AM Page 1



# తిరుమల సమాచారం

## టిటిడికి రూ2.01కోట్లు విరాళం



**తిరుమల,మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఆదివారం బెంగుళూరుకు చెందిన బిల్వ ఇన్ఫ్రా సంస్థ టిటిడి బర్డ్ ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ఎండీ ప్రవీణ్ ఎస్.నాయర్ తిరుమలలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు. అలాగే విశాఖపట్నానికి చెందిన దేవి ఫిషరీస్ సంస్థ ఆదివారం శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 1,01,25,000 కోట్ల రూపాయలు విరాళంగా అందించింది. ఆ సంస్థ డైరెక్టర్లు ఇంద్రనీల్ చిట్టూరి, మహేంద్ర యార్లగడ్డ తిరుమలలో టిటిడి అదనపు ఇఒసి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## అందరికీ మంచి జరగాలని ప్రార్థించాం

### - శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల,మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలకు మంచి జరగాలని, ఏడుకొండల వేంకటే శ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు న్యాయ మూర్తులు తెలిపారు.ఆదివారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఉదయం విఐపి బ్రేక్‌లో సుప్రీంకోర్టు పూర్వన్యాయమూర్తి జస్టిస్ అశోక్‌భూషణ్, కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు కుటుంబంతోకలసి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి వసంతోత్సవాలు

### - నేటి నుండి మూడురోజులు నిర్వహణ



**తిరుమల,మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:** వేసవితాపం నుండి కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఉపశమనం కల్పిస్తూ మూడురోజులు నిర్వహించే వసంతోత్సవాలు నేటి నుండి కన్నుల పండువగా జరగనున్నాయి. వైఖానస ఆగమోక్తంగా ఆలయ అర్చకులు, అధికారులు ఈ క్రతు వులను ఆలయానికి పడమరవైపు వసంత మండపంలో వేదోక్తంగా నిర్వహించనున్నారు. సోమవారం నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వ హించడం ఆనవాయితీ. తొలిరోజు నేటి ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్ప స్వామి నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండవరోజు మార్చి 31న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 01న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు,

పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి వసంతోత్సవమని పేరు ఏర్పడింది.

ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు మూడురోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను, మార్చి 31న అష్టదళ పాద పద్మారాధన సేవను టిటిడి రద్దు చేసింది.

## నేడు తిరుపతికి సిఎం చంద్రబాబు

### - పి4 పై పద్మావతివర్సిటీలో సమావేశం

**తిరుపతి, మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు తిరుపతికి విచ్చేస్తున్నారు. ఒకరోజు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో పి4 కార్యక్రమం లో లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. ఇందుకు ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్య క్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ ,తిరుపతి జిల్లా ఎస్పీలంకెల సుబ్బ రాయుడు , నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్యతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించారు.



## ఏప్రిల్ 14 లోగా 25వేల గృహాలకు సోలార్ విద్యుత్

### - ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో ఏప్రిల్ 14వ తేదీలోగా 25వేల గృహాలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతి సమీపంలోని రేణిగుంట పారిశ్రామికవాడలో సోలార్ పరికరాల గోడౌన్ ను ఆదివారం సిఎండి శివశంకర్ లోతేటి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ఆమర్చేందుకు సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఖిసూర్యఘర్ ఉత్సవ్ఖి కార్యక్రమం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారుల్లో చైతన్యవంతం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వివరించారు. సూర్యఘర్ ఉత్సవ్ కార్యక్రమం ముగిసేలోగా సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో 25 వేల ఎస్సీ,ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను అమర్చే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత ఏజెన్సీలను ఆదేశించినట్లు తెలిపారు. ఆయా ఏజెన్సీలు నిర్దేశిత సమయంలోగా పనుల్ని పూర్తి చేసేందుకు సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకు 29వేల గృహాలకు సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలియజేశారు. సంస్థ పరిధిలోని 36 సెక్షన్లలో 58 యండబ్ల్యుపి సామర్థంతో 29వేల సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని, వాటిలో ఇప్పటికే 1400 గృహాలకు సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన గృహాలకు సంబంధించిన సోలార్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఎం. ఉమాపతి, జనరల్ మేనేజర్.

## అమరావతికి చట్టబద్ధత

### అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు

**విజయవాడ మార్చి 29 ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న తన చేతుల మీదుగా రాజధానికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని వెంకయ్య గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన సాయం గురించి ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

2019 తర్వాత జరిగిన పరిణామాలు, ఎదురైన ఇబ్బందులను వివరిం చారు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలని వెంకయ్య నాయుడు కోరారు. ఈ విషయంపై అమిత్ షా సానుకూలంగా స్పం దించారు.

### కృష్ణా జిల్లాలో బాలుడి హత్య, దాడిలో అతని నానమ్మకు తీవ్రగాయాలు

**విజయవాడ మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నందివాడ మండలం పెదలింగాలలో పదేళ్ల బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత ఈ ఘటన చోటుచేసుకుంది. నానమ్మ లక్ష్మి తో కలిసి బాలుడు బాలాజీ ఇంట్లో నిద్రిస్తుండగా దుండగులు దాడికి పాల్పడ్డారు. దీంతో బాలాజీ మృతిచెందగా వృద్ధురాలు లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను విజయవాడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉంది. నందివాడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సిమెంట్ రాళ్లతో ఇరువురినీ బలంగా కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడు, వృద్ధురాలిపై దాడికి గల కారణాలు తెలియరాలేదు.

### పల్నాడులో విషాదం..

## డాక్టర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం

#### భార్య, కూతురు మృతి, ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న భర్త

**గుంటూరు, మార్చి 29, ప్రభాతవార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ లాడ్జిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఇందులో భార్య, కూతురు మృతి చెందగా, ప్రాణాలతో భర్త కొట్టుమిట్టాడుతున్నాడు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన డాక్టర్ గోపి కుటుంబం మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో నివాసం ఉంటోంది. భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలో గోపి డాక్టర్‌గా అతని భార్య శంకర కుమారి నర్సుగా పని చేస్తున్నారు. వారికి మూడేళ్ల చిన్నారి మోనిక ఉంది. కూతురు మోనికకు డౌన్ సింద్రోమ్ అనే వ్యాధి ఉండటంతో కుటుంబంలో కొంతకాలంగా మానసిక ఒత్తిడి ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.అయితే గోపి శనివారం రాత్రి 10 గంటల సమయంలో నరసరావుపేట పట్టణంలో ఓ లాడ్జిలోని రూమ్ నెంబర్ 304లో దిగారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గోపి, తన భార్య, కూతురుతో కలిసి చేతులకు క్యాన్యులాలు పెట్టుకుని మత్తు ఇంజక్షన్ చేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యాయత్నానికి ముందు ఈ దృశ్యాలను, లాడ్జి లొకేషన్‌ను కుటుంబ సభ్యులకు పంపించినట్లు చెబుతున్నారు.

## 'కార్యకర్తే అధినేత' టిడిపి భవిష్యత్తుకు ఢోకా లేదు

### - పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు - లోకేశ్ నాయకత్వం.. భవిష్యత్తుకు భరోసా



**విజయవాడ,మార్చి29,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని నిలబడటానికి కార్య కర్తల త్యాగాలే కారణమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. కార్యకర్తలే పార్టీకి ఊపిరి అని, వారి చెమట చుక్కల ఫలితంగానే నేడు పసుపు జెండా రెపరెపలాడుతోందని కొనియాడారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సామాన్య కార్యకర్తలను వేదికపైకి ఆహ్వానించి గౌరవించడం టీడీపీ గొప్పతనానికి నిదర్శనమని పల్లా అన్నారు. "కార్యకర్తే అధినేత" అనే నినాదాన్ని తమ పార్టీ నిజం చేసిందని చెప్పారు. 44 ఏళ్ల ప్రస్థానంలో పార్టీ నిలబడిందంటే అది కేవలం కార్యకర్తల వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. టీడీపీ కార్యకర్తల గుండెచప్పుడు లేకపోతే ఈ ఉద్యమమే లేదని ఆయన పేర్కొన్నారు. 1982కు ముందు రాజకీయాలు ఒక వర్గానికే పరిమితమయ్యాయని, పేదలు, రైతులు రాజకీయాల్లోకి రావాలంటే ఎగతాళి చేసేవారని పల్లా గుర్తుచేశారు. అణగారిన వర్గాల ఆవేదన నుంచి పుట్టిన ఎన్టీఆర్, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటడమే కాకుండా, సామాన్యులకు రాజకీయ అధికారాన్ని అందించారని కొనియాడారు.ఎన్టీఆర్ స్థాపించిన సిద్ధాంతాలను, ఆశయాలనుచంద్రబాబు అదే స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. సంక్షేమం, అభి వృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. నీతి, నిజాయతీతో పనిచేస్తే సామాన్య కార్యకర్తకు కూడా పార్టీలో ఉన్నత స్థాయి లభిస్తుం దనడానికి తానే ఒక నిదర్శనమని అన్నారు. అలాగే, తన తండ్రికి ఎన్టీఆర్, చంద్రబాబు ఇచ్చిన గుర్తింపును గుర్తుచేసుకున్నారు. పార్టీ భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ, యువనేతలోకేశ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. "మన భవిష్యత్తుకుఢోకా లేదు. యువగళం పాదయాత్ర ద్వారా తన సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిన నాయకుడు లోకేశ్.

## ప్రభావశీల నేతల్లో రామ్మోహన్‌నాయుడు

### - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక సంచికలో వెల్లడి - ఎదిగిన తీరు, మంత్రిగా పనితీరుకు ప్రశంసలు - మోడీ, అమిత్‌షా, జైశంకర్, రాహుల్ గాంధీ సరసన రామ్మోహన్‌నాయుడు



**శ్రీకాకుళం, మార్చి 29 ప్రభాతవార్త:** భారతదేశంలోని అత్యంత ప్రభావ వంతమైన యువ నాయకుల్లో ఒకరిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిలిచారు. ప్రముఖ పత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మార్చి ప్రత్యేక సంచిక ప్రచురితమైన 'భారతదేశంలోని అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు' జాబితాలో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేరారు. సమాజంపై చూపిన ప్రభావం, ప్రజలను ఆకర్షించిన తీరు, క్లిష్ట సమయాల్లో తీసుకున్న గొప్ప నిర్ణయాలు, ఇలా పలు కీలక అంశాలను ప్రామాణికంగా తీసుకుని రామ్మోహన్ నాయుడును ఈ జాబితాలో చేర్చినట్టు పత్రికా యాజమాన్యం పేర్కొంది. కాగా ఇదివరకే మోదీ, అమిత్‌షా, జై శంకర్, రాహుల్ గాంధీ, నిర్మలా సీతారామన్, యోగి ఆదిత్యనాథ్.. ఇలా పలువురు నేతలు ఈ జాబితాలో ఉన్నారు. ఇప్పుడు వారి సరసన రామ్మోహన్ నాయుడు చేరారు. భారతదేశంలో అతి పిన్న వయస్సు కలిగిన కేబినెట్ మంత్రుల్లో ఒకరైన రామ్మోహన్ నాయుడు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశ విమానయాన రంగాన్ని నడుపుతున్నారు. ఈ స్థాయి ఎదుగుదలకు దారి తీసిన అంశాలు, కేంద్ర మంత్రిగా ఆయన పని తీరును సంచికలో ప్రత్యేక వ్యాసంగా పొందు పరిచారు. మోడీ కేబినెట్‌లో విమానయాన శాఖను నడుపుతున్న రామ్మోహన్‌నాయుడు దేశంలోని అత్యంత ప్రభావవంతమైన యువ రాజకీయ నాయకుల్లో ముందున్నారు. గతేడాది అహ్మదాబాద్‌లోఫ్లైట్ కూలిపోయిన సంఘటన, డిసెంబర్‌లో ఇండిగో విమానయాన సంస్థలో విస్తృత అంతరాయాలు సంక్షోభాలను నిర్ధారించడంలో స్పష్టమైన సందేశాలు ఇచ్చి నిర్వహించారని ఈ వ్యాసంలో విశ్లేషించారు.

## పేదల పాలిట వరప్రదాయిని సిఎం సహాయనిధి: మంత్రి నారాయణ

### - 20 నెలల్లో 384 మందికి 3.72 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి



**నెల్లూరు, మార్చి 29, ప్రభాతవార్త-వైద్యం :** అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని పేదల పాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయినిగా మారిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు నగరంలోని గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరగింది. 59 మంది లబ్దిదారులకు 39,87,541 విలువైన చెక్కులను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. చెక్కులు అందుకొన్న వారిలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ వద్ద 17 ఏళ్లుగా పని చేస్తున్న వాచ్‌మెన్ శ్రీనివాసులు కూడా ఉండటం మంత్రి మంచి తనానికి నిదర్శనమని టీడీపీ నేతలు ప్రశంసించారు. సిటీ నియోజకవర్గంలో ఇరవై నెలల్లో 384 మంది పేదలకు ఆర్థిక వెసులుబాటు కల్పించి 3,72,81,092 నిధులను మంజూరు చేయించి కష్టకాలంలో కొండంత అండగా నిలిచిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు విజేతారెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, ప్రెసిడెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నియామకాల్లో అత్యంత పారదర్శకత

### - వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**విజయవాడ.మార్చి 29.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజారోగ్య శాఖ (డైరెక్టర్ అఫ్ పబ్లిక్ హెల్త్ డీహెచ్) ద్వారా మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీని తొలిసారిగా ఆన్లైన్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించబోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టులకు ఎంపికైన వారికి అత్యంత పారదర్శక విధానంలో పోస్టింగ్ ఉత్తర్వులను ఆన్లైన్ ద్వారా కౌన్సెలింగ్ ద్వారా ఇవ్వబోతున్నామని చెప్పారు ఏపీ ఆన్లైన్ వారి సహకారంతో సోమవారం నుంచి నిర్వహించబోతున్న కౌన్సెలింగ్ పోస్టింగ్ ఉత్తర్వుల జారీ 34 గంటల్లోగానే ముగుస్తుందని వెల్లడించారు. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన (ఐచ్ఛికాలు) కు అనుగుణంగా 611 వైద్యుల నియామక పోస్టింగు ఉత్తర్వులను ఆటోమేటిగ్గా ఆన్లైన్ ద్వారానే ఇస్తామని ప్రకటించారు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి (రిజర్వేషన్, ఇతర) అభ్యర్థులకు పోస్టింగులు ఇస్తామని తెలిపారు. ఈ మేరకు వేడిక్కడ ఓ ప్రకటన జారీచేశారు.గతంలో జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో డిస్ప్లే చేసిన ఖాళీలకు అనుగుణంగా పోస్టింగులు పొందారు స్థానికంగా ఉన్న ప్రాంతాల నుంచే కాకుండా కౌన్సెలింగ్ కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లి అక్కడ ప్రకటించిన వివరాల మేరకు పోస్టింగులు పొందారు. ఈ విధానంలో ఎక్కువ సమయం పడుతుంది. నిర్వహణ ఏర్పాట్లు పెద్ద స్థాయిలో చేయాల్సి వస్తుంది. ఈ విధానానికి భిన్నంగా.. అభ్యర్థులకు సానుకూలంగా ఉండేలా..పారదర్శకత మరింత పెరిగేలా ఆన్లైన్ కౌన్సెలింగ్ జరగబోతుంది. ఆసుపత్రుల వారీగా ప్రకటించిన పోస్టులన్నింటికి ప్రాధాన్య క్రమంలో అభ్యర్థులు ఆప్షను ఇచ్చుకోవాల్సి ఉంది. ఇందులో ఎటువంటి పరిమితులు లేవు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఆప్షన నమోదు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు, బోధనాసుపత్రుల్లో ట్యూటర్ల కేటగిరిల్లో కలిపి మొత్తం 638 ) పోస్టులకు ఎంపికచేసిన వారి జాబితాను ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ నియామకాల బోర్డు ప్రకటించింది. నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం పలు పోస్టులు పెరిగాయి.

ఇలా మొత్తం 638 పోస్టుల్లో 124 ట్యూటర్ల పోస్టులు ఉన్నాయి. వెరిఫికేషన్ చేయాల్సి ఉన్నందున స్పోర్ట్స్ కోటా కింద ఉన్న పోస్టులు మినహాయించి, మిగిలిన 611 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి సోమవారం ఉదయం 11 మంగళవారం సాయంత్రం 6 గంటల మధ్య (మొత్తం 31 గంటలు) ఆప్షన్లు స్వీకరిస్తారు.

## స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయ సాధనే లక్ష్యం

### - మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ వేడుకలు

### పేదలకు కూడు, గూడు కల్పనే ధ్యేయం : మంత్రి



**నెల్లూరు, మార్చి 29, ప్రభాతవార్త-వైద్యం** కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలన, సీల్డ్ కవర్ సీఎంల సంస్కృతికి వ్యతిరేకంగా 1982లో టీడీపీ ఆవిర్భవించిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్‌ని మట్టికరిపించి అధికారం చేపట్టిన మహా నేత స్వర్గీయ ఎన్టీ రామారావు అన్నారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఐదేళ్ల జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన జనంకి ప్రజారంజక పాలన అందిస్తూ అన్ని వర్గాల మన్నన పొందుతున్నారన్నారు. ఆదివారం నెల్లూరులోని గోమతి నగర్ మంత్రి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేతలు కార్యకర్తలతో కలిసి మంత్రి నారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నేతలతో కలిసి నివాళులర్పించారు. పార్టీకి విస్తృత సేవలందించిన 9 మంది కార్యకర్తలను సన్మానించి అభినందనలు తెలిపారు. సిద్ధాంతాలను ఆచరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యకర్తలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక పాలన, సీల్డ్ కవర్ సీఎంల సంస్కృతికి వ్యతిరేకంగా ఆత్మగౌరవ నినాదంతో 1982లో తెలుగుదేశం పార్టీని స్వర్గీయ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించి 201 స్థానాల్లో ఘన విజయం సాధించిన మహానేత రామారావుని గుర్తు చేశారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లని విశ్వసించిన ఎన్టీఆర్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన సంక్షేమ పథకాల ఆరాధ్యుడుగా చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. మహిళకు ఆస్తిలో సగ భాగం, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించారని, పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండలి వ్యవస్థతో ప్రజా పరిపాలన తెచ్చారని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ ఉండాలని సంకల్పించిన పక్కా ఇంటికి ప్రణాళిక రూపొందించిన మొట్టమొదటి నేత ఎన్టీఆరే అన్నారు. అదే స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, దానికి కొనసాగింపుగానే 7 లక్షల టిడ్కో ఇళ్లకు 2014 లోనే శ్రీకారం చుట్టారన్నారు. జగన్ ప్రభుత్వం రెండు లక్షలా అరవై వేలకు కుదించేసిందని, వాటిని కూడా అసంపూర్తిగా వదిలేసి, డబ్బులు కట్టిన పేదలను నట్టేట ముంచిందని ఆరోపించారు. తాజాగా టిడ్కో ఇళ్ల కోసం సీఎం 4400 కోట్లు కేటాయించారని జూన్ కల్లా ఇళ్లను పూర్తి చేసి అర్హులైన అక్క చెల్లమ్మలకు అందిస్తామన్నారు. గత ప్రభుత్వ అసమర్థ, దుర్మార్గ పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిదారుణంగా తయారైందని, రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోయాయన్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో మంచి పరిశ్రమ నెలకొల్పుతామని, ఆమంచర్లలో కూడా మరో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మరో సారి స్పష్టం చేశారు. కష్టపడ్డ వారికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని కార్యకర్తల కోసం ఏడాదికి నా సంక్షేమ నిధి నుంచి పది కోట్లు వెచ్చిస్తున్నానన్నారు. ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తు న్నానని, అందరి సహకారంతో నెల్లూరుని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ వంటి దార్శనిక నేతతో కలిసి పని చేయడం తన అదృష్టమన్నారు. పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తల సంక్షేమం కోసం మంత్రి నారాయణ చేస్తున్న కృషి అజరామరమని కొనియాడారు. అ

30-3Pg7exHMNWJQE.qxd:30-3Pg7exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1



# ఆగమోక్తంగా ప్రారంభమైన చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

## • వెండి పల్లకీపై శ్రీ స్వామి అమ్మవార్ల విహారం



శ్రీ స్వామి అమ్మవార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి, మార్చి 29 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 8 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు మంగళస్నానములు, వధూవరులుగా అలంకరించుటతో బ్రహ్మోత్సవ వేడుకలు ఆగమోక్తంగా ప్రారంభించారు. అంకురార్పణ, మంగళస్నానాలు, విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం జరిపారు. చైత్ర శుద్ధ ఏకాదశి నుండి తదియ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. మార్చి 31 మంగళవారం రాత్రి 10:30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందని భక్తులు విశేషంగా పాల్గొనాలన్నారు. 31వ తేదీ రాత్రి 7:00 గంటలకు రాయబారము (ఎదుర్కోలు ఉత్సవం), మార్చి 29న సాయంత్రం 5 గంటలకు వెండి పల్లకీ సేవ, మార్చి 30న రావణ వాహన సేవ, మార్చి 31న నంది వాహన సేవ, ఏప్రిల్ 1న సింహ వాహన సేవ, ఏప్రిల్ 2న వెండి రథోత్సవం జరుగుతాయన్నారు. ఏప్రిల్ 3 సాయంత్రం 5 గంటలకు కృష్ణా నదిలో శ్రీస్వామి వార్ల నదీ విహారం (తెప్పోత్సవం) నిర్వహిస్తామన్నారు.

**వెండి పల్లకీపై శ్రీ స్వామి అమ్మవార్ల విహారం:** చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవములలో మొదటి రోజు వెండి పల్లకీ ఊరేగింపులో శ్రీ దుర్గామల్లేశ్వరులు భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం 5 గంటలకు మల్లేశ్వర మహామండపం నుండి శ్రీ దుర్గా మల్లేశ్వరుల వెండి పల్లకి సేవ సాగింది. సంప్రదాయ కళలైన తప్పెట్లు, కోలాట నృత్యములు, తాళం భజన కళాకారుల ప్రదర్శలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ దుర్గా మల్లేశ్వరుల వెండి పల్లకివాహనసేవ ప్రారంభం ముందు ఆలయ ఈవో వీకే శీనా నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపు కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్త పేట, మెయిన్ బజారులలో భక్త కోటిని అనుగ్రహించి, తిరిగి ఊరేగింపు ఇంద్రకీలాద్రిని చేరుకుంది. ఆది దంపతులు వేంచేసిన పల్లకి ముందు భక్తులు రహదారులను పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయ జయ ద్వానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇంద్రకీలాద్రిపై ధ్వజారోహణం:** చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవములను ప్రారంభానికి చిహ్నంగా రాత్రి 7 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఆలయ స్థానాచార్య ఆధ్వర్యంలో వైదిక క్రతువు జరుగగా, ఆలయ ఈవో శీనా నాయక్ పాల్గొని ప్రత్యేక పూజాదికములు నిర్వహించారు.



సూర్య ఉపాసన నిర్వహిస్తున్న పండితులు

**భక్తిశ్రద్దలతో సూర్యఉపాసన:** ఇంద్రకీలాద్రిపై ఆదివారం సూర్యోపాసన సేవ భక్తిశ్రద్దలతో నిర్వహించారు. అరుణ పారాయణ, మహాసౌర పారాయణ, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చన కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చక బృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిత్యుని కృపకు పాత్రులయ్యారు. అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**దుర్గమ్మవారి సేవలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్:** ఆదివారం దుర్గమ్మవారిని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి. రా వ ు స ు బ్ర వ ు ణి య ు న్ దర్శించుకున్నారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో శీనా నాయక్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు అమ్మవారి జ్ఞాపికను అందించారు.



జస్టిస్ వి. రామసుబ్రమణియన్ దంపతులకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఇఓ శీనా నాయక్

**దుర్గమ్మ ఆలయానికి విరాళాలు:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి రు.1లక్ష విరాళాన్ని విశాఖపట్నానికి చెందిన కె.వి.ఎస్. శ్రీధర్, శాంత దంపతులు ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటుచేసిన అనంతరం శ్రీఅమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



శ్రీకోదండ రామాలయంలో పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం

**సీతానగరం శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు:** గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలోని విజయకీలాద్రిపై వెలసిన శ్రీ మద్వీరాంజనేయస్వామి మరియు శ్రీ సీతా సమేత కోదండరామస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు చైత్ర శుద్ధ ఏకాదశి ఆదివారం సందర్భంగా దేవస్థానంలో శాస్త్రోక్తంగా వివిధ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిత్యార్చన, నిత్య హోమ బలిహరణాదులు నిర్వహించారు. అనంతరం చూర్ణోత్సవం, వసంతోత్సవం, అవబృందోత్సవం అత్యంత భక్తిశ్రద్దలతో జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా కృష్ణానదిలో నిర్వహించిన చక్ర స్నానంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పూర్ణాహుతి, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం 5:30 గంటలకు నిత్యార్చన, నిత్య హోమ బలిహరణాదులు నిర్వహించిన అనంతరం బ్రహ్మోత్సవాలకు ముగింపు సూచికగా ధ్వజ అవరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 30వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీ పుష్పయాగం, సాయంత్రం 6:30 గంటలకు ద్వాదశి ప్రదక్షిణలు, డోలోత్సవం మరియు పవళింపు సేవతో ఈ ఉత్సవాలు సంపూర్ణంగా ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.



# కమనీయం, రమణీయం ఆదిత్యుని కల్యాణం

శ్రీకాకుళం, మార్చి 29 ప్రభాతవార్త: శ్రీసూర్యనారాయణ కల్యాణ మహోత్సవం అత్యంత కమనీయంగా, రమణీయంగా కనుల పండువుగా జరిగింది. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ పుష్కరిణి ఆవరణలో ఏర్పాటుచేసిన కల్యాణ వేదిక వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహిత్వవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులు గోండు శంకరరావు పాల్గొని తిలకించారు. స్వామివారి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలతో స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు స్వామి వారిని భక్తిశ్రద్ధలతో నమస్కరించి ఆశీస్సులను తీసుకున్నారు. అంతకుముందు సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులతో గ్రామ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ ఘట్టాన్ని కనులారా తిలకించారు. దేవాదాయ శాఖ కార్యాల నిర్వహణ అధికారి కె. ఎన్.వి.డి.వి.ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం!

## • తప్పుడు ప్రచారాలను నమ్మకండి • మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ పిలుపు



న్యూఢిల్లీ, మార్చి 29: కొవిడ్-19 మహమ్మారి కారణంగా ప్రపంచం ఇప్పటికే అనేక దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొందని, మహమ్మారి తర్వాత ప్రపంచ పరిస్థితి మెరుగుపడి, ప్రపంచం వేగవంతమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తరుణంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్ర ప్రభావంచూపిస్తున్నాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. మన్‌కీబాత్ 132వ ఎపిసోడ్‌లో ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న ఘర్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ సవాళ్లను దేశం కలిసికట్టుగా అధిగమిస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. అయితే దీనికి విరుద్ధంగా, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో యుద్ధాలు, ఘర్షణలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. గత నెల రోజులుగా పొరుగు ప్రాంతంలో జరుగుతున్న భీకర పోరాటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతాలలో, ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయులకు కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అక్కడ నివసిస్తున్న కోటి మందికి పైగా భారతీయులకు మద్దతు ఇస్తున్నందుకు గల్ఫ్ దేశాలకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధం జరుగుతున్న ప్రాంతం భారతదేశ ఇంధన అవసరాలకు ప్రధాన కేంద్రమని ప్రధాన మంత్రి మోడీ అన్నారు. ఇది పెట్రోల్, డీజిల్ విషయంలో ప్రపంచవ్యాప్త సంక్షోభానికి దారితీస్తోందని వెల్లడించారు. భారతదేశం తన ప్రపంచ సంబంధాలు, గత దశాబ్ద కాలంలో పొందిన బలం కారణంగా ఈ పరిస్థితులను బలంగా ఎదుర్కొంటోందని మోడీ స్పష్టం చేశారు. ఇది సవాళ్లతో కూడిన సమయమని పేర్కొంటూ, ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి పౌరులందరూ ఐక్యమవ్వాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. జాతీయ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరమని నొక్కిచెబుతూ మన్ కీ బాత్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ విషయం 140 కోట్ల మంది పౌరుల ప్రయోజనాలకు సంబంధించినది కాబట్టి, దీనిని రాజకీయం చేయకూడదని ప్రధానమంత్రి మోడీ పేర్కొన్నారు. పుకార్లను వ్యాప్తి చేసేవారు దేశానికి హాని చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పౌరులు అప్రమత్తంగా ఉండాలని, పుకార్ల ద్వారా తప్పుదోవ పట్టవద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. గతంలో దేశం తన 140 కోట్ల మంది పౌరుల బలంతో ప్రధాన సంక్షోభాలను ఎదుర్కొన్నట్లే, ఈసారి కూడా దేశం ఐక్యంగా నిలిచి ఈ సవాలును అధిగమిస్తుందని పీఎం మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# పాఠశాల విద్యాశాఖ కమీషనర్‌గా తమీమ్ అన్సారియా

- తమీమ్ అన్సారియా నియామకం పట్ల విద్యావేత్తల హర్షం
- విద్యారంగం ప్రక్షాళనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని కితాబు
- పాఠశాల విద్య బలోపేతానికి అన్సారియా కృషి చేస్తారని ఆశాభావం



గుంటూరు, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఏ.తమీమ్ అన్సారియాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. విద్యాశాఖ కమీషనర్‌గా అన్సారియా నియామకం విద్యారంగంలో సమూల మార్పునకు దోహదపడుతుందని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సమయోచిత నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమీమ్ అన్సారియా 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. కంప్యూటర్ సైన్స్‌లో బి.ఈ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ నుండి పబ్లిక్ మేనేజ్‌మెంట్‌లో ఎం.ఏ పూర్తి చేశారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న అన్సారియా గతంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. మంచి మనసున్న కలెక్టర్‌గా తమీమ్ అన్సారియాను గుంటూరు జిల్లా ప్రజలు కొనియాడటం విశేషం. చిన్నారుల బంగారు భవితకు బాటలు వేస్తూ ప్రకాశం జిల్లాలో ఆమె చేపట్టిన 'బంగారు బాల్యం' అనే కార్యక్రమానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు దక్కిన తొలి మహిళా కలెక్టర్‌గా గుర్తింపు సాధించారు. మానవీయ కోణంలో ప్రజలతో మమేకం అవ్వాలన్న సిఎం సూచనలకు పెద్దపీట వేస్తూ ఆమె చేసిన పాలన అనతికాలంలోనే గుంటూరు జిల్లా ప్రజల్లో చెరగని ముద్ర వేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి.జి.ఆర్.ఎస్ అర్జీల పట్ల జవాబుదారితనం, అంకిత భావంతో పనిచేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు, సమస్యల పట్ల సత్వర స్పందనతో ప్రజల్లో మంచి ఆదరణ పొందారు. రాజధాని ప్రోటోకాల్ జిల్లాగా పేరుపొందిన గుంటూరులో నిత్యం బిజీబిజీగా గడుపుతూనే ప్రభుత్వం నిర్వహించే పలు ఐవిఆర్‌ఎస్ సర్వేల్లో గుంటూరు జిల్లాను అగ్రస్థానంలో నిలిపారు. విద్యపై అపారమైన అభిరుచి కలిగిన అన్సారియా గుంటూరు జిల్లాలో పదో తరగతి చదివే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులకు సాయంత్రం పూట పౌష్టికాహారం, నిత్యం పాఠశాలలు సందర్శించి పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశారు. గుంటూరు జిల్లాలో పదో తరగతి చదివే ఏ విద్యార్థిని అడిగిన తమకు జిల్లా కలెక్టర్ స్ఫూర్తినిచ్చారని చెప్పేవారు. ఉపాధ్యాయుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపడం, విద్యారంగంలో సమన్వయం సాధించడం ఆమె ప్రత్యేకత. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యారంగంలో ఉన్న సవాళ్లను ఎదుర్కొంటూ, ఉపాధ్యాయ సంఘాలు, అధికారులతో సమన్వయం కల్పించే దూరదృష్టి ఆమెకు ఉందని విద్యావేత్తలు విశ్వసిస్తున్నారు. పాఠశాల విద్యా కమీషనర్ గా తమీమ్ అన్సారియా నియామకం ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు గట్టి నమ్మకంతో వున్నారు.

## మత్స్యకారులు పూజించే శ్రీరాముని సాక్షిగా చెబుతున్న

# ఆ ఆరోపణలు కట్టుకథలు

### రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



నెల్లూరు, మార్చి 29 ప్రభాతవార్త-వైద్యం: కారైకల్ బోట్ల వ్యవహారంలో నా పాత్ర 50శాతం కాదు ఒక్క శాతం ఉన్నా రాజ్యసభ పదవికి రాజీనామా చేస్తా అని ఎంపి బీద మస్తాన్‌రావు సవాల్ విసిరారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, "కమిటీ రిపోర్ట్ వచ్చే వరకు ఓపిక పట్టాలని కోరుతున్నా. కారైకల్ బోట్ల విషయంలో నాపై ఊహించని రీతిలో ఆరోపణలు చేయడం, నిందలు వేయడం బాధిస్తోంది, త్వరలోనే ఈ ఘటన తాలూకు సూత్రధారులెవరో తేలుతుంది. జువ్వలదిన్నెకు వచ్చిన మంత్రి లోకేష్ నన్ను పక్కకు తీసుకెళ్లి బోట్లు విడుదల చేయమని చెప్పారని దుష్ప్రచారం చేశారు, కానీ ఆ సమయంలో తాను పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నానని ప్రజల దృష్టికి తెచ్చాను. ఫోన్ కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీలు బయటపెట్టాలని వైసిపి నేతలు కొత్త నాటకం మొదలెట్టారు.

నా నిజాయితీ నిరూపించుకునేందుకు హై లెవెల్ ఎంక్వయిరీ కమిటీకి వివరాలు ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నాను. కుట్రపూరితంగా రోజుకొక ఆరోపణ చేస్తూ, దానిపై వివాదాలు సృష్టిస్తూ సముద్రాన్నే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల పొట్ట కొడుతున్నారు. మత్స్యకారులు నా కుటుంబ సభ్యులతో సమానం, నేను పుట్టిందే మత్స్యకార ప్రాంతంలో 40 ఏళ్లుగా వారితో నా అనుబంధం విడదీయరానిది" అని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు.

నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేయనున్న హై లెవెల్ ఎంక్వయిరీ కమిషన్ లో మత్స్యకారుల పెద్దలను సభ్యులుగా పెట్టి సూత్రధారులు ఎవరో తేల్చాలని, ఇలాంటి వివాదం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు.

## మినాబ్ స్కూలుపై దాడికి ఆదేశించిన క్రిమినల్ ఆఫీసర్లు వీరే



టెహ్రాన్, మార్చి 29: ఇరాన్‌లోని మినాబ్‌లో ఎలిమెంటరీ స్కూలుపై ఇటీవల అమెరికా క్షిపణి దాడి జరిపి 170 మంది ప్రాణాలను బలిగొన్న సంఘటన టెహ్రాన్‌వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతలను పెంచింది. ఈ క్షిపణిని ప్రయోగించిన అమెరికా నౌకాదళ అధికారుల ఫొటోలను ఇరాన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి అంటూ వారి చిత్రాలను సౌత్ ఆఫ్రికా, భారత్, ఇతర దేశాల్లోని ఇరాన్ రాయ బార కార్యాలయాలు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విడుదల చేశాయి. ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి. వీరు అమెరికా యుద్ధనౌక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెఫ్రీ యూ యార్క్, కమాండింగ్ ఆఫీసర్ లీ ఆర్ టేట్. మూడుసార్లు తోమహాక్ క్షిపణుల దాడికి వీరు ఆదేశాలిచ్చారు. మినాబ్ పాఠాశాలలోని 168 మంది అమాయక చిన్నారులను పొట్టన పెట్టుకున్నారు అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. ఈ ఘటన పొరపాటున జరిగినట్టు అమెరికా సమర్థించుకుంది. అమె రికా మీడియా కూడా సమర్థిస్తూ కథనాలు ప్రచురిం చింది. పాఠ శాలకు సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరం లక్ష్యంగా దాడి జరిగిందని, కాలంచెల్లిన ఇంటెలిజెన్స్ సమాచారం కారణంగా పొరపాటు జరిగిందని పేర్కొన్నాయి. అయితే పక్కా ప్లాన్‌తోనే ఈ దాడులు జరిపినట్టు ఇరాన్ విరుచుకుపడింది.

# చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించరు

## • ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్



విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: సిఎం చంద్రబాబు నాయుడి తీరుపై వైఎస్సార్‌సిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సిపి కేంద్ర కార్యాలయంలో అరుణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించరని చెప్పారు. పొత్తులు లేకుండా చంద్రబాబు ఎన్నికల్లో ఎప్పుడూ పోటీ చేయలేదు. ఎన్నికల్లో టిడిపి ఒంటరిగా పోటీ చేసి గెలిచిందా? గతంలో చంద్రబాబు ఎన్‌డియే నుంచి బయటకు వచ్చి మళ్లీ ఎందుకు కలిశారు? చంద్రబాబు గతంలో ప్రధాని మోడీని ఏమన్నారో గుర్తు చేసుకోవాలని. ప్రధాని మోడీని చంద్రబాబు వ్యక్తిగతంగా విమర్శించారు. దేశ ప్రతిష్టను మోడీ ఖూనీ చేస్తున్నారని, మోడీకి కుటుంబ విలువ తెలియదని కామెంట్ చేయలేదా? ఐటీ అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారో చెప్పాలి. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష పాత్రలో చంద్రబాబు ఐటీకి చేసిన కృషి ఏంటో చెప్పలగలరా? ఐటీకి ఫౌండేషన్ కూడా నేదురమల్లి జనార్ధన్‌రెడ్డి వేశారు. చంద్రబాబు ఐటీకి పితామహుడిలా చెప్పుకుంటున్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించరు. టిడిపి పెట్టినప్పుడు చంద్రబాబు ఏ పార్టీలో ఉన్నారు? కాంగ్రెస్‌లో ఉన్నారు. టిడిపిపై పోటీ చేశారు. అవసరమైతే ఎన్టీఆర్‌ను ఓడిస్తానని, సినిమావాళ్లకు రాజకీయాలు ఎందుకు? అని మాట్లాడింది చంద్రబాబే. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, పార్టీని లాక్కుంది చంద్రబాబే. పార్టీని, పార్టీ జెండాను, పార్టీ కార్యాలయాలను, పార్టీ అకౌంట్స్‌ను లాక్కుంది చంద్రబాబే. ఎన్టీఆర్ ఆశయాలకు చంద్రబాబు తూట్లు పొడిచారు. ఆశయాలతో ఎన్టీఆర్ వెన్నుపోటు పొడవటమే కాదు పథకాలన్నీ తొలగించారు. పథకాలన్నీ కాపీనే కదా? కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ చేస్తోంది. 6 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. కానీ ఎంత లెక్క వేసిన 40వేల ఉద్యోగాలేవస్తుంది. 6 లక్షల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో చంద్రబాబు చెప్పాలి అని అరుణ్‌కుమార్ విమర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో నవోదయ ప్రిన్సిపాల్ మృతి

హనుమాన్ జంక్షన్(కృష్ణా), మార్చి 29 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం వేలేరు గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న యదునందన్(59) స్కూల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడలో ఐఐటి కోచింగ్ తీసుకుంటున్న కుమార్తె వద్దకు కారులో వెళ్ళి నవోదయ స్కూల్ వద్దకు తిరిగి వస్తుండగా స్కూలుకు కూతవేటు దూరంలో ఆగిఉన్న టిప్పర్ లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాల పాలైన యదునందన్‌ను స్థానికులు వైద్యచికిత్స నిమిత్తం హనుమాన్ జంక్షన్‌లోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన జంక్షన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

మృతుని స్వస్థలం కర్నూల్ జిల్లా, ఎమ్మిగనూరు కాగా మరో ఆరునెలల్లో పదవీవిరమణ చేయాల్సి ఉండగా ప్రమాదం జరగటం బాధాకరం. ప్రిన్సిపల్ మృతిపట్ల గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విచారం వ్యక్తం చేసారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు.

# నేడు విజయవాడ కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

విజయవాడ, మార్చి 29 ప్రభాత వార్త: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం 30వతేదీ సోమవారం ఉదయం 10గంటలకు విజయవాడలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిగే ఈకార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా చెప్పారు.

డివిజనల్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లీనిక్‌లు నిర్వహిస్తున్నామని, ప్రజలు రెవెన్యూ సమస్యలను ఈ క్లీనిక్‌లలో అందచేయాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు.

# పిఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

## • ఎపిఎన్‌జిఓ అధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండ్



విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఎపిఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడ, ఎపి జెఎసి చైర్మన్ ఏ.విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విజయవాడ వెటర్నరీ కాలనీలోని అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం వ్యవసాయ ఉద్యోగుల సర్వీసెస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను నియమించకపోవటం ఆందోళన కలిస్తుందన్నారు. పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు పదవీవిరమణ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా రాకపోవటం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను ప్రాధాన్యతా క్రమంలో చెల్లించాలని కోరారు. వ్యవసాయశాఖ ఉద్యోగుల ప్రమోషన్‌ల అంశంలో ఎపిఎన్‌జిఓ సంఘం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను పరిష్కరించిందన్నారు. వ్యవసాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపిఎన్‌జిఓ సంఘం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఉద్యోగులపై పెట్టిన అక్రమ పోలీస్ కేసులు ఎత్తివేత, జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ చెల్లింపులు, సిపిఎస్ కాంట్రిబ్యూషన్, మెడికల్ బిల్లులు చెల్లింపులలో గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు మంజూరు విషయంలో సానుకూలత ఉన్నప్పటికీ పదవీవిరమణ చేసిన ఉద్యోగుల గ్రాట్యూటీ, సరెండర్‌లీవ్‌ల చెల్లింపులు ప్రారంభం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.రవికుమార్, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు డి.సత్యన్నారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్, గుంటూరు కార్యదర్శి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

30-3Pg5.qxd:30-3Pg5.qxd 1/1/02 6:00 AM Page 1





# డిఎంకె "ఇల్లతరసి"

## మేనిఫెస్టోలో స్టాలిన్ తాయిలాలు

**చెన్నై, మార్చి 29:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మరోమారు విజయం సాధించడమే లక్ష్యంగా అధికార డిఎంకె కూటమి అడుగులేస్తోంది. అందులో భాగంగా ఆదివారం సిఎం స్టాలిన్ ఎన్నికల తాయిలాలు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన డిఎంకె మేనిఫెస్టోను "సూపర్‌స్టార్" మేనిఫెస్టోగా సిఎం స్టాలిన్ అభివర్ణించారు. మేనిఫెస్టోలో భాగంగా "ఇల్లతరసి" పథకాన్ని ప్రకటించారు. పథకం కింద, ఆదాయపు పన్ను చెల్లించని గృహిణులందరికీ గృహోపకరణాలను కొనుగోలు చేయడానికి లేదా మార్చుకోవడానికి రూ.8,000 విలువైన కూపన్ ఇవ్వబడుతుందన్నారు. అంటే, వాషింగ్ మెసీన్, టివి, గ్రైండర్, మైక్రోవేవ్ తదితర గృహోపకరాలు కొనుక్కోవడానికి ఆర్థిక సాయం అందించనున్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.2 వేలు, రైతు లకు ఉచితంగా పంపుసెట్లు ఇస్తామని ప్రకటిం చారు. రూ.5 లక్షల వరకు వైద్య బీమాతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు పిల్లలకు అల్పాహార పథకాలు ప్రకటించారు..

# కేరళంలో ఇక కమలవికాసం

- యువత, మహిళలు మార్పు కోరుతున్నారు
- ఎన్‌డియేకు అనుకూలంగా పరిణామాలు
- పాలక్కాడ్ సభలో ప్రధాని మోడీ ధీమా
- రాష్ట్ర అప్పు రూ.5 లక్షల కోట్లైందని ఆందోళన



**పాలక్కాడ్, మార్చి 29:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా యువత, మహిళలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఆదివారం పాలక్కాడ్‌లోని కొత్త మైదాన్‌లో నిర్వహించిన బిజెపి ఎన్నికల సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. పవిత్రమైన కల్పతి ఆలయంలో ప్రార్థనలతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ, కేరళం యువత, మహిళల నుండి పెరుగుతున్న మద్దతు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏకు అనుకూలంగా రాజకీయ సెంటిమెంట్‌లో మార్పును ప్రతిబింబిస్తోందని అన్నారు. రాజకీయ హింసలో ప్రాణాలు కోల్పోయిన బిజెపి కార్యకర్తలకు నివాళి అర్పిస్తూ, "ఈ మార్పు కేరళం ప్రజల ఆశీస్సులతోనే సాధ్యమైంది" అని ఆయన అన్నారు. పాలక్కాడ్‌ను "కేరళ సహజ సౌందర్యానికి ముఖద్వారం"గా ప్రధాని మోడీ ప్రశంసించారు. దానిని ప్రతిభ, సాంస్కృతిక సంపదకు నిలయమైన భూమిగా అభివర్ణించారు. కేరళ సామాజిక నిర్మాణానికి శ్రీ నారాయణ గురు, చట్టంపి స్వామికల్, మన్నత్ పద్మనాభన్, అయ్యన్‌కాళి, కురియాకోస్ ఇలియాస్ చావరా వంటి ప్రముఖ సంఘ సంస్కర్తలు, ఆధ్యాత్మిక నాయకులు చేసిన శాశ్వతమైన సేవలను గుర్తిస్తూ ఆయన వారికి నివాళి అర్పించారు. తన రాజకీయ దాడిని మరింత తీవ్రతరం చేస్తూ, కేరళ నిరుద్యోగం, ఆర్థిక దుర్వినియోగం అనే సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ ఆరోపించారు. గత దశాబ్దంలో, యువతకు ఉపాధి కల్పించగల పరిశ్రమలను స్థాపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దశాబ్దాలుగా దుష్పరిపాలన, "ఓటు బ్యాంకు రాజకీయాలు" చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) రెండింటినీ విమర్శించారు. "కేరళ నేడు రూ.5 లక్షల కోట్లకు పైగా అప్పుల భారంతో ఉంది. ప్రశ్న ఏమిటంటే ఈ డబ్బు ఎక్కడికి పోయింది?" అని వరుస రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ఆర్థిక దుర్వినియోగంపై ఆరోపిస్తూ ప్రధాని ప్రశ్నించారు. పాలక్కాడ్ రాజకీయ చరిత్రను ప్రస్తావిస్తూ, దశాబ్దాలుగా ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి వామపక్ష, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించినా, ఇక్కడ పెద్దగా అభివృద్ధి జరగలేదని ప్రధానమంత్రి మోడీ పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతంలో స్పష్టమైన అభివృద్ధి మొదలైందని ఆయన పేర్కొన్నారు. కేరళలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే రేసులో ఎన్‌డియే బలంగా ఉందని ప్రధానమంత్రి మోడీ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ ప్రకటించారు. "అభివృద్ధి చెందిన కేరళను నిర్మించడానికి తాము (బిజెపి) కట్టుబడి ఉన్నాము. ఇది మోడీ హామీ" అని ఆయన అన్నారు. రాజకీయ వైరుధ్యాలపై పదునైన వ్యాఖ్యలు చేస్తూ, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ రెండూ ఒకరినొకరు బిజెపి "బి టీమ్" అని ఆరోపించుకుంటున్నప్పటికీ, బిజెపిపై దాడి చేయడమే వారి ఉమ్మడి లక్ష్యంగా ఉండటం చూస్తే, వారు నిజంగా ఎవరికి భయపడుతున్నారో స్పష్టమవుతుందని ప్రధానమంత్రి మోడీ అన్నారు. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లకు సంబంధించిన అవినీతి ఆరోపణలపై ఎన్‌డియే ప్రభుత్వం విచారణ జరుపుతుందని స్పష్టం చేశారు. "ఇప్పటివరకు ఏది మారలేదో, అది ఇప్పుడు మారుతుంది... కేరళ అభివృద్ధి చెందుతుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# అమెరికా వ్యాప్తంగా నోకింగ్స్ నిరసనలు

- 90 లక్షలమంది పాల్గొన్నట్లు అంచనా
- 50 రాష్ట్రాల్లోను ట్రంప్‌కు పెరిగిన వ్యతిరేకత
- లండన్, ప్యారిస్, రోమ్‌లలోనూ ట్రంప్‌వ్యతిరేక ర్యాలీలు



**మిన్నెసోటా, మార్చి29:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు, ఇరాన్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా, ఐరోపా వ్యాప్తంగా భారీ నిరసనలు వెల్లువెత్తాయి. "నో కింగ్స్" (రాజులు వద్దు) అనే నినాదంతో జరిగిన ఈ ర్యాలీలతో పలు నగరాలు దద్దరిల్లాయి. మిన్నెసోటా ఈ నిరసనలకు ప్రధాన కేంద్రంగా నిలిచింది. సెయింట్ పాల్‌లోని మిన్నెసోటా క్యాపిటల్ లాన్ వద్ద వేలాది మంది ప్రజలు గుమిగూడి తమ నిరసనను శాంతియుతంగా తెలియజేశారు. కొందరు ఆందోళనకారులు అమెరికా జెండాలను తలకిందులుగా పట్టుకుని దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని సూచించారు. మిన్నెసోటాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ పాల్గొన్నారు. ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా ఆయన తన స్ట్రీట్స్ ఆఫ్ మిన్నియాపాలిస్ పాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పోరాటం దేశానికి ఆశను అందిస్తోందని, ఈ ప్రతిగామి పీడకల ను కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాయని జోన్ బేజ్, నటి జేన్ ఫోండా, సెనేటర్ బెర్నీ సాండర్స్ వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నారు. దేశంలోని 50 రాష్ట్రాల్లో 3,100కు పైగా కార్యక్రమాలు జరగ్గా సుమారు 90 లక్షల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు అంచనా వేశారు. న్యూయార్క్ వంటి డెమోక్రాటిక్ నగరాల నుంచి ట్రంప్‌కు అధిక మద్దతు ఉన్న ఇడాహోలోని చిన్న పట్టణాల వరకు ఈ ర్యాలీలు జరగడం విశేషం. వాషింగ్టన్‌లో వందలాది మంది లింకన్ మెమోరియల్ నుంచి నేషనల్ మాల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ నిరసనలను వైట్‌హౌస్ కొట్టిపారేసింది. ఇవి కేవలం "లెఫ్టిస్ట్ ఫండింగ్ నెట్‌వర్క్" సృష్టించినవని, వీటికి ప్రజా మద్దతు లేదని అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ విమర్శించారు. నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెస్ కమిటీ కూడా వీటిని "అమెరికా ద్వేషపూరిత ర్యాలీలు"గా అభివర్ణించింది. అమెరికా వెలుపల లండన్, పారిస్, రోమ్ వంటి నగరాల్లోనూ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. రోమ్‌లో వేలాది మంది యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# తమిళనాట 'విజిల్ విప్లవం'

- డిఎంకె కూటమితోనే పోటీ
- డ్రగ్స్ రహిత రాష్ట్రం లక్ష్యం
- నిరుద్యోగ యువత, మహిళలకు ఆర్థిక సాయం
- టివికె చీఫ్ విజయ్ ఎన్నికల హామీలు
- 2 స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడి



**చెన్నై, మార్చి 29:** తమిళనాడులో ఈసారి అసెంబ్లీ ఎన్నికలలో "విజిల్ విప్లవం" సృష్టిస్తుందని టివికె చీఫ్ విజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ ఎన్నికల చిహ్నమైన "విజిల్"ను ప్రస్తావిస్తూ ఇది కేవలం ఎన్నికలు కావని, ఇదొక "విజిల్ విప్లవం" అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి భారీ బలం, బలగం లేని సాధారణ మధ్యతరగతి నేపథ్యం ఉన్నవారికే తాము టికెట్లు కేటాయించామని తెలిపారు. ఈ పోరు కేవలం తమ "ప్రజల కూటమి (టివికె)", ప్రస్తుత అధికార పక్షమైన "స్టాలిన్ కూటమి (డిఎంకె)" మధ్య మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల్లో మొత్తం 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు మరోమారు విజయ్ ప్రకటించారు. పార్టీ అధినేత విజయ్ స్వయంగా రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్నారు. విజయ్ తన పూర్తి పేరు "సి. జోసెఫ్ విజయ్" పేరుతో నామినేషన్ వేయనున్నారు. చెన్నైలోని పెరంబూర్ మధ్య తమిళనాడులో పట్టుకోసం తిరుచిరాపల్లి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేయనున్నారు. తమ అభ్యర్థులను "మక్కల్ కాప్పాలర్గల్"గా అభివర్ణించిన విజయ్ వారు రాజకీయ నాయకులు కాదని, ప్రజల్లో ఒకరని తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ చెన్నైలోని టి.నగర్ నుంచి ప్రచార విభాగం నేత ఆదవ్ అర్జున విల్లివాక్కం నుంచి పోటీ చేయనున్నారు. మాజీ మంత్రి కెఎ సెంగోట్టయన్ గోబిచెట్టిపాళయం నుంచి బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ పలు కీలక హామీలను ప్రకటించారు. తమిళనాడును డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడం, 29 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు నెలవారీ ఆర్థిక సాయం, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకతకు ప్రత్యేక చట్టం, విద్యార్థులకు రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# బెంగాల్‌లో తుది ఓటరు జాబితా విడుదల

- మాజీ ఎంపి తరుణ్ మోండల్ పేరు గల్లంతు
- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధం

**కోల్‌కతా, మార్చి 29:** పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (సర్) ఆరంభం నుంచి రాజకీయ వివాదంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధంతో మొదలై, సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ స్వయంగా న్యాయవాది అవతారమెత్తి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో జుడీషియల్ ఆఫీసర్ల నియమించింది కూడా. ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ శుక్రవారం, శనివారాల్లో 'సర్' తర్వాత రెండు విడతలుగా ఓటర్ల తుది సవరణ జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మాజీ ఎంపి పేరు గల్లంతవ్వడం విశేషం. లోక్‌సభ మాజీ ఎంపి తరుణ్ మోండల్ పేరు ఓటరు జాబితా నుంచి గల్లంతైంది. అయితే, ఆయన భార్య పేరు మాత్రం లిస్టులో ఉంది. దక్షిణ హౌరా అసెంబ్లీ నియోజకవర్గంలోని 279 నంబర్ బూత్‌లో ఆయన తన ఓటు హక్కును గతంలో కలిగి ఉండేవారు. కానీ, ఇప్పుడు సర్ రివిజన్ తర్వాత ఆయన పేరు జాబితాలోంచి తొలగించింది ఇసి. తరుణ్ మోండల్ 2009లో పశ్చిమ బెంగాల్‌లో ఎస్‌యుసిఐ నుంచి గెలుపొందారు. అప్పుడు ఆయనకు అటు కాంగ్రెస్, ఇటు టిఎంసి మద్దతు ఇచ్చింది. దీంతో ఆయన గెలుపొందారు. కానీ, ఇప్పుడు ఆయన పేరు ఓటరు జాబితాలోనే లేదు. ప్రస్తుతానికి ఆయన పేరును అండర్ కన్సిడరేషన్ కేటగిరిలో ఉంచారు. "సర్" అనంతరం సప్లిమెంటరీ ఓటర్ లిస్టును ఎలక్షన్ కమిషన్ శనివారం సాయంత్రం విడుదల చేసింది. ఇది మూడో జాబితా. అయితే, ఈ జాబితాలో ఎంతమంది పేర్లు తొలగించారు, ఎంతమంది పేర్లు చేర్చారు, మొత్తం ఓటర్ల వివరాలు వంటివి మాత్రం వెల్లడించలేదు. ఈ లిస్టును అడిషనల్ లిస్టుగా ఇసి పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో గత నెలలో 'సర్' పూర్తైంది. మొత్తంగా ఇప్పటివరకు పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షల ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. దీంతో గతంలో 7.66 కోట్లుగా ఉండే ఓటర్ల సంఖ్య తర్వాత 7.08 కోట్లకు చేరింది. తుది సవరణల అనంతరం ఇప్పుడు 7.04 కోట్ల ఓటర్లు కలిగి ఉన్నట్లు ఇసి తెలిపింది. 60 లక్షల ఓటర్లు జ్యుడీషియల్ స్క్రూటినీ కింద ఉన్నాయి.

# మూడోసారి అధికారంలోకి వస్తాం

- మతతత్వానికి వ్యతిరేకులం
- ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధీమా



**మలప్పురం, మార్చి 29:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం సిపిఐ (ఎం), ఎస్‌డిపిఐ ఒప్పందం జరిగిందన్న ఆరోపణలను కేరళ సిఎం పినరయి విజయన్ "అసత్యం" అని కొట్టిపారేశారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తిరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) మతతత్వానికి వ్యతిరేకంగా నిరంతరం బలమైన వైఖరిని కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం జిమ్మిక్కుల వల్ల కాదని, దాని పనితీరు ఫలితమేనని ఆయన నొక్కి చెప్పారు. "తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుండి, రాష్ట్రం పలు రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది" అని సిఎం విజయన్ అన్నారు. "ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన తనకు, ఎల్‌డిఎఫ్‌కు అనుకూలంగా స్పష్టమైన, బలమైన గాలి వీస్తున్నట్లు కనిపించింది. ప్రజలు దశాబ్ద కాలంగా అభివృద్ధిని, సామాజిక భద్రతను చూశారు. మౌలిక సదుపాయాలను ఆధునీకరిస్తూనే, సామాన్యుడి ప్రయోజనాలను కాపాడే "కేరళ నమూనా"పైనే మా దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఏప్రిల్ 9న భారీ మెజారిటీతో గెలుస్తామన్న నమ్మకం మాకుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు ఎస్‌డిపిఐ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) మద్దతును ప్రస్తావిస్తూ, "మెజారిటీ అయినా, మైనారిటీ అయినా, ఏ రంగు మతతత్వమైనా మన సామాజిక నిర్మాణానికి ముప్పు అని తాము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. గత 10 ఏళ్లుగా కేరళలో ఒక్క మత అల్లర్లు కూడా జరగకుండా ఎల్‌డిఎఫ్ చూసుకుంది. ఎందుకంటే తాము అలాంటి శక్తులతో రాజీపడము" అని అన్నారు. "అనేక నియోజకవర్గాల్లో ఆర్‌ఎస్‌ఎస్, యుడిఎఫ్ మధ్య ఒక స్పష్టమైన అవగాహన ఉంది. ఎల్‌డిఎఫ్‌ను ఓడించడమే వారి ఏకైక లక్ష్యం. బిజెపి బలమైన పోటీదారుగా లేని చోట, యుడిఎఫ్ అభ్యర్థులకే ఓటు వేయాలని ఆర్‌ఎస్‌ఎస్ తన కార్యకర్తలకు ఆదేశాలు కూడా జారీ చేసింది.

# భారతీయులకు అండగా నిలిచిన గల్ఫ్ దేశాలు

## సకాలంలో సాయం అందించినందుకు థాంక్స్: మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 29:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ చెప్పారు. కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంద్ది అని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# సహజీవనంపై రెండు బెంచ్‌ల విభిన్న తీర్పులు!

## విడాకులు తీసుకోవాలన్న ఒక బెంచ్
## సహజీవనం నేరం కాదన్న మరో కోర్టు

**న్యూఢిల్లీ, మార్చి 28:** వివాహితుల సహజీవనంపై కొన్ని రోజుల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టు రెండు పరస్పర విభిన్నమైన తీర్పులను వెలువరించింది. మార్చి 20న జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఇప్పటికే వివాహమై జీవిత భాగస్వామి బతికే ఉన్న వ్యక్తి ముందుగా విడాకులు తీసుకోకుండా చట్టబద్ధంగా మరొక భాగస్వామితో సహ జీవనంలోకి ప్రవేశించలేరని స్పష్టం చేశారు. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే డివిజన్ బెంచ్ ఇచ్చిన మరో తీర్పులో పెండ్లయిన పురుషుడు ఒక మహిళతో సహ జీవనంలోకి ప్రవేశించడం చట్ట ప్రకారం నేరం కాదని పేర్కొంది. మార్చి 20 నాటి కేసులో అప్పటికే వేర్వేరు భాగస్వాములతో వివాహం చేసుకున్న ఒక జంట తమ కుటుంబాల నుండి వస్తున్న బెదిరింపుల నుండి రక్షణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ బెంచ్ విచారించింది. తాము బార్యాభర్తలల్లా కలిసి జీవిస్తున్నామని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని వారు వాదించారు. అయితే వారిద్దరూ విడాకులు తీసుకోనందున వారి సంబంధం చట్ట విరుద్ధమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అభ్యర్థనను వ్యతిరేకించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన కోర్టు రక్షణ కల్పించడానికి నిరాకరించింది. పరస్పర మమకారంతో ఇద్దరు మేజర్లు కులం, మతం లేదా సామాజిక అడ్డంకులతో సంబంధం లేకుండా ఎటువంటి జోక్యం లేకుండా కలిసి జీవించే హక్కును కలిగి ఉన్నప్పటికీ ఈ హక్కు సంపూర్ణమైనది కాదని పేర్కొంది. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే అందుకు విరుద్ధంగా జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ వివాహితుడైన ఒక పురుషుడు, 18 ఏండ్ల యువతికి సంబంధించిన వేరొక కేసును విచారిస్తూ వివాహితుడైన పురుషుడు, మేజర్ అయిన మహిళతో పరస్పర అంగీకారంతో సహ జీవనం చేయడం నేరంగా పరిగణించరాదని స్పష్టం చేసింది. పెళ్లయిన పురుషుడు, మేజర్ అయిన మహిళతో ఆమె సమ్మతితో సహ జీవనం చేస్తున్నంత మాత్రాన అది నేరం కాదని, నైతికతను, చట్టాన్ని వేరుగా ఉండాలని డివిజన్ బెంచ్ తెలిపింది.



# అసోంలో కాంగ్రెస్ 5 గ్యారంటీలు

## ఆదివాసీలకు భూమి పట్టా
## అందరికీ ఆరోగ్య సంరక్షణ: ఖర్గే

**గువహటి, మార్చి 29:** అసోంలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. మరోవైపు ఓటర్లకు ఎన్నికల వరాలు గుప్పిస్తోంది. తాజాగా ఆదివారం నౌబోయిచాలో నిర్వహించిన ఎన్నికల సభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐదు గ్యారంటీలను ప్రకటించారు. "కాంగ్రెస్ అధికారంలోని వస్తే మహిళలకు నెలవారీ నగదు బదిలీ చేస్తాం. అంతేకాదు, వ్యాపారం ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి సిద్ధంగా ఉన్న మహిళలకు అదనంగా రూ.50వేలు సాయం అందిస్తాం. అన్ని కుటుంబాలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తాం. 10 లక్షల మంది ఆదివాసీలకు శాశ్వత భూమి పట్టాలు ఇస్తాం. రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.1250 చొప్పున ఇస్తాం. జుబీన్ గార్గ్ మృతి కేసులో 100 రోజుల్లో న్యాయం చేస్తాం" ప్రకటించారు. అసోంలోని బిజెపి ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రజలను దోచుకొని, ఢిల్లీలోని తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాను నింపడానికి అసోం బిజెపి తన డబుల్ ఇంజిన్‌ను ఉపయోగిస్తోందని దుయ్యబట్టారు. హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ప్రజలను భయపెడుతూ, భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. రాష్ట్ర ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన అసోం ఓటర్లను కోరారు.

# రష్యాలోని ఉస్త్‌లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



**మాస్కో, మార్చి 29:** ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్త్‌లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. బాల్టిక్ సముద్ర తీరంలో ఉన్న ఈ పోర్టులోని గ్యాస్ టెర్మినల్‌పై జరిగిన దాడితో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా, అక్కడి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు సమీపంలో ఉన్న ఉస్త్‌లుగా పోర్టు రష్యా ఇంధన ఎగుమతులకు అత్యంత కీలకమైన కేంద్రం. ఐరోపా, ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే అధిక మొత్తంలో చమురు, గ్యాస్ సరఫరా అవుతాయి. ఉక్రెయిన్ ప్రయోగించిన సుదూర శ్రేణి డ్రోన్లు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని, నేరుగా గ్యాస్ నిల్వ ట్యాంకర్లను ఢీకొట్టాయి. దీంతో అక్కడ పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించి, కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ గత కొంతకాలంగా ఇలాంటి దాడులకు పాల్పడుతోంది. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటోంది. తాజా దాడిలో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ దాడిని రష్యా రక్షణ శాఖ ధృవీకరించింది. కొన్ని డ్రోన్లను కూల్చివేశామని, మరికొన్ని లక్ష్యాన్ని ఛేదించాయని తెలిపింది. దీనిని ఒక ఉగ్రవాద చర్యగా అభివర్ణించిన రష్యా, తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్‌ను హెచ్చరించింది.

# పరప్పన అగ్రహార జైలులో ఖైదీలకు సెల్‌ఫోన్లు, టీవీలు!



**బెంగళూరు, మార్చి 29:** కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆ జైలులోని ఖైదీలు మొబైల్ ఫోన్లు, టీవీ వాడుతుతీరును చూపిస్తున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముగ్గురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు ఖైదీలు విలాసవంతమైన జీవితం గడుతున్నారు. ఖైదీలు మొబైల్ ఫోన్లు వాడటంతో పాటు టీవీ చూస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా యాక్సెస్ చేస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై కూడా చర్చించుకున్నారు. ఒక హత్య కేసులో రెండున్నర సంవత్సరాలకుపైగా జైలులో ఉన్న ఖైదీలు గతనెల 27న ఈ వీడియోను రికార్డ్ చేశారు. తమకు తెలిసిన బయట వ్యక్తులకు దీనిని షేర్ చేశారు. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు జైలు అధికారులు అప్రమత్తమయ్యారు. ఖైదీల గదుల్లో తనిఖీలు చేశారు. టాయిలెట్ బ్లాక్ సమీపంలోని భూగర్భ పైప్‌లైన్ ప్రాంతంలో మొబైల్ ఫోన్స్ దాచిపెట్టినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ముగ్గురు జైలు వార్డెన్లను సస్పెండ్ చేశారు. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఖైదీల అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి గత కొన్ని నెలలుగా కఠిన చర్యలు అమలు చేస్తున్నామని జైలు అధికారులు తెలిపారు. అయితే తమ ప్రయత్నాలను దెబ్బతీయడానికే ఈ వీడియో వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. జైళ్ల డీజీపీ అలోక్ కుమార్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏదైనా అంతర్గత కుట్ర జరుగుతున్నదా అన్నది కూడా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పాక్ మాజీ ఆర్మీచీఫ్ ఖ్వామర్ జావేద్ బాజ్వా కన్నుమూత

**రావల్పిండి, మార్చి 29:** పాకిస్తాన్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఖ్వామర్ జావేద్ బాజ్వా కన్నుమూశారు. రావల్పిండిలోని మిలిటరీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. బాజ్వా మరణవార్త పాకిస్తాన్ రాజకీయ, సైనిక వర్గాలలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, సైనిక అధికారులు తమ సంతాపం తెలిపారు. 2026 ఫిబ్రవరిలో బాత్రూంలో జారిపడటంతో ఆయనకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. దేశ రాజకీయాలు, అధికారంపై ప్రగాఢ ప్రభావం కలిగిన బాజ్వా, పాకిస్తాన్ సైన్యంలో అత్యంత శక్తివంతమైన జనరల్స్‌లో ఒకరిగా నిలిచారు. 2016 నవంబర్ నుండి 2022 నవంబర్ వరకు, దాదాపు ఆరేళ్లపాటు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేశారు. 2022లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా, కమర్ జావేద్ బాజ్వా తన సంపద, రాజకీయ ప్రకటనల కారణంగా వార్తల్లోనే నిలిచారు. తన పదవీకాలంలో భారీగా సంపదను కూడబెట్టారని కూడా ఆరోపణలు వచ్చాయి. ఇది పాకిస్తాన్‌లో రాజకీయ దుమారానికి కారణమైంది.

# పశ్చిమాసియాలో మంటలు

## దక్షిణ ఇజ్రాయెల్‌పై హౌతీల క్షిపణి దాడులు

### ఇరాన్‌కు మద్దతుగా యుద్ధరంగంలోకి హౌతీలు

**బీరూట్, మార్చి 29:** మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. హౌతీలు నేరుగా ఈ ఘర్షణలోకి ప్రవేశించి, ఇజ్రాయెల్‌పై క్షిపణులను ప్రయోగించడంతో ఇది ఇప్పుడు ఒక కొత్త, నిర్ణయాత్మక మలుపు తీసుకుంది. ఈ ఘర్షణ ఇప్పుడు ఇరాన్, లెబనాన్‌ఇజ్రాయెల్ సరిహద్దు, ఇప్పుడు యెమెన్‌లో ఒక కొత్త సరిహద్దు తెరుచుకోవడంతో మూడు రంగాలకు విస్తరించింది. యెమెన్ నుండి ఒక క్షిపణిని ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించింది, అయినప్పటికీ పెద్ద నష్టం ఏదీ జరగలేదని వెల్లడించింది. ఎందుకంటే ఇది యుద్ధ ప్రమాదాన్ని పెంచుతుంది. యుద్ధం ప్రారంభమై నెల రోజుల తర్వాత హౌతీల మొదటి సైనిక చర్యగా చెపుతున్నారు. ఇరాన్, లెబనాన్ (హిజ్బుల్లా), ఇరాక్, పాలస్తీనా (హమాస్)పై దాడులకు వ్యతిరేకంగా ఈదాడి చేశామని వారు ప్రకటించారు.

## యుద్ధ చర్చలకు వేదికగా ఇస్లామాబాద్

**ఇస్లామాబాద్; మార్చి 29:** ఇరాన్ యుద్ధం ఆపడానికి తెర వెనక దౌత్య చర్చలు ప్రారంభమయ్యాయి. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా యూఎస్‌ఇరాన్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈజిప్ట్, టర్కీ విదేశాంగ మంత్రులు పాకిస్తాన్ చేరారు. సౌదీ అరేబియా ఫారిన్ మినిస్టర్ కూడా ఈ చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ మొత్తం చర్చల్లో కీలక పాత్ర పోషిస్తోంది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఈజిప్ట్ బదర్ అబ్దెలాటీతో సమావేశమయ్యారు. సంయమనం, ఉద్రిక్తతల్ని తగ్గించడం, చర్చలు, దౌత్యం ద్వారా వివాదాన్ని పరిష్కరించాల్సిన అవసరాన్ని ఇరువురూ నొక్కి చెప్పారు. పాక్ మంత్రి టర్కీ విదేశాంగ మంత్రి హకాన్ ఫిడాన్‌తో కూడా భేటీ అయ్యారు. ఇరాన్ పరిణామాల గురించి ఇరువురు చర్చించారు. ఈ విషయంపై భారత విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. భారత్ పాకిస్తాన్ లాగా బ్రోకర్ దేశం కాదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ నౌకలకు హార్ముజ్ జలసంధిలో అనుమతి

**టెహ్రాన్; మార్చి 29:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్థాన్ కు చెందిన 20 నౌకలు హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ థర్ స్వయంగా ప్రకటించారు. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం శాంతికి సంకేతం అని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రతిరోజూ రెండు పాకిస్థాన్ జెండా నౌకలు ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా వెళ్లేందుకు అనుమతి లభించింది. పాకిస్థాన్ జెండాతో ఉన్న మరో 20 నౌకలు హార్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నానని, ఇది ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే నిర్మాణాత్మక చర్య అని ఇషాక్ దార్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## మధ్యవర్తిత్వ చర్చలకు సిద్ధమే, షరతులు వర్తిస్తాయి!

**టెహ్రాన్, మార్చి 29:** అమెరికా, ఇరాన్ మధ్య గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలంటే అమెరికా తమ ఐదు షరతులను తప్పనిసరిగా అంగీకరించాలని స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతుల్లో ప్రధానంగా తమ భూభాగంపై, ముఖ్యంగా ఇంధన వనరులపై అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని విధించిన వాణిజ్య, చమురు ఆంక్షలన్నింటినీ పూర్తిగా ఎత్తివేయాలని కోరింది. అలాగే, పశ్చిమాసియా ప్రాంతం నుంచి, ముఖ్యంగా తమ సరిహద్దుల నుంచి అమెరికా సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది.

30-3Pg6exHMNWJQE.qxd:30-3Pg6exHMNWJQE.qxd 1/1/02 6:03 AM Page 1





## తిరుపతిలో వైభవంగా టిడిపి ఆవిర్భావ వేడుకలు

తిరుపతి, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: పేదల అభ్యున్నతి కోసం స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు తిరుపతిలో ఆ పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. తిరుపతిలోని టౌన్ క్లబ్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పార్టీ జెండాను ఎగురవేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యుగపురుషుడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ తరతరాల తెలుగు వారి ఆకాంక్షలకు ప్రతిరూపమని. పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నామన్నారు. పార్టీ స్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజాసేవే పార్టీ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మన్నూరు సుగుణమ్మ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, రాష్ట్ర పార్టీ నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, పుష్పావతి యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులిగోరు మురళి, కంకణాల రజినీకాంత్ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తాగునీటి ప్రాజెక్టులపై ఫోకస్

**● అన్నమయ్య చిత్తూరు జిల్లాలలో 5,256 కోట్ల గండికోట నుంచి సవ్వడి చేయనున్న కృష్ణా జలాలు ● కాకినాడ, అనకాపల్లి జిల్లాలతోపాటు ఆరు నియోజకవర్గాలకు ప్రతి ఇంటికి నీరు ● రూ.6985 కోట్లతో ప్రభుత్వం జీవో జారీ**





కాటిమాయకుట దగ్గర జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాజంపేట, మార్చి29 ప్రభాతవార్త: కరవు పీడిత ప్రాంతాలైన చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాలతో పాటు కాకినాడ, అనకాపల్లి జిల్లాలలో పూర్తి గాను, మరో ఆరు నియోజకవర్గాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పూర్వోదయ, సాస్కి, జలజీవన్ మిషన్‌తో పాటు ప్రపంచ బ్యాంకు నిధులతో ఈ వాటర్ ప్రాజెక్టులు చేపట్టాలని రెండు రోజుల క్రితం జీవో నెంబర్ 53 ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఏడు ప్రాజెక్టులను ప్రాధాన్యతగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమలోని అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు రూ.5256 కోట్ల వ్యయంతో పనులు చేపడతారు. మొదటి విడత అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గంలో పాటు పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో పనులు చేపట్టేందుకు ఇప్పటికే రూ.2370 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు కూడా ప్రారంభించారు. ఇందులో రాయచోటి మునిసిపాలిటీకి మాత్రం ఇదే నియోజకవర్గంలోని వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా 0.327 టిఎంసిల నీటిని కేటాయించారు. మిగతా పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గం గండికోట నుంచి కృష్ణ జలాలను తరలిస్తారు.

రెండో ఫేసులో చేపట్టే మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజక వర్గాలతో పాటు చంద్రగిరి నియోజక వర్గంలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాలెం మండలాలకు కూడా కృష్ణా జలాలను గండికోట ప్రాజెక్టు నుంచి అందిస్తారు. 1, 2 పేజ్‌లలోని ఏడు నియోజకవర్గాలకు గండికోట ప్రాజెక్ట్ నుంచి 2.709 టిఎంసిల నీటిని కేటాయించినట్లు అన్నమయ్య జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్. ఎస్.ఇ. సురేష్ కుమార్ 'వార్త' ప్రతినిధికి తెలిపారు. కృష్ణా జలాలను గుర్రంకొండ వద్ద నిర్మించే 135 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి సరఫరా చేస్తారు. 1 పేజ్‌కు 75 ఎంఎల్‌డిలు కేటాయించారు. 2276 నివాస ప్రాంతాలకు కృష్ణ జలాలు, 937 నివాస ప్రాంతాలకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేస్తారు. ఇదిలా ఉండగా జీవో 53 ప్రకారం చిత్తూరు జిల్లాకు రూ.2826 కోట్లతో గండికోట నుంచి కృష్ణ జలాలను, ఏలూరు రిజర్వాయర్ నుంచి కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు తాగునీటి అందించేందుకు రూ.3691 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో ఫేస్ 10కింద హీర మండలం రిజర్వాయర్ నుంచి టెక్కలి, నరసాపురం నియోజక వర్గాలకు నీరందించేందుకు రూ.1204 కోట్లు, అనంతపురం జిల్లాలో పిఎబిఆర్ రిజర్వాయర్ రిజర్వాయర్ ద్వారా ఉరవకొండ నియోజకవర్గంకి నీరందించేందుకు రూ.480 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గానికి



కలిచర్ల వద్ద జరుగుతున్న నీటి పథకం పనులు

రూ.390 కోట్లు, అవుకు రిజర్వాయర్ ద్వారా బనగానపల్లె నియోజకవర్గం రూ.510 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ధవలేశ్వరం బ్యారేజ్ నుంచి నర్సరీ కేంద్రం కడియంతో పాటు మరికొన్ని నివాస ప్రాంతాలకు నీరందించేందుకు రూ.194 కోట్లు కేటాయించారు.



వటపత్ర సాయి అలంకారంలో మురిపిస్తున్న శ్రీరాముడు

## వటపత్ర సాయికి శ్రీరామ లాలి సింహ వాహనంపై భక్తులకు దర్శనం

**● మూడో రోజు ఒంటిమిట్టలో శ్రీరామ బ్రహ్మోత్సవాలు**

రాజంపేట, మార్చి 29 ప్రభాతవార్త: ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరాయి. ఆదివారం శ్రీరామచంద్రుడు వటపత్ర సాయిగా అలంకారంలో ఉదయం దర్శనమిచ్చి, రాత్రి సింహాసనంపై పురవీధులలో విహరించారు. గ్రామోత్సవం కన్నుల పండుగగా సాంస్కృతిక సేవా వైభవంతో సాగింది. మర్రి ఆకుపై శయనించిన బాలకృష్ణుని రూపంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు.

**మాడవీధుల్లో ఆధ్యాత్మిక పరవశం:** సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై వటపత్రశాయిగా కొలువుదీరిన రామయ్యను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ మాడవీధుల్లో స్వామివారు ఊరేగుతుంటే, భక్తజనం 'జయ జయ రామ, కోదండరామ' అంటూ స్వామిని కీర్తించారు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కాంక్షిస్తూ దారిపొడవునా కర్పూరాలను వెలిగించి స్వామికి భక్తితో సమర్పించారు. కర్పూర జ్యోతుల వెలుగులో మర్రి ఆకుపై చిరునవ్వు చిందిస్తున్న రామయ్య రూపం భక్తుల హృదయాలను పులకింపజేసింది.

**కళాకారుల అద్భుత నృత్య ప్రదర్శనలు:** ఊరేగింపు ముందు సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వందలాది మంది కళాకారులు లయబద్ధంగా కోలాటం ఆడుతూ, రామకీర్తనలు పాడుతుంటే మాడవీధులన్నీ భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. జానపద నృత్యాలు తప్పెటగుళ్ళు, కొమ్ము నృత్యాలు, హరిదాసుల కీర్తనలు ఈ ఆధ్యాత్మిక వేడుకకు మరింత శోభను చేకూర్చాయి. శాస్త్రీయ నృత్య కళాకారులు రాముని లీలలను అభినయిస్తూ చేసిన ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

పురాణ గాథల ప్రకారం ప్రళయ కాలంలో లోకాలను తన కుక్షి లో దాచుకుని, మర్రి ఆకుపై శయనించే ఆ పరమాత్ముని 'వటపత్రశాయి' రూపంలో దర్శించుకోవడం వల్ల సకల పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. ఈ దివ్య వేడుకను వీక్షించిన భక్తులు కోదండరాముని కటాక్షం తమపై ఉండాలని ప్రార్థించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. మరోవైపు సీతారాముల కల్యాణం నాటికి ఒంటిమిట్టలో 85 వేల తిరుమల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. మూడు వందల మంది శ్రీవారి సేవకులు లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.



ఒంటిమిట్ట సీతారాముల కల్యానికి సిద్ధమవుతున్న శ్రీవారి లడ్డూలు

# పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధి

**● కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి**



నూజివీడు, మార్చి 29 ప్రభాతవార్త: నూజివీడు మండలంలో పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రూ 1.64 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అంతా దీవించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలు కల్పన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు రైతులకు గిట్టుబాటు ధరను అందించుటకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేశామని తెలిపారు. పండించిన పంటలకు రైతులు తమకు నచ్చిన రైసు మిల్లులకు తోలుకునే స్వేచ్ఛను కల్పించి, గిట్టుబాటు ధరను నిర్ణయించి 48 గంటల్లో రైతులు ఖాతాలో సొమ్మును జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు బకాయిలు పెట్టిన రూ.1650 కోట్లు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఆధునిక యంత్రాలు ఒకటి కూడా అందించలేకపోయారని, కనీసం బరకం ముక్క కూడా ఇవ్వలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉన్నారని, ఐటి మంత్రి లోకేష్ సారధ్యంలో అన్ని రంగాలల్లో రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జి.భద్రు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నాడు పేదరిక నిర్మూలన కోసం పార్టీ నేడు రాష్ట్రాభివృద్ధి కోసం కృషి

**● మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు**



శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త: సుమారు 44 సంవత్సరాల క్రితం నందమూరి తారక రామారావు సమాజంలో పెరిగిపోతున్న పేదరికాన్ని నిర్మూలించుటకు రాజకీయంలో పెత్తందారి విధానాలపై తిరుగుబాటు చేసి తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే నేడు మన రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ అధినేత ఆహర్నిశలు కృషి చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు సమాజంలో అరాచక శక్తుల ప్రాబల్యం అధికంగా ఉండేవని కేంద్రప్రభుత్వ పెత్తనంలో రాష్ట్రాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని దాంతో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ ముందడుగు వేసారన్నారు. ఆ నాటి నుంచే తాము రాజకీయ ప్రస్థానం ప్రారంభించామన్నారు. 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో జనాల్లోకి వచ్చారన్నారు. రాజకీయాల్లో పెను మార్పులు తెచ్చిన మహనీయుడు ఎన్‌టిఆర్ అన్నారు. రాజకీయ ప్రక్షాళనకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు కూడుగుడ్డ గూడు అనే నినాధాలతో ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించి సంచలనం సృష్టించారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చుటకు శ్రీభాగ్ వడంబడిక ప్రకారం చెన్నైకు కృష్ణ నుంచి 5 టిఎంసిల నీటిని ఇవ్వటానికి పైప్ లైన్ల ద్వారా అందించే పథకాన్ని స్వరూపం మార్చి తెలుగుగంగ పథకంగా పేరు మార్చి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన భూములను డెల్టాలుగా మార్చిన అపర భగీరథుడు అన్నారు. ఆ నాటి స్ఫూర్తితో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల విషయంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా 'పోలవరం' ప్రాజెక్టు, రాష్ట్ర రాజధానికి సంబంధించి చేస్తున్న చేపడుతున్న చర్యలు రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చేస్తుందన్నారు. ఇక యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు ఆయన చేపడుతున్న కృషి యువత ఎన్నటికి మరువరన్నారు. పార్టీ సినియర్ నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ శ్రేణుల పోరాటం ఫలితమే అధికారం

**● ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ**



విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: గత వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు చేసిన పోరాటం, పడిన కష్టం వల్లే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న పార్టీని స్థాపించి, తెలుగువారి కీర్తికి పునాది వేశారని గ్రీష్మ కొనియాడారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సభా నిర్వాహకురాలిగా వ్యవహరించిన గ్రీష్మ, పార్టీ ప్రస్థానాన్ని, నాయకుల దార్శనికతను గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాలను అక్కున చేర్చుకుని ముందుకు నడిపించిన ఘనత తెలుగుదేశం పార్టీదని ఆమె కీర్తించారు. 2019-4 మధ్య కాలంలో "సుపరిపాలనకు తొలి అడుగు, మన టిడిపి, ఐటిడిపి, బాబు షూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ" వంటి కార్యక్రమాలను కార్యకర్తలు తమ భుజాలపై వేసుకుని విజయవంతం చేశారని ప్రశంసించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన 19 మంది సామాన్య కార్యకర్తలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమానంగా వేదికపై కూర్చోబెట్టి గౌరవించిన ఏకైక పార్టీ టిడిపి అని ఆమె పేర్కొన్నారు.

యువనేత, మంత్రి నారా లోకేశ్ నాయకత్వ పటిమపై గ్రీష్మ ప్రశంసల వర్షం కురిపించారు. లోకేశ్ తీసుకొచ్చిన నూతన విధానాలతో పార్టీ సభ్యత్వ నమోదు కోటి మార్కును దాటిందని తెలిపారు. "యువగళం పాదయాత్రలో లోకేశ్ మీసం మెలేస్తే 2024లో ప్రజలు బంపర్ మెజారిటీ ఇచ్చారు. ఆయన మన సమస్యలు విని, పరిష్కారం కోసం పోరాడే యోధుడు" అని అభివర్ణించారు. కార్యకర్తలకు జీవిత బీమా అందించి ధీమా కల్పించారని అన్నారు. అదేవిధంగా, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ 24 గంటలూ కార్యకర్తల కోసం ఆలోచిస్తూ, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, బంపర్ మెజారిటీ సాధించినా గర్వం లేకుండా కార్యకర్తలా పనిచేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక దార్శనికుడని, రాష్ట్రాన్ని శూన్యం నుంచి శిఖరాలకు తీసుకెళ్లగల నాయకత్వ పటిమ ఆయన సొంతమని గ్రీష్మ అన్నారు. "పాలన అంటే కేవలం అధికారంలో ఉండటం కాదు, ప్రజల భవిష్యత్తును నిర్మించడం అని నిరూపించిన నాయకుడు చంద్రబాబు. నాయకత్వం అంటే మార్గం చూపించడం కాదు, మార్పు తీసుకురావడం అని చూపించారు. శ్రీవారి పాదాల చెంత ఉన్న నారావారిపల్లెలో పుట్టి, నేడు గ్లోబల్ స్థాయికి ఎదిగి సిబిఎన్ ఒక బ్రాండ్‌గా మారడం ఆయన నాయకత్వానికి నిదర్శనం" అని ఆమె ఉద్ఘాటించారు. ఇదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేస్తే 2029 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ధీమా వ్యక్తం చేశారు.

# 'భూములిచ్చిన రైతులకు న్యాయం చేయండి'

విజయవాడ, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ఎపిలోని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు గతంలో ఇస్తామన్న నివాస, వాణిజ్య ప్లాట్లతో పాటు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం అదనంగా నష్టపరిహారం కూడా చెల్లించాలని కోరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "ఒక రైతుగా అడుగుతున్నా. నా అమరావతి రైతు సోదరుల కోసం అధికార పార్టీని అడుగుతున్నా. 2015లో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతుల్లో ఎవరైనా వారికి కేటాయించిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోగలిగారా? వారిలో ఏ ఒక్క రైతు అయినా వారికిచ్చిన కమర్షియల్ స్థలంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్ కట్టగలిగారా? ఈ 11 ఏళ్ళ కాలంలో వారికి కేవలం ఏడాదికి ఇంత అని నామ మాత్రంగా డబ్బు ఇవ్వటం వల్ల కలిగిన లాభం ఏమిటి? రైతుల త్యాగాలు వెల కట్టలేనివి అని నిన్న శాసన సభలో పలువురు సభ్యులు చెప్పారు. ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల రైతులకు న్యాయం జరగదు. భూములు ఇచ్చిన రైతులకు స్థలం మాత్రమే కాకుండా, అదనంగా ఫెయిర్ కాంపిన్సేషన్ చట్టం 2013 ప్రకారం నష్ట పరిహారం ఇవ్వండి. అసైన్డ్ భూముల విషయంలో ఒరిజినల్ హక్కుదారులకే నష్ట పరిహారం ఇవ్వండి. నిరుపేదలకు గత ప్రభుత్వం కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను మీరెందుకు రద్దు చేశారు? ఆ ప్లాట్లను ఆ నిరుపేదలకే తిరిగి ఇవ్వండి. ఒక వైపు లక్షల కోట్లతో రాజధాని కడతాం అంటున్నారు. మీరు కట్టండి కానీ, ఆ భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయనట్టయితే, ఆ నిర్మించే భారీ భవనాల పునాదులు ఎవరి భూముల్లో నిర్మిస్తున్నారో వారికే సంతృప్తి, సంతోషం కలిగించనట్టయితే ఏమిటి ప్రయోజనం? అలా నిర్మించే రాజధాని వల్ల ఏ ధనికులకి, బూర్జువాలకి లాభం కలుగుతుందో ప్రజలు కూడా ఆలోచన చేస్తారని మీరు కూడా గమనించండి" అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## శివయ్యసేవలో తమిళనాడు మాజీ సిఎం



శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సేవలో ఆదివారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం వారి పరివారంతో విచ్చేసారు. వారికి దక్షిణ గోపురం వద్ద స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. కాగా ఆలయం తరఫున ఇఓ బికె వెంకటేశులు, ఎఇఓ మోహన్, పిఆర్‌ఓ రవి, వేదపండితులు, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఆలయ ఇఓ వెంకటేశు వెంటనే ఆలయ డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం నాయుడును ఆదేశించారు. సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. వేదపండితులచే రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. తరువాత అంతరాలయ దర్శనంతో పాటు మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## దత్తాత్రేయ ఆలయంలో ఏప్రిల్ 1, 2న అర్ధమండల దీక్ష మాలధారణ



తిరుపతి, మార్చి 29 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలో సిద్ధిపొందిన దత్తాత్రేయ స్వామి అర్ధమండల దీక్షమాలధారణ ఏప్రిల్ 1, 2తేదీల్లో మొదలవుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. మాలధారణకు సంబంధించి మాలలు భక్తులకు ఆలయం వద్ద ఇవ్వబడుతుందని, భక్తులు స్వామిదీక్ష తీసుకుని దత్తాత్రేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే ఆలయంలో కలశ మహోత్సవం, దత్తాత్రేయ స్వామి తిరునాళ్ళు సందర్భంగా దత్త దీక్ష స్వీకరించిన స్వాములు దీక్ష విరమణ జరుగుతుందన్నారు. ఆలయంలో ప్రతి శుక్రవారం ఉదయం బృందావనార్చన సేవ, శనివారం రాత్రి పల్లకీ సేవ స్వామివారికి విశేషంగా నిర్వహించబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99089 73699, 99487 42865 నంబర్లకు సంప్రదించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోరారు.

# రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిది కాదా?

**● మూడు పార్టీలు విడిపోతాయనే భయంతోనే చట్టబద్ధత హైడ్రామా ● వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి**

అనంతపురం, మార్చి 29 ప్రభాతవార్త బ్యూరో: విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిది కాదా అని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఐదేళ్ల ప్రస్తుతం రెండేళ్ల రాజధాని పేరిట అప్పులు చేసి పనులు చేపడుతున్నారని కేంద్రం విభజన చట్ట ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత ఎందుకు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. రాజధాని అమరావతే అంటూ అసెంబ్లీలో తీర్మాణం చేయడం ఒక హైడ్రామా అని, కూటమి నేతలు నడిపారని ఆయన విమర్శించారు. గతంలో ఐదేళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు అమరావతి కోసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేసి తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక అమరావతి పేరిట కాలం గడిపారన్నారు. నేడు మరోమారు అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోనే అమరావతి రాజధాని అభివృద్ధి అంటూ రూ.48 వేల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం రాజధాని నిర్మాణం విభజన చట్టంలోనే నిర్మాణ బాధ్యత కేంద్రానిది కాదా అని ఆయన ప్రశ్నించారు. కేవలం రాజధాని ప్రాంతంలో ఉన్న నాటి మంత్రులు, టిడిపి నేతల భూముల రేట్లు పెంచుకునేందుకే హక్కు అమరావతి (అమరావతి వద్దే) అంటూ చట్టబద్ధత చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేయడానికా అని ఆయన ప్రశ్నించారు. మరోసారి జగన్ ముఖ్యమంత్రి అవుతారన్న భయం వారిలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అందుకే చంద్రబాబు మరోమారు వైకుంఠపాలి ఆడవద్దని మాట్లాడుతున్నారన్నారు.



అమరావతిపై ఉన్న శ్రద్ధ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధిపై ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ ఉక్కు ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడంపై తీర్మాణం చేయాలని, వీటి గురించి పట్టించుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేపడుతున్నారని ఆయన విమర్శించారు. విలేకర్ల సమావేశంలో వైఎస్ఆర్‌సిపి బిసి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగన్న, జానీ, కేశవరెడ్డి, మైనార్టీ నాయకులు ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
26
వార్త
సోమవారం 30, మార్చి 2026





# వైభవంగా అప్పన్న స్వామి కళ్యాణం

## వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

సింహాచలం, మార్చి 29, ప్రభాతవార్త

సింహగిరిపై కొలువైన నిత్య కళ్యాణమూర్తి అప్పన్న స్వామి పరిణయోత్సవం భక్త జనులకు ఆనంద పరవశం కలిగించింది. అనాదిగా వస్తున్న 8వ పేజీలో

# విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా ముత్తింబకు అభిషిక్త్ కిషోర్

## ప్రస్తుత కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బదిలీ

విశాఖపట్నం, మార్చి 30, ప్రభాతవార్త




విశాఖపట్నం జిల్లా నూతన కలెక్టర్‌గా ముత్తింబకు అభిషిక్త్ కిషోర్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అభిషిక్త్ కిషోర్ 2015 బ్యాచ్‌కు చెందిన ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ప్రాథ మిక విద్య అనంతరం ఇంజనీరింగ్ చదివారు. సివిల్ సర్వీస్‌లో మంచి ర్యాక్ సాధించి ఐఏఎస్ అధికారి అయ్యారు. గతంలో వివిధ కీలక బాధ్యతల్లో తన ముద్ర వేసుకున్న కిషోర్ కృష్ణా జిల్లాలో ట్రైనీ కలెక్టర్ గా తన కెరియర్ ప్రారంభించారు. విజయవాడలో సబ్ కలెక్టర్ గా పని చేసిన కాలంలో భూముల సమస్యలు, పరిపాలనా పరమైన అంశాల్లో చురుగ్గా వ్యవహరించారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గా కూడా బాధ్యతలను నిర్వహించారు. వీరు విశాఖకు రాక ముందు కిషోర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వర్తించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంలో దిట్టగా పేరొందారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవాలను తెలుసుకుని పనిచేయడం శైలిగా ఉన్న కిషోర్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో సాంకేతికతను సూపర్ గా వాడతారని పేరుంది. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ గా వచ్చిన ఆయన నగరాభివృద్ధి, పర్యాటక రంగం పెంపుదల, పారిశ్రామిక రంగ సమస్యలపై కిషోర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని అందరూ ఆశిస్తున్నారు. నెల్లూరు జిల్లా లో మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అభిషిక్త్ కిషోర్ విధుల్లో నిజాయితి, క్రమశిక్షణకు మారు పేరు గా పేరొందారు. ఆయన మార్క్ పాలనలో విశాఖ మరింత ప్రగతిని అందుకుంటుందని సర్వత్రా ఆశిస్తున్నారు.

# నర్సీపట్నంలో ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




# చరిత్ర తిరగరాసిన విశాఖ పోర్టు

## 362 రోజుల్లో 90.29 ఎంఎంటీ సరకు రవాణా -సిబ్బందిని అభినందించిన పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు




విశాఖపట్నం, మార్చి 30, ప్రభాతవార్త

తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖ పోర్టు మరో చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 90.29 మిలియన్ మెట్రిక్ టన్నుల (90,298,591ఎంఎంటీ) అత్యధిక వార్షిక సరకు రవాణాను నమోదు చేసి సరికొత్త రికార్డును నెలకొల్పింది. దీంతో గతేడాది నమోదైన 82.62 ఎంఎంటీ (82,621,459టన్నులు) రికార్డును అధిగమించి, కొంగొత్త చరిత్రను లిఖించినట్టయింది. ఈ ఏడాది మార్చి 28న కేవలం 362 రోజుల వ్యవధిలోనే ఈ లక్ష్యాన్ని పోర్టు చేరుకోవడం విశేషం. విశాఖ పోర్ట్ సమర్థవంతమైన నిర్వహణ, వ్యూహాత్మక ప్రణాళికలు, అన్ని భాగస్వామ్య సంస్థల మధ్య ఉన్న సమన్వయానికి ఈ రికార్డు అద్దం పడుతోందని అధికారులు తెలిపారు.

**ఉద్యోగులు, అధికారులు, భాగస్వామ్య సంస్థలకు అభినందనలు..**

ఈ ఘనత సాధించడంలో భాగస్వాములైన ఉద్యోగులు, అధికారులు, పోర్టు 8వ పేజీలో

# తెలుగు ఆత్మగౌరవానికి ప్రతిబింబం తెలుగుదేశం

## ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా



భీమిలి, మార్చి 29, ప్రభాతవార్త

తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ ఎన్టీఆర్ సంక్షేమ పథకాలకు ఆద్యుడని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం సందర్భంగా ఆదివారం భీమిలి పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగుర వేసిన అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 2 కిలో బియ్యం, పక్కా ఇళ్లు, పెన్షన్ వంటి పథకాలను 44 ఏళ్ల కిందటే పేద ప్రజలకు అందించిన ఎన్టీఆర్ ను కారణజన్ముడిగా అభివర్ణించారు. సీఎంగా పని చేసిన టి.అంజయ్యను రాజీవ్ గాంధీ అవమానించిన తీరుకు ఎన్టీఆర్ ఆవేదన చెందారన్నారు. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వర స్వామి తదితర పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరైన ఎన్టీఆర్ ను తెలుగు ప్రజలు దేవుడిగానే చూస్తారని తెలిపారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు.. అనే నినాదంతో పార్టీ పెట్టిన 9 నెలల్లో వందేళ్ల 8వ పేజీలో

# మరిడి మహాలక్ష్మి జాతరకు సర్వం సిద్ధం

## ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, నర్సీపట్నం గ్రామ దేవత శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 31, ఏప్రిల్ 1వ తేదీల్లో అంగరంగ వైభవంగా జరగనున్న ఈ వేడుకల ఏర్పాట్లను గౌరవ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జాతర పురస్కరించుకుని ఇప్పటికే నర్సీపట్నం పట్టణమంతా విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా మారింది. ఆదివారం సాయంత్రం ఆలయ పరిసరాలను సందర్శించిన అయ్యన్నపాత్రుడు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు, పోలీసు 8వ పేజీలో



# జనావాసాల మధ్య జ్వాలలు

## టౌన్ కొత్తరోడ్డులో స్క్రాప్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం -రెండు గంటలపాటు ఎగిసిపడ్డ మంటలు -పెట్రోల్ బంక్ సమీపంలో ఘటనతో కలకలం -భారీ ఆస్తి నష్టం, తప్పిన ప్రాణాపాయం -సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35వ వార్డులో టౌన్ కొత్తరోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న స్క్రాప్ షాప్ గోడౌన్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా గోడౌన్ నుంచి మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా అప్రమత్తమైంది. స్క్రాప్ గోదాములో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇనుము ముక్కలు, పాత యంత్ర సామగ్రి, ప్యాకింగ్ పదార్థాలు అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దట్టమైన నల్ల పొగ ఆకాశమంతా కమ్మేసి దూర ప్రాంతాల నుంచే కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.ఘటన జరిగిన ప్రదేశం వాణిజ్య కేంద్రానికి సమీపంగా ఉండటంతో పాటు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతం కావడంతో మొదట్లో పెద్ద ఎత్తున ఆందోళన 8వ పేజీలో

# అల్లూరి జిల్లా నూతన కలెక్టర్‌గా టి.నిశాంతి

## కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌ను ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపీఐఐసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ: జిల్లా పాలనలో దినేష్ కుమార్ ప్రత్యేక ముద్ర

పాడేరు,మార్చి 29, ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఐఏఎస్ జిల్లా కలెక్టర్లలను బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదివారం కీలక ఉత్తర్వులు జారీ చేసారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న 2013 ఐఏఎస్ చెందిన కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ను ఏపీఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపీఐఐసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా 8వ పేజీలో

# వేగం పెంచితే వెంటనే చలాన్

## నేటి నుంచి విశాఖ రోడ్లపై లేజర్ గన్ నిఘా -100 మీటర్ల దూరంలోనే ఉల్లంఘనల గుర్తింపు - హెల్మెట్, త్రిబుల్ రైడింగ్, వన్‌వే అతిక్రమణలపై కఠిన చర్యలు




# సాకారమవుతున్న పేదల సొంతింటి కల

## జిల్లాలో నేడు టిడ్కో గృహాల ప్రారంభ మహోత్సవం -రూ.323 కోట్ల వ్యయంతో నిర్మించిన 3600 గృహాలు లబ్ధిదారులకు అందజేత




# ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం



## గురుగుబెల్లి షణ్ముఖరావుకి బెస్ట్ యూనియన్ ఇంచార్జ్



మాధవధార, మార్చి 29 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ, 44వ ఆవిర్భావ దినోత్సవశీ సందర్భంగా, విశాఖపట్నం ఉత్తర నీయోజిక వర్గం, జీవీఎంసీ 51వ వార్డు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గురుగుబెల్లి షణ్ముఖరావుకి బెస్ట్ యూనిట్ ఇంచార్జిగా, బహుమతి ప్రధానఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవులు, విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పట్టాభి, చేతులు మీదగా బహుమతి ప్రధానఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో, అనేక మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గున్నారు. ఈ కార్యక్రమం విశాఖపట్నం జిల్లా, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం లో జరిగింది. ఈ కార్యక్రమంలో, పాల్గొన్న సీనియర్ నాయకులు అనేక మంది, షణ్ముఖరావుకి, పార్టీ పట్ల, పార్టీ కార్యక్రమల పట్ల గల అంకిత భావాన్ని కొనియాడారు. భవిష్యత్లో, మరింత చురుకుగా పాల్గునాలని సూచించారు.

## పీ.ఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

### - రికార్డులు, లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై సమీక్ష.. పరిశుభ్రతపైనా ఆరా

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



విశాఖ నగర పోలీసు వ్యవస్థలో క్రమ శిక్షణ, ప్రజా సేవల మెరుగుదలకు ప్రాధా న్యం ఇస్తు నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి ఆదివారం సాయంత్రం పీ.ఎం. పాలెం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సంద ర్శించారు. ముందస్తు సమాచారం లేకుండా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ అక్కడి అధికా రులు, సిబ్బంది విధి నిర్వహణ తీరును పరిశీలించి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల స్థితి, పెండింగ్ దర్యాప్తులు, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిపాలనా వ్యవస్థ ఎలా కొనసాగుతోందన్న అంశాలను సీపీ స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా కేసు రిజిస్ట్రేషన్ పద్ధతి, రికార్డుల నవీకరణ, స్టేషన్‌లో ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసు కున్నారు. నమోదు చేసిన కేసుల పత్రాలు, డ్యూటీ రిజిస్టర్లు, స్టేషన్ డాక్యుమెంటేషన్ అన్నీ సక్రమంగా నిర్వహించాలం టూ సూచనలు ఇచ్చినట్లు తెలిసింది. లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన కమిషనర్, స్టేషన్ పరిధిలో ఉన్న సున్నిత ప్రాంతాలు, తరచుగా తలెత్తే సమస్యలు, రాత్రి పహారా విధానం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన తీరు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. నగరంలో ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు ప్రతి స్టేషన్ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసినట్లు సమా చారం. స్టేషన్ భవనం పరిసరాలు, కార్యాలయ గదులు, ప్రజలు ఫిర్యాదులు ఇచ్చే విభాగాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను కూడా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, ప్రజలకు అసౌకర్యం కలగ కుండా మౌలిక సదుపాయాలు మెరుగ్గా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలి కాలంలో నగరంలోని పలు క్రైమ్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, ఏసీపీ సబ్‌డివిజన్ లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ పరిపాలనను సమీక్షిస్తున్న విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ల పనితీరులో లోపా లు ఉంటే వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్శనతో స్టేషన్ సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, రికార్డుల నిర్వహణతో పాటు ప్రజల పట్ల మరింత బాధ్య తాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. సీపీ బాగ్చి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సమయంలో నార్త్ ఏసిపి అప్పలరాజు, సిఐ బాలకృష్ణ,ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుకు ఘన సన్మానం



గాజువాక, మార్చి 29,ప్రభాతవార్త

మాజీ మంత్రి, గాజువాక నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజును ఆదివారం వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. 87వ వార్డు సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము తదితరులు ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు కర్రి నాగేశ్వరావు, అముజుల వెంకట్రావు, గుంట్ల శ్రీను, ప్రగాఢ రాము తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే ఇన్సూరెన్స్ కొనసాగించాలి

గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త



విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్‌ను కొనసాగించాల ని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె.అయోధ్య రామ్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కుర్మన్న పాలెం కూడలి వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాంట్ అభ్యున్నతికి కృషి చేసిన విశ్రాంత కార్మికుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గమని విమర్శించారు. చాలీచాలని పెన్షన్‌తో గడుపుతున్న వారిపై ఇన్సూరెన్స్ పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. పాత విధానాన్ని మరో రెండు నెలలు పొడిగించి, తక్షణమే సర్క్యులర్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు యు. రామస్వామి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## విజయరామపురంలో డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఓకి ఫిర్యాదు

పద్మనాభం, మార్చి 29,ప్రభాతవార్త



మండలంలో విజయరామపురం గ్రామంలో డ్రైయినేజీ సమస్యను పరిష్కరించా లని కోరుతు ఇదే గ్రామానికి చెందిన వాజి గాన శ్యామల ఎంపిడిఓ నగేష్‌కి, పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేసారు. తామ వాడిక నీటిని డ్రైయినేజ్ గుండా వెళ్లనీయకుండా ఇదే గ్రామానికి చెందిన కనకల బంగారు నాయుడు అడ్డుకుంటున్నాడని ఆమె ఫిర్యాదు లో పేర్కొన్నారు. గత వారం రోజుల నుండి మురికి నీరునిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు వృద్ధిచెందు తున్నాయని ఆమె మండల అధికారులకి చెప్పారు. గ్రామ కార్యదర్శికి చెప్పినా ఈ డ్రైయినేజీ సమస్యను పరిష్కరించలేదని ఆమె వాపోయారు. తక్షణమే ఈ డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

## సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం



విశాఖపట్నం, మార్చి 29 ప్రభాతవార్త

నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, రాష్ట్ర ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతం రాజు సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. జాతీయ టిడిపి అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధి నౌరోజీ రోడ్డు సింధూ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సీతం రాజు సుధాకర్ పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జూమ్ కాల్ ద్వారా కార్యకర్తలతో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు,యువనేత నారా లోకేష్ ముచ్చటించారు.తెలుగుదేశం పార్టీ మహానటుడు, ఎన్టీఆర్ చేతుల మీదుగా తెలుగు ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆవిర్భవించిందని చంద్రబాబు తెలిపారు.పార్టీ సీనియర్ కార్యకర్తలు పీ గురునాధరావు,నరసాయమ్మ,పీ నూక రాజు,మూర్తి,డీ కనకమహాలక్ష్మి,తిరుమల రావు,కే రాజేశ్వరరావు,వీ రామారావు,ఆర్ రాము,ఏ హేమలత,జీ వెంకట రావు,వీ సత్యనారాయణ లను శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో 30 వ వార్డు టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర నాగావంశం కార్పొరేషన్ డైరెక్టర్ దోకర రమణ, నాటక రంగ డైరెక్టర్ తల్లేపల్లి గణపతి, మాజీ కార్పొరేటర్,అధికారప్రతినిధి విల్లూరి భాస్కరరావు,35 వ వార్డు అధ్యక్షుడు,స్వచంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బొచ్చారామిరెడ్డి, కనీస వేతనాల డైరెక్టర్ వాసుపల్లి రామ్ కుమార్,మాజీ కార్పొరేటర్లు పూరుకుటి నారాయణ రావు, గోలగాని వీరారావు(బుజ్జి), కోడూరు అప్పలరత్నం,దక్షిణ నియోజకవర్గం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, గనగళ్ల సత్య, ఆల్టీ హేమలత, తాడి వేణుకుమారి, కండిపిల్లి వర లక్ష్మి, హనీఫ్ పాల్గొన్నారు.

## వేగం పెంచితే వెంటనే చలాన్

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖ నగరంలో ట్రాఫిక్ నియమాల అమలును మరింత కట్టుదిట్టం చేయడానికి ట్రాఫిక్ పోలీసులు నేటి నుంచి స్పీడ్ లేజర్ గన్స్‌తో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం, వెనుక కూర్చున్న పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించకపోవడం, ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం(ట్రిపుల్ డ్రైవింగ్), వ్యతిరేక దిశలో ప్రయాణించడం(వన్ వే రోడ్లో డ్రైవింగ్) వంటి ప్రధాన ఉల్లంఘనలను ఆధునిక పరికరాలతో గుర్తించి చలానాలు విధించనున్నారు. ఆదివారం నగరంలోని బీచ్ రోడ్డులో ప్రయోగాత్మకంగా నిర్వహించిన ట్రయల్ విజయవంతంగా పూర్తైనట్లు త్రీ టౌన్ ట్రాఫిక్ సిఐ అమ్మి నాయుడు తెలిపారు. లేజర్ గన్స్ 100 మీటర్ల దూరం నుంచే వాహన వేగాన్ని నమోదు చేయడంతో పాటు వాహనదారుల ఉల్లంఘనలను స్పష్టంగా గుర్తిస్తున్నాయని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రేపటి నుంచి నగరంలోని ప్రధాన రహదారులు, బీచ్ రోడ్, రద్దీ కూడళ్లలో ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. నగరంలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరగడం, ట్రాఫిక్ ఒత్తిడి అధికమవడం వల్ల ఉల్లంఘనలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా కొందరు వాహనదారులు నిబంధనలు పట్టించుకోకుండా అతివేగంగా ప్రయాణించడం, హెల్మెట్ లేకుండా నడపడం, సిగ్నల్స్‌ను లెక్కచేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఆధారిత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమైందని అధికారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో జీవీఎంసీ సహకారంతో సుమారు రూ.18 లక్షల విలువ చేసే రెండు స్పీడ్ లేజర్ గన్స్‌ను ట్రాఫిక్ విభాగానికి అందజేసిన సంగతి తెలిసిందే. ఈ లేజర్ గన్స్ ద్వారా అతివేగం మాత్రమే కాకుండా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, పిలియన్ రైడర్ హెల్మెట్ లేకపోవడం, ట్రిబుల్ రైడింగ్, వన్‌వే ఉల్లంఘనలను కూడా ఒకేసారి నమోదు చేయవచ్చు. వాహన నంబర్ వివరాలను రికార్డు చేసి చలానాలు జారీ చేస్తారు. త్వరలో మరింత ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త తరహా స్పీడ్ లేజర్ గన్స్ అందుబాటులోకి రానున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. వాటి ద్వారా ఉల్లంఘనలు ఆటోమేటిక్‌గా నమోదు అయి సంబంధిత వాహనదారుల మొబైల్ నంబర్లకు నేరుగా ఈ-చలానాలు వెళ్లే విధానం అమలులోకి రానుందని చెప్పారు ట్రాఫిక్ నియమాలను అతిక్రమిస్తే ఎలాంటి ఉపశమనం ఉండదని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వేగ పరిమితులు పాటించి, భద్రతా నిబంధనలను అనుసరించాలని పోలీసులు హెచ్చరించారు.

## పద్మనాభం మండలంలో ఆకాశానంటిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

పద్మనాభం, మార్చి 29,ప్రభాతవార్త



రాష్ట్ర టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు మండలంలో పలు గ్రామా లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిర్వహించిన 44వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆకాశా నంటాయి. ప్రతి గ్రామం లోను టీడీపీ జెండా రెపరెపలాడింది. కార్య కర్తలు ఉత్సాహంగా పలు గ్రామాలలో మందుగుండు సామాన్లు కాల్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీ జెండా ఎగురవేయాలని ప్రతిజ్ఞ చేసారు. అనంతరం మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో ఉన్న ఎన్ టి ఆర్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షులు కోరాడ రమణ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను గ్రామ అధ్యక్షులు రామశింగు సన్యాసిరావు ఎగుర చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి లక్ష్మి,పిఏసిఎస్ చైర్మెన్‌లు బి.శ్రీను, కృష్ణంరాజు, అన్నమయ్య, నాయకులు దాము, నందీష్, రామరాజు,పైడినాయడు, ఎర్రినాయడు, ప్రసాదు, సత్యన్నారాయణ, సన్నిబాబు, అచ్చంనాయడు, పాల్గొన్నారు.

## అధికార్లు నిర్లక్ష్యం వల్ల బాందేవుపురం రెల్లికాలనీలో వృధాగా పోతున్న తాగునీరు



పద్మనాభం, మార్చి 29, ప్రభాతవార్త

మండలంలో బాందేవుపురం గ్రామ పంచా యితీ రెల్లికాలనీలో గ్రామ సచివసలయ అధికార్ల నిర్లక్ష్యం వల్ల తాగునీరు వృధాగా పోతుంది. కాలనీ వేసిన తాగునీటి పైపులకు ఎక్కడపడితే అక్కడ కన్నాలు పెట్టి కుళాయిలు వేసి మూతలు ఏర్పాటు చేయలేదు. దీంతో తాగునీరు వృదాగా పోతుంది. డ్రెయినేజీలో తాగునీరు పంట కాలువలను తలపిస్తున్నాయి. తాగునీటిని ప్రణాళిక బద్దంగా వాడుకోవాలని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధికారులు ఇస్తున్న శిక్షణలు గ్రామ సచివాలయ అధికారుల చెవులకి ఎక్కలేదని పలువురు వాపోతున్నారు. వృధాగా పోతున్న నీటిని పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. సచివాలయ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నార న్నారు. సచివాలయంను వదిలి బయటికి ఎన్నడూ రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన మండల అధికారులు స్పందించి వృధాగా పోతున్న తాగునీటిని అరికట్టాలని కోరుతున్నారు.

## ప్రతి జీవిలో కొలువైన పరమాత్ముడు ..



ఆనందపురం, మార్చి 29, ప్రభాతవార్త

ప్రతి జీవిలో పరమాత్ముడు కొలువై ఉన్నాడని అందరూ మనవాళ్లే అనే భావనతో జీవించాలని జ్ఞన ప్రచారకులు, సంయోజకులు సాయిప్రసాద్ రాజు చెప్పారు. మండలంలోని బోని గ్రామంలో ఆదివారం సంత్ నిరంకారీ మండలి అధ్వర్యం లో విశాల నిరంకారీ సత్సాంగత్యం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ రాజు మాట్లాడుతూ కులమత బేధాలకు తావివ్వరా దని, బ్రహ్మజ్ఞానంతోనే మోక్షానికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఇది నిరంకారీ మిషన్ సద్గురు మాత సుదీక్ష జీ మహరాజ్ దివ్య సందేశమని, హితబోదని అందరికీ వివరించారు. సత్ పురుషుల సాంగత్యం వలన జ్ఞానం వికసిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ సంయోజకులు ప్రేమ్ మీర్పురి, సహా సంయోజకులు పివి రావు, ఏపీ సేవా దళ్ అధికారి రవి, రాజవీర్, శ్రీరామ్ యాదవ్, బోని ముఖి సత్యనారాయణ రాజు, బోని ఇంచార్జ్ శ్యామ్, పార్వతమ్మ, బోని ఎంపిటిసి సభ్యులు బోని పార్వతి అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ సన్యాసినాయుడు, మాజి సర్పంచ్ సూరల సత్య వరప్రసాద్, బోని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పోలమాంబ అమ్మవారి పల్లకి ఊరేగింపు



ఆరిలోవ, మార్చి 29, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు పెదగదిలి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పోలమాంబ అమ్మవారి పం డగ ఘనంగా ప్రారంభమైంది. జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం డా.బి.ఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షు లు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో ఉదయం మహిళలచే కుంకుమార్చన, సాయంత్రం అమ్మవారికి సారి, పల్లకి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ జాతర వేడుకల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు.

## జై ఆంధ్ర కాలనీలో శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త



జీవీఎంసీ 63వ వార్డు జై ఆంధ్ర కాలనీలో శివాలయ నిర్మాణానికి ఆది వారం ఉదయం శంకుస్థాపన కార్య క్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామస్తుల సమక్షంలో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి స్థానిక నివాసి నాగ సాధు (శివ) తన సొంత స్థలాన్ని కేటాయించడం విశేషం. ఆయన శివ భక్తిని, త్యాగాన్ని స్థానికులు ఈ సందర్భంగా కొనియాడారు. కాలనీ వాసులందరూ ఏకమై విరాళాలు సేకరించి, భక్తిశ్రద్ధలతో ఈ ఆలయ నిర్మాణ బాధ్యతను భుజాన వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి చోడవరం పీఠాధిపతులు శ్రీ దత్తానంద స్వామీజీ విచ్చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతం భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప పుణ్యక్షేత్రంగా, ఆధ్యాత్మిక నిలయంగా మారుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, దాతలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆస్తి పన్నులపై 50 శాతం వడ్డీ మినహాయింపు..

## మార్చి 31లోపు చెల్లించండి

### మార్చి 30, 31 తేదీల వరకు మాత్రమే ఈ సదవకాశం : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, మార్చి 29, ప్రభాతవార్త



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులు / ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ కల్పించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ ఆస్తి పన్ను బకాయిలపై విధించబడిన వడ్డీపై 50 శాతం మినహాయింపు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు మార్చి 31, 2026 లోపు పూర్తిగా ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని ఆస్తి పన్ను దారులు, గృహ యజమానులు వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. అలాగే, ఒకేసారి మొత్తంగా పన్నులు చెల్లించలేని వారు కనీసం బకాయిలు చెల్లించినప్పటికీ వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ రాయితీ రెండు రోజులు మాత్రమే అనగా మార్చి 30 మరియు 31 తేదీలలో మాత్రమే అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు నగరంలోని అన్ని సచివాలయాలు, జోనల్ కార్యాలయాలలో,అలాగే ఆన్‌లైన్ ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం జీవీఎంసీ కార్యాలయాలు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మార్చి 31వ తేదీ వరకు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకుని, ఆస్తి ఖాదీ స్థలాల బకాయి పన్నులు చెల్లించి, 50 శాతం వడ్డీ మినహాయింపును పొందాలని జీవీఎంసీ కమిషనర్ కోరారు.

## చరిత్ర తిరగరాసిన విశాఖ పోర్టు

7వ పేజీ తరువాయి ..

భాగస్వామ్య సంస్థల్ని పోర్టు చైర్మన్ డా.ఎం.అంగముత్తు అభినందించారు. సమష్టి కృషి, నిబద్ధత వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని ఆయన పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 100 ఎంఎంటీ సరకు రవాణా లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ విజయాన్ని సాధించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కర్నీ పోర్టు డిప్యూటీ చైర్పర్సన్ రోష్నీ అపరంజి కొరాటి కూడా అభినందించారు. ఈ మేరకు పోర్టు కార్యదర్శి శంకర్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

## జనావాసాల మధ్య జ్వాలలు

7వ పేజీ తరువాయి ..

నెలకొంది. ముఖ్యంగా పెట్రోల్ బంక్ సమీపంలోనే మంటలు చెలరేగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మంటలు ఇతర దుకాణాలు, సమీప గృహాలకు వ్యాపించే ప్రమాదం ఉందని భావించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు ప్రారంభించారు .స్క్రాప్ గోదాములో ఉన్న దహనశీల పదార్థాల కారణంగా మంటలు వెంటనే అదుపులోకి రాకపోవడంతో సిబ్బంది సుమారు రెండు గంటలపాటు నిరంతరంగా శ్రమించాల్సి వచ్చింది. అగ్నిమాపక వాహనాల నుంచి భారీగా నీటిని చిమ్ముతూ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా కట్టడి చేశారు. సమీప వ్యాపారవేత్తలు, స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. చివరకు మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినప్పటికీ గోడౌన్‌లో నిల్వ ఉన్న సామగ్రి దాదాపు పూర్తిగా దగ్ధమై భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగింది, ఎలాంటి నష్టం వాటిల్లిందన్న వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనావాసాల మధ్య ఇలాంటి స్క్రాప్ గోడౌన్లు నడవడం భద్రతాపరంగా తీవ్ర ప్రమాదకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపడతామని, నివాస ప్రాంతాల మధ్య అనుమతులు లేకుండా నడుస్తున్న గోడౌన్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైతే సంబంధిత శాఖలతో కలిసి నియంత్రణ చర్యలు మరింత కఠినతరం చేస్తామని చెప్పారు .ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నప్పటికీ, ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోంది. గతంలో కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో స్క్రాప్ గోదాములు, రీసైక్లింగ్ యూనిట్లలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాల అమలుపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## వైభవంగా అప్పన్న స్వామి కళ్యాణం

7వ పేజీ తరువాయి ..

ఆచారాన్ని అనుసరిస్తూ చైత్రమాన శుక్ల పక్ష ఏకాదశి నాడు అంటే ఆదివారం సింహాచలం శ్రీ వరహాలక్ష్మి నృసింహ స్వామి అంకురా రోపణతో ప్రారంభమైన స్వామి వారి తిరు కళ్యాణోత్సవాలు. ఉత్తర రాజ గోపురా నికి ఎదురుగా ఉన్న సువిశాలమైన మైన ప్రాణంగంలో ప్రత్యేక వేదిక పై స్వామి వారి కళ్యాణం వైభావంగా జరిగింది. సాయంత్రం కోట్నాల ఉత్సవం సాంప్రదాయ బద్ధంగా జరిగింది. అర్చకులు ముత్తయిదవులు ఆలయంలో పసుపు కొమ్ములను దాంచారు. అనంతరం ఆరాధన విశేష హోమాలు నిర్వహించారు. నాలుగు గంటల నుండి 6.30 గంటల వరకు ఆరాధనం, విశేష హోమాలు, హోమల తర్వాత అర్చకులు మంత్రోచ్చరణలు నాద స్వర మంగళవాయధ్య నడుమ మూఢ వీదులులో అష్టదిక్కులో భూతబలి ప్రదానం చేసారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడ పటాన్ని ఎగరవేసి ధ్వజరో హనం చేసి ముక్కోటి దేవతలను అప్పన్న స్వామి కళ్యాణోత్సవానికి ఆహ్వానం పలికారు. ఎదురు సన్నోహోత్సవం, తిరువీధి సేవ, అనంతరం వేలాది మంది భక్తులు తో రాదసారథి ఆధ్వర్యంలో రథోత్సవం జరిగింది. ముఖ్య అతిధి గా విచ్చేసిన అతిధిగజపతి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామి వారి కళ్యాణ వేదిక పై అధిష్ఠింప చేశారు. అర్చకులు స్వామిక విశ్వక్షణారధన, పుణ్యాహవాచనముపూజలు చేసారు. స్వామి వారికి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి జి వి ఆర్ నాయుడు, చోడవరం ఎమ్మెల్యే జి.ఎస్. ఎన్. రాజు దర్శించుకొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా..

నర్సీపట్నం,మార్చి 29,ప్రభాతవార్త



నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా, తొలుత స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలోని స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ ద్వారా పార్టీ ప్రధాన కార్యాలయంతో అనుసంధానమై, అక్కడి విశేషాలను భారీ ఎల్ ఈ డి స్క్రీన్ ద్వారా కార్యకర్తలకు ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో విజయ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఇప్పుడు 'టీడీపీ 3.0' వెర్షన్లోకి అడుగుపెట్టిందని, మొదటి వెర్షన్ ఎన్టీఆర్, రెండో వెర్షన్ చంద్రబాబు అయితే, మూడో వెర్షన్ లోకేష్ నాయకత్వంలో యువతకు, సాంకేతికతకు పెద్దపీట వేస్తోందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమరావతిని చట్టబద్ధమైన రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేసిన చారిత్రాత్మక సమయంలో, నర్సీపట్నం బిడ్డ అయ్యన్న పాత్రుడు స్పీకర్ స్థానంలో ఉండటం ఈ ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు. 44 ఏళ్లుగా పార్టీ జెండాను నమ్ముకుని, ఎక్కడా అవినీతికి తావులేకుండా నిఖార్సైన రాజకీయాలు చేయడం అయ్యన్నపాత్రుడు కి మాత్రమే సాధ్యమైందని, ఆయన కృషి వల్లే ఈ 21 నెలల్లోనే నియోజకవర్గానికి రూ. 426 కోట్ల అభివృద్ధి నిధులు వచ్చాయని వివరించారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, కష్టపడే ప్రతి కార్యకర్తను చంద్రబాబు నాయుడు నేరుగా డాష్బోర్డ్ ద్వారా గమనిస్తున్నారని, భవిష్యత్తులో వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీకి కష్టపడిన కార్యకర్తలకు విజయ శాలువాతో సత్కరించారు. పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పుడు తోడుగా అండగా ఉంటామని ఈ సందర్భంగా అన్నారు. టిడిపి పార్టీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, జడ్పిటిసి సుకల రమణమ్మ, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మరియు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

విశాఖపట్నం,మార్చి 29,ప్రభాతవార్త

ఉషోదయ కూడలి సమీపంలో ఆదర్శనగర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సి హెచ్ పట్టాభిరామ్, వెలగపూడి రామకృష్ణ బాబు కుమారుడు వెలగపూడి ప్రతాప్ రుద్రతో కలిసి విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ టీడీపీ పార్టీ జెండా ఎగురవేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెక్కంటి సత్తిబాబు, గేదెల నాగరాజు, కాళ్ళ శంకర్, రవి, వర, గోపమ్మ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఎంవిపి కాలనీ టిటిడి కూడలిలో టీడీపీ పార్టీ చిహ్నం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సి హెచ్ పట్టాభిరామ్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, గొలగాని పోలారావు, కళావతి, కాళ్ళ శంకర్,పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లా కలెక్టర్‌గా టి.నిశాంతి నియామకం

7వ పేజీ తరువాయి ..

నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా 2017 ఐఎఎస్‌కు చెందిన ప్రస్తుతం డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.నిశాంతికి పదోన్నతి కల్పిస్తూ అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. నూతనంగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు తొలి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,రెండవ జిల్లా కలెక్టర్ విజయ సునీత,మూడవ జిల్లా కలెక్టర్‌గా ఏఎస్ దినేష్ కుమార్ విధులు నిర్వహించగా నాల్గవ అల్లూరి జిల్లా కలెక్టర్‌గా టి.నిశాంతి ఐఎఎస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా కలెక్టర్‌గా దినేష్‌కుమార్ సమర్ధవంతంగా జిల్లాలో పాలనలో ప్రత్యేక ముద్ర వేసుకుంటూ.. మంచి పాలన అందించారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ గిరిజన ప్రాంతాల్లో రహదారులు లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మాణాలు,,ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందేలా కార్యక్రమాలు అమలు చేయడం,అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,ఒడిశా ముఖ్యమంత్రి అధికారిక సభా కార్యక్రమాలను విజయవంతం గా నిర్వహించడంలో ప్రభుత్వ ప్రశంసలు కలెక్టర్ దినేష్ కుమార్ అందుకున్నారు. డీసీఎం పవన్ కళ్యాణ్ రెండు సార్లు అల్లూరి జిల్లా మన్యంలో పర్యటనను విజయవంతం చేసేలా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ పర్యటనలు విజయవంతం చేయడం..ఆయన ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలు నిర్వహించి గిన్నీస్ బుక్ రికార్డు సాధించటం... అంబులెన్స్ లేని పిహెచ్సి లకు అంబులెన్స్ లు సమకూర్చడం..అలాగే జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి హోమ్ స్టేలు ఏర్పాటు,అలాగే చింతపల్లి లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూసేకరణకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టడం..అలాగే ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రతి ఏటా నిర్వహించే చలి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తూ అల్లూరి జిల్లా ను పర్యా టక హబ్‌గా రూపొందించడానికి చర్యలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్‌గా దినేష్ కుమార్ మంచి మార్కులు పొందటమే కాకుండా ప్రభుత్వంచే ప్రశంసలు అందుకున్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్‌గా ఏ.ఎస్.దినేష్ కుమార్ జూలై 27వ తేదీ 2024 సంవత్సరంలో బాధ్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా కలెక్టర్ గా దినేష్ కుమార్ సుమారు 21 నెలలు ఒక సంవత్సరం 9 నెలలు తనదైన శైలిలో విధులు నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడం..అవసరమైతే పేదవారికి తన సొంత డబ్బులు ఇచ్చి సహకరించడం..క్రీడాకారులు ఎక్కడికైనా పోటీలకు వెళితే వారికి నగదు ఇచ్చి సహకరించడం..ఇలా బదిలీపై వెళుతున్న ప్రస్తుత జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్ని వర్గాల ప్రజలను..ప్రజా ప్రతినిధులతో సఖ్యతగా ఉంటూ జిల్లా పాలనలో తనదైన ముద్ర కలెక్టర్ దినేష్ కుమార్ వేసుకున్నారు. ఈ జిల్లాకు రాకముందు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించి అక్కడ అందరూ మన్ననలు ప్రశంసలు అందుకున్న దినేష్ కుమార్ బదిలీ కావడం అధికార యంత్రాంగం కొంత నిరాస చెందుతున్నారు.

## తెలుగు ఆత్మగౌరవానికి ప్రతిబింబం తెలుగుదేశం

7వ పేజీ తరువాయి ..

చరిత్ర గల కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించారన్నారు. పేద ప్రజలకు కూడు.. గూడు.. గుడ్డ.. అందిం చడమే తెలుగుదేశం సిద్ధాంతమని తెలియజేసి.. ప్రజల్లోకి వెళ్లి వారి ప్రేమాభిమానాలను చూరగొన్నారని వివరించారు. సీనియర్ నాయకులను సన్మానించుకోవాలని.. సైకిళ్లపై ర్యాలీ చేయాలని.. పార్టీ ఆవిర్భావ వేడుకలను వినూత్నంగా నిర్వహించిన గంటా రవితేజను అభినందించారు. ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోస్తున్న సీనియర్ కార్యకర్తలను శాలువా కప్పి సన్మానించారు. మెమెంటో బహుకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా రవితేజ, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు వెంకటప్పడు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, బి.ఆర్.బి. నాయుడు, మొల్లి లక్ష్మణరావు, పీవీ నరసింహం, పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## మరిడి మహాలక్ష్మి జాతరకు సర్వం సిద్ధం

7వ పేజీ తరువాయి ..

అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గారు మాట్లాడుతూ.. ఈ చారిత్రాత్మక పండుగను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికారులకు సహకరించాలని కోరారు. అందరి సమన్వయంతో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించి, భక్తిభావంతో పండుగను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సాకారమవుతున్న పేదల సొంతింటి కల

విశాఖపట్నం, మార్చి 29 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పట్టణ నివాస సముదాయములు, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో నేడు భారీ స్థాయిలో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమాలు జరగనున్నాయి. పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. జిల్లాలో మొత్తం రూ.323 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన 3600కు పైగా గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. భీమిలి నియోజకవర్గంలోని కొమ్మాది వద్ద రూ.30.55 కోట్ల వ్యయంతో నిర్మించిన 336 ఫ్లాట్లు, పెందుర్తి నియోజకవర్గంలోని మంత్రిపాలెం వద్ద రూ.33.60 కోట్లతో నిర్మించిన 336 ఫ్లాట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అలాగే గాజువాక నియోజకవర్గంలోని తలారివానిపాలెం, దువ్వాడ, పెదగంట్యాడ ప్రాంతాల్లో రూ.253.88 కోట్ల వ్యయంతో నిర్మించిన 2928 ఫ్లాట్లు లబ్ధిదారులకు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని లబ్ధిదారులకు గృహాల పట్టాలను అందజేస్తారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న టిడ్కో గృహాల నిర్మాణ కార్యక్రమం కీలకంగా కొనసాగుతోందని టిడ్కో ఈఈ సుధాకర్ పేర్కొన్నారు.

### స్థిర నివాస భద్రత లభిస్తుంది: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ఈ గృహాల పంపిణీతో అనేక కుటుంబాలకు స్థిర నివాస భద్రత లభిస్తుంది. వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. ఎంతో కాలం నుంచి చూస్తున్న వారి ఆశలు నెరవేరుతాయి. విజయవంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరం.

## 35వ వార్డులో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం మార్చి29, ప్రభాతవార్త

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పండావీధిలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం ఘనంగా జరిగాయి రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుచ్చ రాముడెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మినహా మరో పార్టీ బ్రతికి బయటపడలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు లోకేషన్ నాయకత్వానికి తిరుగులేదన్నారు పార్టీని స్థాపించిన నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేసారు.వార్డు మాజీ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలకు తెలుగుదేశం పార్టీ ప్రాణం మరియు ఊపిరి అన్నారు వార్డు క్లస్టర్ కో కన్వీనర్ మున్నం బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా ఉండడం పూర్వజన్మ సుకృతవని దీనివల్ల కార్యకర్తకు ధైర్యం వస్తుందని చెప్పారు. నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ వర్గాలు అబ్దుల్ చిన్నరహమాన్,నొల్లి కనకరాజు సురేష్, గుంపిన అప్పలరాజు,పితాని మునెమ్మ,కండిపల్లి వరలక్ష్మి బత్తిన మంగరాజు, కొనతాల శ్రీను నొల్లి రమణ, ఒడిసలు రామారావు, విల్లా భరత్, చుక్క లలిత, విజయ్ కుమార్, గణేష్, నాయని గోవింద రెడ్డి నాయిని నాగభూషణం, నాయని వెంకటరమణ నాయని రాజారావు,పుక్కళ్ల చందర్రావు,పూర్ణ, నాగమణి,బొదల రమేష్,మణమ్మ దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెచ్పీవీ వ్యాక్సిన్‌తోనే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ

విశాఖపట్నం, మార్చి 29, ప్రభాతవార్త



హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్పీవీ) వ్యాక్సిన్తోనే మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నియంత్రించగలమని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న చైతన్య స్రవంతి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ వర్కర్లకు చెందిన తొమ్మిది నుండి 14 ఏళ్ల లోపు 50మందికి పైగా ఆడపిల్లలకు ఉచిత వ్యాక్సిన్ వేశారు. డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి అన్ని దేశాల్లోనూ ఆడపిల్లలకు క్యాన్సర్ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించిందని ఈ నేపథ్యంలోనే తమ సంస్థ 2024 నుండి ఇంతవరకు 3000 మందికి పైగా ఆడపిల్లలకు క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సిన్ చేసామని చెప్పారు.ఆరు నెలల వ్యవధిలో రెండు డోసుల వ్యాక్సిన్ వేస్తున్నామని సీరం ఇనిస్టిట్యూట్ ఈ వ్యాక్సిన్ ను సరఫరా చేస్తోందని పేర్కొన్నారు.బ్రెస్ట్ క్యాన్సర్‌తో పాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పై కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. హెచ్పీవీ టీకాలు వేయించుకోవడం వల్ల మహిళలు క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండగలరని పేర్కొన్నారు.కేజీహెచ్ క్యాన్సర్ స్పెషలిస్ట్,రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం. పాండు రంగకుమారి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే రోగి వ్యాధి నుండి బయటపడగలరని అన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో పాటు గర్భాశయం ముఖద్వార క్యాన్సర్‌తో మహిళలు బాధపడుతున్న నేపథ్యంలో హెచ్పిపి వ్యాక్సిన్ ఆరు నెలల వ్యవధిలో రెండు డోసులు వేస్తున్నట్లు వివరించారు చైతన్య స్రవంతి కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ఆడపిల్లలు వినియోగించుకోవాలని కోరారు.ఈ వ్యాక్సిన్ శిబిరంలో సీరం ఇన్స్టిట్యూట్ ప్రాంతీయ మేనేజర్ రాంరతన్,చైతన్య స్రవంతి ప్రతినిధులు విజయ, రుకియా భాను, లక్ష్మి, శారద, పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మ

### ఘనంగా తెలుగుదేశం ఆవిర్భావ వేడుకలు -గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్



గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఉమ్మడి తెలుగురాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, తెలుగు చలన చిత్ర పరిశ్రమ ముద్దు బిడ్డ ఆంధ్రుల ఆరాధ్య దైవం అన్నా స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గాజువాక నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రయాణం మొదలుపెట్టిన పార్టీ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందని పేర్కొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలే పార్టీకి అసలైన పట్టుకొమ్మలని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, గంధం శ్రీనివాస్, లేళ్ల కోటేశ్వరరావు, రాజాన రామారావు, బొండా జగన్, కార్పొరేషన్ డైరెక్టర్లు నూకరాజు, ముల్లి పెంటిరాజు, రాంబాబు, వార్డు అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ, కర్రి దయానిధి, బైపల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో టిడిపి ఆవిర్భావ దినోత్సవం

విశాఖపట్నం, మార్చి 29 ప్రభాతవార్త



పేదవాడి చెమట నుండి పుట్టిన పార్టీ తెలుగు దేశం పార్టీ అని టిడిపి నాయకులు పోకన రెడ్డి తెలిపారు. ఆదివారం పెద్ద వాల్తేరు 20వ వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త

బీసీ రోడ్డులోని ఆరజీఎ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో డెడ్‌లిఫ్ట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన లలిత 'స్ట్రాంగ్ వుమెన్' టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు విజేతలకు బంగారు, రజిత, కాంస్య పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవర్ లిఫ్టింగ్‌లో నిరంతర ప్రాక్టీస్ ద్వారా మంచి శరీర సామర్థ్యం, ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీనివాసరావు, భాస్కరరావులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అంబీటోయిన అప్పారావు, భాస్కరరావు, ఉపాధ్యక్షులు పెద్ద సత్యారావు, ఏఎస్ఐ అనురాధ, రాంబాబు, రంజిత్, అనురాగ్ సింగ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆనందపురం, మార్చి 29, ప్రభాతవార్త



ఆనందపురం మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆనందపురం పూలమార్కెట్ వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు తాత్రాజు అప్పారావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా తాత్రాజు అప్పారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక మహత్తరమైన ఘట్టంగా నిలిచిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే ధ్యేయంతో స్థాపించబడిన పార్టీ, రాష్ట్ర అభివృద్ధి దిశగా ఎన్నో ప్రగతిశీల కార్యక్రమాలు చేపట్టి ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, పేద ప్రజల జీవనోన్నతి వంటి రంగాల్లో పార్టీ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బమ్మిడి ఉమాదేవి, మండల ప్రధాన కార్యదర్శి లొడగల వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సురాల సత్య వరప్రసాద్, సర్పంచ్ లు బి ఆర్ బి నాయుడు, మహంతి శివాజీ, భీమిలి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాదాస్ శ్రీరామ్ దొర, యూనిట్ ఇంచార్జ్ గొర్రెల సంతోష్, బూత్ కన్వీనర్ బంటుపల్లి రాజు, కోరాడ నవీన్, చందవరపు కుమార్, ఇల్లిపిల్లి సన్యాసి రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశిక్షణతోనే పార్టీ బలోపేతం



గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త

పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత విధానాల ద్వారానే బిజెపి బలోపేతం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పేర్కొన్నారు. ఆదివారం నడుపూరులో గాజువాక బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ ప్రశిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిలాని ముసలయ్య, అనిత, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆరిలోవ, మార్చి 29, ప్రభాతవార్త




తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు, ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, కాకి గంగరాజు ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన "తెలుగుదేశం పార్టీ" 44వ ఆవిర్భావ వేడుకలు పాత ఆరిలోవ శ్రీ దుర్గాలమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పతాక ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. అనంతరం బాలాజీ నగర్, రవీంద్ర నగర్-2, శ్రీహరి నగర్, కైలాస్ నగర్, టి ఐ సి పాయింట్,ఏరియాలో పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మూది అప్పారావు, కలిసా, రేఖాజ్యోతి, పేపర్ నాయుడు,లింగం సత్యనారాయణ, బర్రి సూర్యనారాయణ, సిహెచ్. ఆది నారాయణ రాజు, బోయి శ్రీను పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకులకు సత్కారం



ఆనందపురం, మార్చి 29, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రతి పంచాయతీలో ఒక్కో సీనియర్ నాయకుడును సత్కరించారు. మండలంలోని వెల్లంకి పంచాయతి బొడ్డపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సాడి రాము (చిన్న)ను శాలువతో సత్కరించి పార్టీ మెమెంటో ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గంటా రవితేజ , చిక్కాల విజయ్ బాబు, ఆనందపురం పార్టీ ప్రెసిడెంట్ తాత్రాజు అప్పారావు ఎంపీటీసి సభ్యుడు పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చెన్నా రాజు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు లండ సాయిరాం, పిన్నింటి కన్నయ్య, రామిశెట్టి శ్రీను, మురిపాల గణేష్ పాల్గొన్నారు.

## ఘనంగా 13వ వార్డులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆరిలోవ, మార్చి 29, ప్రభాతవార్త



తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలు మేరకు ఆదివారం 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో వార్డు మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సమక్షంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సెక్టార్ 4, వెర్నిదుర్గా నగర్, లక్ష్మీనగర్, రామ కృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీ, పైనాపిల్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం వార్డు అధ్యక్షులు మాట్లాడుతూ... స్వర్గీయ ఎన్టీఆర్ 1942 మార్చి 29న పార్టీ స్థాపించి అతి తక్కువ కాలంలో పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, సీనియర్ నాయకురాలు నల్లాని వరలక్ష్మి, తూర్పు ఎస్సీ సెల్ అధ్యక్షులు పట్టా నూకరాజు, వార్డు అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, మెంబర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల పంపిణీ పేరుతో మోసం

### 42 సిలిండర్లు స్వాహా -వినియోగదారుల నుంచి నగదు వసూలు చేసి పరారీ -24 గంటల్లో నిందితుడి అరెస్ట్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ పేరుతో జరిగిన మోసం కేసు వెలుగులోకి వచ్చింది. వినియోగ దారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న వ్యక్తి 42 గ్యాస్ సిలిండర్లు, నగదు తీసుకుని పరారైన ఘటన కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి వేగంగా స్పందించి నిందితుడిని 24 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. మణికంఠ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఎదరపల్లి విజయ రామ మోహన రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, గత ఏడాది నుంచి డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న యెన్నంశెట్టి అప్పారావు తన విధులను దుర్వినియోగం చేసినట్లు తెలిసింది. కనితి రోడ్, చినగంట్యాడ ప్రాంతాల్లో గృహ వినియోగదారుల వద్ద నుంచి 33 గ్యాస్ సిలిండర్లు సేకరించడంతో పాటు ఏజెన్సీకి చెందిన 9 ఆఫీస్ సిలిండర్లు కూడా తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 42 సిలిండర్లతో పాటు వినియోగదారుల నుంచి రూ.13,500 నగదు వసూలు చేసినప్పటికీ, వాటిని ఏజెన్సీకి జమ చేయకుండా తన వద్దే ఉంచుకున్నాడు.ఈ వ్యవహారం వెంటనే బయటపడకపోవడానికి కారణం నిందితుడు సాధారణ డెలివరీ ప్రక్రియలో భాగంగా సిలిండర్లు సేకరించినట్లు వినియోగదారులు భావించడమేనని పోలీసులు చెబుతున్నారు. అయితే కొద్ది రోజుల తర్వాత వినియోగదారులు తమ సిలిండర్ల వివరాలపై ఏజెన్సీని సంప్రదించగా, సేకరించిన సిలిండర్లు ఏజెన్సీ రికార్డుల్లో నమోదు కాలేదని తేలింది. దీంతో అనుమానం వ్యక్తం చేసిన ఏజెన్సీ నిర్వాహకులు అంతర్గతంగా విచారణ జరపగా మోసం జరిగిన విషయం బయటపడింది. నిందితుడు సుమారు పది రోజులుగా విధులకు హాజరుకాకపోవడం, ఫోన్‌కు స్పందించకపోవడం వల్ల మోసం జరిగిందని నిర్ధారించుకుని ఏజెన్సీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై క్రైం నం.117/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి 24 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ ఎ. పార్థసారధి పర్యవేక్షణలో ఎస్ఐ కె. జగదీష్, హెచ్‌సీలు కె. అప్పారావు, రాజేష్, పీసీలు శివకృష్ణ, రాముడు కలిసి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సిలిండర్ల గమ్యం, నగదు వినియోగం, మరెవరైనా సహకరించారా అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.ఇటీవలి కాలంలో గ్యాస్ సిలిండర్ల పేరుతో మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనధికారికంగా సిలిండర్లు సేకరించడం, విక్రయించడం, తక్కువ ధరకు అమ్ముతామని చెప్పడం వంటి చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



## తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

### -మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు

గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త



తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారకరామారావు అని, ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని 65వ వార్డ్ మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని బీసీ రోడ్డు కాకతీయ కూడలి వద్ద తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్డు పార్టీ అధ్యక్షుడు రట్టి వాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నరసింహ పాత్రుడు ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న పలువురు కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. అనంతరం పేదలకు వస్త్రాలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలను పాటిస్తూ నేడు చంద్రబాబు, లోకేశ్‌లు పార్టీని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగదీష్, మహిళా ప్రతినిధులు కోరుకొండ మంగ, కోట్ని శ్రీలక్ష్మి, సుగుణ, కోటి, చిన్నా, రట్టి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హోలీ క్రాస్ చర్చిలో ఘనంగా రక్తదాన శిబిరం



గాజువాక,మార్చి 29 ప్రభాతవార్త

తోటి వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం ద్వారా క్రీస్తు రక్షణ కార్యంలో పాలుపంచుకున్న వారమవుతామని రోమన్ క్యాథలిక్ చర్చి ఫాదర్ ఆర్జీ ప్రకాష్ పేర్కొన్నారు. మట్టల ఆదివారం (పామ్ సండే) పురస్కరించుకుని ఓల్డ్ గాజువాక 70వ వార్డులోని హోలీ క్రాస్ చర్చి ఆవరణలో ఆదివారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు మానవాళి పాప పరిహారం కోసం తన రక్తాన్ని చిందించడానికి జెరూసలేంలోకి ప్రవేశించిన ఈ పవిత్ర దినాన, మనం కూడా రక్తదానం చేస్తూ పవిత్ర వారంలోకి ప్రవేశించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో క్రైస్తవ సోదరులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు 'అమ్మ బ్లడ్ సెంటర్' ప్రతినిధులు చర్చి యాజమాన్యానికి 'మేఘ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ షీల్డ్'ను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుంగలాంలో భక్తిశ్రద్ధలతో గాయత్రి మాత వార్షికోత్సవం

### -జ్యోతి ప్రజ్వలన చేసిన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

గాజువాక,మార్చి 29,ప్రభాతవార్త



జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని తుంగలాం గ్రామంలో వెలిసిన శ్రీ సత్య సాయి బాబా మందిరంలో గాయత్రి మాత వార్షికోత్సవ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతిని, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## 50వ వార్డులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మాధవధార, మార్చి 29 ప్రభాతవార్త



నందమూరి తారక రామారావు ఆవిష్కరిం చిన పసుపు జెండా, పేదవాడికి, కూడు, గుడ్డ, నీడ, ప్రజలే దేవుళ్ళు, సమాజమే దేవాలయం, అని తెలుగుదేశం పార్టీ స్థాపించి నాటికి 44 వసం తాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్తర నియోజకవర్గం నియోజకవర్గం 50 వార్డ్ అధ్యక్షులు సనపల వరప్రసాద్ తెలిపారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు కార్యకర్తలు క్లస్టర్ ఇంచార్జ్ మన్యపురి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డ్ సీనియర్ నాయకులకు సన్మానించారు. రాష్ట్ర పార్టీ మంగళగిరి కార్యాలయం నుండి ఎంపిక చేయబడిన ఉత్తర నియోజకవర్గంలో మన వార్డు నుండి యువకుడు మన్యంపురి పూర్ణచంద్రరావుకి జిల్లా పార్టీ ఆఫీసులో ఉత్తమ కార్యకర్త అవార్డును అందజేశారు.

## విశాఖ రోడ్లపై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

### వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ -ఒక్కరోజే 2,481 చలానాలు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)




విశాఖ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో పాటు ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు అధికమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం నగరంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, పెట్రోల్ బంకుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించి వివిధ రకాల ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై భారీ స్థాయిలో చర్యలు తీసుకున్నారు. శనివారం ఒక్కరోజులోనే 2,481 ఈ-చలానాలు విధించగా, 68 వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో భాగంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన 1,218 మందిపై కేసులు నమోదు చేశారు. పిలియన్ రైడర్ హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 236 మందిపై, ట్రిబుల్ రైడింగ్ చేసిన 79 మందిపై కూడా కేసులు పెట్టారు. వేగ పరిమితిని అతిక్రమించిన వారిని గుర్తించేందుకు ఇంటర్‌సెప్టర్ వాహనాలను వినియోగించి 203 ఓవర్‌స్పీడ్ కేసులు నమోదు చేశారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ ఉపయోగించిన 23 మందిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 8 మందిపై, మైనర్ డ్రైవింగ్ చేసిన ఒక కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏడిసిపి ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాంగ్ పార్కింగ్‌పై కూడా కఠిన చర్యలు కొనసాగించగా 37 వాహనాలను టోయింగ్ చేసి, 146 మందిపై కేసులు నమోదు చేశారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన 43 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనల కింద మరో 555 కేసులు నమోదయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాహనాలపై సీజ్ చర్యలు చేపట్టి మొత్తం 68 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు పెట్రోల్ సరఫరాను నిరాకరించే చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 178 మందికి పెట్రోల్ ఇవ్వకుండా తిరస్కరించగా, అదే సమయంలో 132 మందిపై పెట్రోల్ బంకుల వద్దే కేసులు నమోదు చేశారు. విశాఖ సిటీ ట్రాఫిక్ పోలీస్ అధికారులు నగరంలో బైక్ రేసింగ్, రాష్ డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్ల వినియోగంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటి భద్రతా చర్యలు ప్రాణరక్షణలో కీలకమని అధికారులు సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

## శబలా భోజనాల సంబరాలకు తరలి రండి

### ఏప్రిల్ 1 నుండి 5 తేది వరకూ నిర్వహించే శబల భోజనాలనం జయప్రదం చేయండి : టి.సత్యనారాయణ

విశాఖపట్నం, మార్చి 29 ప్రభాతవార్త



భోజనాలను జయప్రదం చేయండి అని తులసి నేచురల్స్ ప్రతినిధి సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని రామకృష్ణా బీచ్ వద్ద శబల భోజనాల సముద్ర తీర ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. మహిళలకు బొట్టు పెట్టి శబలా ఆహ్వాన కర పత్రాలు అందజేశారు. ఐదు రోజులు పాటు సింహాచలం" కొత్త గోశాల" కృష్ణాపుర వద్ద ఉచితంగా నిర్వహించె శబల భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ప్రంట్ అధ్యక్షులు వర్మ పాల్గొన్నారు.

ong-10_ong-10.qxd 3/30/2026 12:24 AM Page 1






## క్రమశిక్షణ కలిగిన పార్టీ టిడిపి: జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి "లాలం"

(నక్కపల్లి, ప్రభాతవార్త)





సిద్ధాంతాలకు కట్టుబడి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పుట్టుకొచ్చిన పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 44 సంవత్సరాలు సందర్భంగా కోటవురట్ల మండలం జల్లూరులో సర్పంచ్ పద్మావతి ,మండల పార్టీ అధ్యక్షులు లింగం నాయుడు ల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా కాశీనాయుడు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు ఏ ఆశయాల కోసమైతే పార్టీ పెట్టారు అ ఆశయాలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందడుగు వేస్తూ వస్తున్నారని, జాతీయ స్థాయిలో పార్టీని స్థాపించిన ఘనత చంద్రబాబుదని, తెలుగువాడి గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా తెలుగుదేశం పార్టీ నడిపిస్తూ వస్తున్నారని, పార్టీలో కార్యకర్తగా ఉండడం ప్రతిరోజు సంతోషం మేనని అన్నారు. పాయ కరావుపేట నియోజకవర్గం హోంమంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ పార్టీ కార్యకర్తలకు కాశీనాయుడు సత్కరించారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం పలువురికి సత్కారం.!

(అడ్డురోడ్డు, ప్రభాతవార్త)



తెలుగుదేశం పార్టీ 44 ఆవిర్భావ దినోత్సవము సందర్భంగా మండలంలోని ఉప్మాక గ్రామంలో వందలాదిమంది కార్యకర్తలు నడుమ పార్టీ జెండా ఆవిష్కరించి సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త,పార్టీ స్థాపించినినాటి నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీ వెన్నంటే ఉన్నటువంటి జోగాడ నాగభూషణం ని ఘనంగా సత్కరించి, వారికి రైసు, కిరాణా నిత్యవసర సరుకులు పార్టీ తరఫున పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి చేతుల మీదుగా అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు,మాజీ జడ్పిటిసి కొప్పిశెట్టి కొండబాబు, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, తెలుగుదేశం పార్టీ గ్రామ కార్యదర్శి గుద్ధటి సత్తిబాబు,కోరుకొండ వరహాలరావు, గొల్లపల్లి కనకరాజు, మామిడి గోవింద్,ఎలమంచిలి రమణబాబు శ్రీను, ఎలమంచిలి చంద్రరావు కొప్పిశెట్టి వాసు తోలేటి శ్రీను, కొర్రా తాతాలు తదితరులు పాల్గొన్నారు

## పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్..

ఎలమంచిలి ,మార్చ్ 29, ప్రభాతవార్త:



పట్టణములోని తులసి కళ్యాణ మండపంలో ఆదివారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణా తరగతులు రెండు రోజులు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రామకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లా రమాకుమారి మాట్లాడుతూ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.పార్టీ కార్యకర్తల్లో సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత బలోపేతం, సేవా భావాన్ని పంపించే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగింది. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ప్రజలతో మమేకం కావడం దేశ నిర్మాణంలో ఉపాధ్యాయ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడంపై మార్గదర్శనం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర రావు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతాలు క్రమశిక్షణ సేవాభావం పై కార్యకర్తలకు విశ్లేషించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై కార్యకర్తలకు విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పిట్ట దాసు బాబు, నాగ శివ దుర్గ, రాజాన సత్యనారాయణ, ఆడారి శ్రీధర్, ఆడారి వెంకట్ ,నక్కా శివ శంకర్,కర్రి జానకి రామ్, సుందరపు సన్యాసిరావు (బాబ్జి) బొడ్డేటి సురేష్, రవికుమార్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తామరం పెద్దమ్మలకు తెలుగుదేశంపార్టీలో పెద్ద సత్కారం

మాకవరపాలెం మార్చి 29 ప్రభాతవార్త



నర్సీపట్నం నియోజవర్గం మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన కర్రిరాము(పెద్దమ్మలు)ముఖ్యమంత్రి చేతుల మీదగా ఘన సత్కారం చేశారు. ఈమేరకు తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత నాలుగు శతాబ్దాలుగా పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్ కార్యకర్త కర్రిపెద్దమ్మలుకు టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఘన సత్కారం జరిగింది.
నర్సీపట్నం నియోజవర్గం మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన కర్రీ రాము(పెద్దమ్మలు) సేవలు గుర్తించిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయ విజయ్ పెద్దమ్మలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన గౌరవానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన కర్రీ సత్యనారాయణ కర్రీ రాము(పెద్దమ్మలు) తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నమ్మకమైన కార్యకర్తలుగా పనిచేస్తూ అయ్యన్నకు విధేయులుగా కొనసాగుతూ వచ్చారు. మాకవరపాలెం మండలంలో రెండవ అతిపెద్ద గ్రామమైన తామరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పెద్దమ్మలు చేసిన సేవకు గాను ఈ గుర్తింపు లభించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పెద్దమ్మలు జరిగిన సత్కారానికి రాష్ట్ర టిడిపి జాతీయ కార్యదర్శి చింతకాయల విజయ్ తన హర్షం వ్యక్తపరుస్తూ పెద్దమ్మలు లాంటి సీనియర్ మహిళా కార్యకర్తను తెలుగుదేశం పార్టీ గుర్తించి పట్ల సీనియర్ కార్యకర్తలలో మరింత అంకితభావం కలిగేలా రెట్టింపు ఉత్సాహానిచ్చిందన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్.వై. పాత్రుడు, టిడిపి సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు. పిఏసిఎస్ అధ్యక్షులు శీరంరెడ్డి వెంకట చినబాబు, మండల టిడిపి సీనియర్ నాయకులు, తామరం టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్దమ్మలకు దక్కిన సత్కారానికి అంతులేని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

## గంగరాజును సత్కరించిన హోంమంత్రి "అనిత"

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోం , విపత్తుల నిర్మాణ శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనితమ్మ మండలం లోని బోధిగల్లం గ్రామంలో ఆదివారం జరిగిన వేడుకల్లో పాల్గొని జండా పండగ కార్యక్రమం సందర్భంగా మండలంలోని రాజయ్యపేట గ్రామంలో అత్యధిక తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు చేయడం పట్ల పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు లను నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో మంత్రి అనిత సత్కరించారు.

## రాజయ్యపేటలో టిడిపి సంబరాలు

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



మండలంలోని రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆటో మెయిన్ సెంటర్ లో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పిక్కీ శ్రీనివాసరావు, గంగరాజు, కోదండరావ్, రాంబాబు, రాము, మడత రాంబాబు, వాసుపల్లి శివాజీ, సిరిపల్లి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

# దేశచరిత్రలో నిలిచిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు
వాడవాడలా ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అనకాపల్లి మార్చి 29 (ప్రభాతవార్త)

నందమూరి తారకరామారావు 1982 మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలలు లోనే అధికారంలోకి వచ్చి దేశ చరిత్రలో ఏకైక నాయకుడిగా ఘన కీర్తి సాధించారని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వద్ద, ఎన్టీఆర్ రింగ్ రోడ్డు వద్ద, లక్ష్మీనారాయణ నగర్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ తో పనిచేయడం ఎంతో అదృష్టంగా భావించే వారని, ఆయనతో ఉన్న అనుబంధం ఎన్నటికీ మరువలేనిదని,



తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లి తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం తీసుకువచ్చారని అన్నారు. నాగ జగదీష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవ నినాదానికి 44 వసంతాలు పూర్తిచేసుకుని 45వ వసంతంలోకి అడుగు పడుతున్న వేళ ప్రతి కార్యకర్త జీవితాంతం పార్టీకి విధేయులుగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల వెంకటరావు కోట్ని రామకృష్ణ కాండ్రేగుల సత్యనారాయణ కాండ్రేగుల రవీంద్ర ఎన్టీఆర్ కి నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ,స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి కృషిచేసిన టీడీపీ సీనియర్ నాయకులను, సీనియర్ ఎన్టీఆర్ అభిమానులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేణులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో ఘనంగా టిడిపి 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు..

ఎలమంచిలి ,మార్చి 29, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపల్లిలో పట్టణ తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ దంట్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో టిడిపి 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొద్దపు రమణ, బొద్దపు శ్రీనివాసరావు, నమ్మి రమణ, జెర్రిపోతుల అప్పారావు, సూరిబాబు, బొద్దపు అశోక్ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక..

- జట్టు కోచ్‌గా కే లోకేష్...

ఎలమంచిలి, మార్చి 29, ప్రభాతవార్త



బీహార్ రాష్ట్రంలో రాజగిరి ఏప్రిల్ ఒకటో తారీకు నుండి జరగబోవు హాకీ ఇండియా బాలుర సబ్ జూనియర్ నేషనల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేసినట్లు అనకాపల్లి జిల్లా అసోసియేషన్ కన్వీనర్ కే నరేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జట్టులోని జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని వారు కే సూర్య ప్రదీప్, ఎల్ చైతన్య ఎలమంచిలి చెందిన క్రీడాకారులని దేవేందర్ వెంకట్ నక్కపల్లి కి చెందిన క్రీడాకారుడు అని తెలిపారు. కోచ్గా కె లోకేష్ వ్యవహరిస్తారని నరేష్ తెలిపారు. హాకీ ఆంధ్రప్రదేశ్ జటుకు ఎంపికైన క్రీడాకారులకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్ల రామకుమారి సీనియర్ హాకీ క్రీడాకారులు అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు జీవీ రెడ్డి, జి రాంబాబు, ఎస్ రమేష్, మహేష్ శుభాకాంక్షలు తెలిపారు.

## నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ఆలయ పరిసర ప్రాంతాల్లో వంటలు చేసుకున్న భక్తులు

అనకాపల్లి మార్చి 29 :(ప్రభాతవార్త)



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం రాష్ట్ర పండగ గుర్తింపు పొందిన అనకాపల్లిలో గవరపాలెం లోవెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో మాజీమంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త అమావాస్య, రాష్ట్ర జాతర మహోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుండి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దేవస్థానం ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నూతన ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండి గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శన భాగ్యం కోసం క్యూ లైన్ లలో బారులు తీరారు. దేవస్థానం ఆధ్వర్యంలో క్యూ లైన్ లో భక్తులకు త్రాగునీరు, పిల్లలకు పాలు, పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత ఆలయ సహ కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా టిడిపి 44వ వ్యవస్థాపక దినోత్సవం

అగనంపూడి, ప్రభాతవార్త



జీవీఎంసీ 85 వార్డ్ అగనంపూడి పునరావాస కాలనీ మినీ జగదాంబ కూడలి ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ 44వ వ్యవస్థాపక దినోత్సవం చాలా ఘనంగా జరిగినది. 85 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశంద్ర, 85 వార్డు ఇంచార్జ్ ఇల్లపు ప్రసాదు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లి శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసీ ఘనంగా నివాళులర్పించారు అనంతరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక జెండాను ఎగరవేశారు. అనంతరము వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఆశాజ్యోతి పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ ప్రారంభించి మన రాష్ట్రాన్ని ప్రపంచ దేశాల్లో గుర్తింపు తీసుకురావడం జరిగిందని ఆయనకి కళ సుపరిపాలన బాగా చేసినందుకు భారతరత్న అవార్డు ఇవ్వాలి అని అన్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు నెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావం నుండి అంకితభావంతో కృషిచేసిన సీనియర్ టిడిపి నాయకులకు దృశ్యాలువా కప్పి షీల్డ్ ను ఇచ్చి ఘనంగా సన్మానించినారు. టిడీపీ మరియు అనుబంధ సంఘ నాయకులు నాయకులు బలి రెడ్డి సత్యనారాయణ, కరణం సత్య రావు,గంతకోరు అప్పారావు, కత్తి ముత్యాలు బేత హనుమంతరావు, వంకర రాము విందుల రాజు అండిబోయిన మంగరాజు,, కొర్రాయి నాగార్జునరావు ,అమర్ పిన్ని అప్పారావు ఇల్లపు ఈశ్వరరావు, అలమండ శ్రీనివాసరావు,ఎల్లపు శివ బండారు చందు రమేష్, శ్రీరామదాసు చెల్లయ్య, వెంకట్రావు, గుదే చంటి కండిపిల్లి పైడ్రాజు మొలికోటేశ్వరరావు, పలక రాము, వడ్డాది శ్రీను,గంతకోరు సత్యవతి గోపిశెట్టి,పద్మ శిరీష టిడిపి కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌పై జిల్లా ఎస్పీ హెచ్చరిక

- యువత, తల్లిదండ్రులకు కీలక సూచనలు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, మార్చి 29 (ప్రభాతవార్త):



ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన కీలక సూచనలు చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులపై, ఆన్‌లైన్ బుకీలపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసామన్నారు. బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా పాల్గొన్నా ఏపీ జూద చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడకండి. శ్రమించకుండా వచ్చే సొమ్ము శాశ్వతం కాదు, అది మీ భవిష్యత్తును అంధకారం చేస్తుందన్నారు. తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని, స్మార్ట్ ఫోన్‌లలో వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేది గమనించాలని సూచించారు. క్రికెట్ ఒక వినోదం మాత్రమేనని, దానిని జూదంగా మార్చి మీ కుటుంబాలను నాశనం చేయవద్దని సూచించారు. ఒక్క తప్పుడు అడుగు మీ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల కలలను చిన్నాభిన్నం చేస్తుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు.

## నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి మార్చి 29 (ప్రభాతవార్త)



మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సారథ్యంలో అనకాపల్లి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం ప్రారంభించనున్నారు. మారేడు పూడి గ్రామంలో కోటి 25 లక్షల రూపాయలతో నిధులతో చేపట్టిన పనులు ప్రారంభిస్తారు. అక్కిరెడ్డిపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పేదవారి సొంత ఇంటి కల నిజం చేయాలని సంకల్పంతో నిర్మాణం పూర్తి చేసుకున్న సొంత ఇంటిని ఇంటి తాళాలు యజమానికి అందజేస్తారు. అనకాపల్లి మండలం రేబాక, కసింకోట మండలం జమాదులుపాలెం గ్రామంలో ఉదయం 11 గంటలకు మార్కెటింగ్ కమిటీ సహకారంతో పశు వైద్య శిబిరం జరుగుతున్న అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలు చేయనున్నారు.

## వాడవాడలా టిడిపి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు..

- టిడిపి కార్యాలయం వద్ద జండా ఆవిష్కరించిన ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, మార్చి 29, ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 44వ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పాల్గొన్నారు. పార్టీ జెండాను ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆలోచనలు ఆశయాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ముందుకు తీసుకు వెళ్తున్నారని, తెలుగు వారి గుండె చప్పుడు తెలుగుదేశం పార్టీ అని అన్న నందమూరి తారక రామారావు ప్రేరణతో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఒక క్రమశిక్షణతో దృక్పథంతో ముందుకు వెళ్తున్నారని 44 వసంతాలు పూర్తిచేసుకునే సందర్భంగా పేరుపేరునా ప్రతి కార్యకర్తకు నాయకులకు అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారిని గుర్తింపు లభించే విధంగా కృషి చేసిన మహా నాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె శివన్నారాయణ మూర్తి, తెలుగుదేశం పార్టీ అధికార జిల్లా ప్రతినిధి దాడి రమేష్, ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటస్వామి, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్, బొద్దపు రమణ, నమ్మి రమణ, ఆడారి రమణబాబు, కర్రెద్ల మల్లికార్జునరావు,రాజా మహేష్, మున్సిపాలిటీ పరిధిలో గల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ బాపు నాయుడు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ల పండగ

(అచ్యుతాపురం మార్చి 29 ప్రభాతవార్త)



పూడిమడక తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో, 44 వసంతాలు తెలుగుదేశం పార్టీ పూర్తిచేసుకున్న సందర్భ మున గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసి అనంతరం మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు గారు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపుగా పూలమాలలు వేసి సాళువ కప్పి సన్మానం చేసి వారిని ప్రోత్సహించడం జరిగింది అలాగే ఆయన కార్యకర్తలతో నాయకులతో మాట్లాడుతూ తెలుగు జాతి గర్వంగా తలెత్తుకొని నిలబడి నేటికీ 44 సంవత్సరాలు! 4 దశాబ్దాలుగా తెలుగు వాడిని మేల్కొలుపుతూ, సంక్షేమాన్ని ప్రోత్సహిస్తూ వచ్చింది మన తెలుగు దేశం పార్టీ. ఈ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఖిప్రజలే దేవుళ్ళు, సమాజమే దేవాలయంఖి అనే మన అన్న ఎన్టీఆర్ గారి ఆశయానికి మళ్లీ అంకితమవుదాం. మన అధినాయకత్వాన్ని దృష్టిలో పెట్టుకొని మునుపటికంటే మెరుగ్గా మన పూడిమడక గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని, అని కార్యకర్తలకు తెలియజేస్తూ వృద్ధులకు, వికలాంగులకు రొట్టెలు , పళ్ళు, పంపిణీ చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరుగు వెంకటరావు,గంగిరి రాజు, సమ్మంగి లక్షణ,మసేనురావు, కొండయ్య, వాడమొదుల ముత్యాలు, మేరుగు ఎర్నాయుడు చిన్న, బొంగు నాగేష్, ఎరిపల్లి పోలయ్య, సత్తయ్య, ఎరిపల్లి కోదండరావు, యజ్జల శ్రీరామ్ మైలపల్లి ధనరాజు ,బీసీ సెల్ అధ్యక్షులు ధోని ధోనీ, ధోని ఎర్రయ్య, శివకోదండరావు, దుర్గారావు, చోడిపల్లి మహేష్, తాతాజీ, ఈశ్వరరావు, సత్యన్నారాయణ,మొదలగు ముఖ్యమైన కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2న కలెక్టరేట్ వద్ద ధర్నా

(అచ్చుతాపురం మార్చి 29 ప్రభాతవార్త)




ఏప్రిల్ 2న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తిమ్మరాజుపేట గ్రామంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అచ్చుతాపురం సిపిఎం కన్వీనర్ ఆర్ రాము, సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ, పింఛన్లు, ఇల్లు మంజూరు చేయాలని, దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూములను జిరాయితీ భూములుగా మార్చి, లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని, ఎస్ ఈ జెడ్ పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, రోడ్డు నిర్వాసితులకు రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి, చిరు వ్యాపారులకి న్యాయం చేయాలని , సమస్యల పరిష్కార సాధన కోసం ఏప్రిల్ 2న జరిగే కలెక్టరేట్ ముట్టడికి బాధితులు, సామాన్య ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం కోరుతోంది. ఈ కార్యక్రమంలో కె సోమనాయుడు, బొందల భరత్, కడియాల చిరంజీవి, కాకి రాము, దుర్గి నాయుడు, వేములపూడి కనుక, సియాద్రి చిన్న తల్లి ,నాగల వెంకట అప్పారావు ,బత్తిన అబి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో తెలుగు తమ్ముళ్ల పండుగ

(అచ్యుతాపురం మార్చి 29 ప్రభాతవార్త)



అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో క్లస్టర్ కో కన్వీనర్ రెడ్డి వరాహ నగేష్ ఆధ్వర్యంలో 44వ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు గారు, రాష్ట్ర కార్యదర్శి శ్రీ రాజాన రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు గారు పతాక ఆవిష్కరణ చేశారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆలోచనలు మరియు ఆశయాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మన యువ నాయకులు నారా లోకేష్ ముందుకు తీసుకు వెళ్తున్నారని, తెలుగువారి గుండెచప్పుడు తెలుగుదేశం పార్టీ అన్నారు. రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీని మరింతగా బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేద్దామని, కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక సంస్థల్లో గెలిపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లి వెంకటరావు, గ్రామ శాఖ అధ్యక్షులు రెడ్డి శ్రీను, యూనిట్ ఇంచార్జ్ గొంపా నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు

## దాడి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా టిడిపి 44 వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు..

ఎలమంచిలి,మార్చి 29, ప్రభాతవార్త



పట్టణంలోని 15, 16 వార్డులలో నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఆదేశాలు మేరకు,తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్ ఆధ్వర్యంలో టిడిపి 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి రమేష్ మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పార్టీ అని ప్రస్తుతం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రాజు,రాజేష్, ప్రవీణ్ కుమార్, ఉండా దేవుళ్ళు, లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.




## ఎన్టీఆర్ ఆశయాలే మా దిశ,దశ

- 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో:రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**పాడేరు,మార్చి29, ప్రభాతవార్త:**
అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు కిడారి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ టీడీపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలన కేక్ కట్ చేసి టీడీపీ ఆవిర్భవ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన పార్టీగా నిలిచిందన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ సామాన్యులను చట్టసభలకు పంపించి ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందని పేర్కొన్నారు.పేదవాడికి పట్టెడన్నం పెట్టి అతడు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ పనిచేశారని, అదే స్ఫూర్తితో పార్టీ ఇప్పటికీ ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచిన తెలుగుదేశం పార్టీ మహిళలకు స్థానిక సంస్థల్లో ముందుగానే రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి పునాది వేసిందని తెలిపారు. అమరావతి రాజధాని విషయంపై



మాట్లాడుతూ, మూడు రాజధానుల భావనకు ఇక ముగింపు పలుకుతూ ఒకే రాష్ట్రం – ఒకే రాజధాని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అమరావతి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అమరావతి వ్యతిరేక శక్తులను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిదని అన్నారు.బీసీలు, ఎస్సీలు, ఎస్టీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. పార్టీ విజయాలతో పాటు సంక్షోభాలు, సవాళ్లను కూడా ఎదుర్కొన్నదని, ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని అన్నారు.హత్యలు, అరెస్టులు, అణచివేతలు వంటి ఇబ్బందులు వచ్చినప్పటికీ తెలుగుదేశం పార్టీని ఎవ్వరూ దెబ్బతీయలేరని ధీమా వ్యక్తం చేశారు. సమర్థంగా పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు లభిస్తుందని, కార్యకర్తల శిక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీగా తెలుగుదేశం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. చివరగా, ఒకప్పుడు రైతు బిడ్డగా ఎదిగిన ఎన్టీఆర్ నేడు చరిత్రగా నిలిచారని, ఆయన ఆశయాలను సాకారం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని తంగిరాల సౌమ్య గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోబాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు,రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, మాజీ సర్పంచ్ కూడ వెంకటరావు, టీడీపీ నాయకులు త్రినాధ్ మురళి స్వామి, రాంబాబు కొండబాబు తదితరులు పాల్గొన్నారు

## పాఠశాలల్లో హెచ్ఆర్ఏసిపి అవగాహన సదస్సు

**అరకులోయ, మార్చి 29, ప్రభాతవార్త**



అరకులోయ ఏపీఆర్, పిటిజి బాలుర పాఠశాలల్లో ఆదివారం మానవ హక్కుల నేర నిరోధిక సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కె కృష్ణకుమారి ఆధ్వర్యంలో గంజాయి, ఆల్కహాలు, మానవ అక్రమ రవాణాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఆర్ఏసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కే కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, ఆల్కహాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు అలాగే వాటి వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. ముఖ్యంగా యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపల్, హెచ్ ఆర్ ఏ సి ఏ సభ్యురాలు కే సింహాచలం పాల్గొన్నారు

## రోడ్డుపనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ కొర్రా త్రినాధ్, ఎంపీటీసీ వి సాధురాం

**ముంచంగి పుట్టు మార్చి 29 (ప్రభాతవార్త)**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ మెట్టగూడ గ్రామంలో పీఎం జన్ మన్ పథకం ద్వారా 1 కోటి 87 లక్షల రూపాయల వ్యయంతో తుమ్మిడి పుట్టు నుండి మెట్టగూడ వరకు 1.35 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్రా త్రినాధ్, ఎంపీటీసీ వి సాధురాములు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్రా త్రినాధ్ మాట్లాడుతూ తుమిడిపుట్టు పీఎం జన్ మన్ రోడ్డు నుండి మెట్టగూడ వరకు 1.35 కిలో మీటర్లకు (1.87 లక్షలు)ఒక కోటి ఎనభై ఏడు వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయ్యాయని దీంతో ఆదివారం నుండి తారు (బిటి)వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. దీనితో మెట్టగూడ గ్రామంలో రోడ్డు సమస్య తీరిందని అందుకు సహకరించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు,ప్రజా ప్రతినిధులకు,అధికారులకు సర్పంచ్ త్రినాధ్, ఆయా గ్రామాల ప్రజలు ధన్యవాదములు తెలిపారు.,ఈ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని అనేక సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రం అందజేయడం జరిగిందని,అనేక సార్లు పోరాటం చేయడం జరిగిందని తెలిపారు,ఆ ఫలితంగా ఎన్నాళ్ళకు రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎ.సత్యం,వార్డు సభ్యులు ఎ.అనంతరం, పిసా సభ్యులు వి నీలకంఠం, గ్రామస్థులు బి.గోపాల్,జి.బుద్ధు,రాజన్న,సీతారాం,సిబో తదితరులు పాల్గొన్నారు.

## జీకేవీధిలో ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**గూడెం కొత్తవీధి, మార్చి 29 (ప్రభాతవార్త):**



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ నిలబెట్టారని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ నాగమణి అన్నారు. జీకేవీధిలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండలరావుతో కలిసి ఆదివారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండా ఎగురవేశారు. తెలుగుదేశం పార్టీ ద్వారానే అభివృద్ధి సంక్షేమాలు సాధ్యమవుతాయని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని కోరారు. అనంతరం కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ గంటా నలిని కృష్ణ, మాజీ సర్పంచ్ లు కంకిపాటి నారాయణమ్మ, కొర్ర బలరాం, సీనియర్ నాయకులు వండలం బాలయ్య నడేల వెంకటలక్ష్మీ, ముక్కలు మహేష్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ముక్కలి కళ్యాణి, గుంట బుజ్జి బాబుయూనిట్ ఇంచార్జ్ లు మురళీ భూపతి రాజు, కొర్ర రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆత్మగౌరవం తెలుగుదేశం...!

- పార్టీ ఆవిర్భావం రోజు సీనియర్ కార్యకర్తలకు సన్మానం

**కొయ్యూరు, మార్చి 29, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని టిడిపి నేత, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఆదివారం మండల కేంద్రమైన రాజేంద్రపాలెం వారపు సంతలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయానికి ఎదురు నిలిచిన శక్తి,అభివృద్ధి, సంక్షేమం కలగలిపిన పాలనకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అన్నారు.మహానేత అన్నగారు ఎన్టీఆర్ ఆలోచనలతో ఆవిర్భవించి.. నారా చంద్రబాబు నాయుడు యొక్క దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఇప్పుడు యువనేత నారా లోకేష్ శక్తితో భవిష్యత్తు కోసం మరింత బలంగా ముందుకు సాగుతోం దన్నారు. 44 ఏళ్లుగా ప్రజల కోసం పోరాడుతున్న ఈ మహా ఉద్యమానికి వందనమన్నారు.పార్టీ మండల అధ్యక్షులు చంద్రరావు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సివియర్ కార్యకర్తలు ను సన్మానించి, వృద్ధులు కు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు వెంకటలక్ష్మి, బాలరాజు, సింహాచలం, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాచి కాకర చిన్నారావు , రాజు బాబు, వీరయ్యదొర, అప్పలరాజు, దుర్గ పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పాడేరు,మార్చి29, ప్రభాతవార్త**




తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాడేరులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు మణికంఠ లాడ్జి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకులు,రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు,రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేద బడుగు బలహీన వర్గాలు,గిరిజన హరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్వర్గీయ నందమూరి తారకరామారావు టిడిపి నీ స్థాపించగా ఎన్టీఆర్ ఆశయాలను అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని నాగరాజు అన్నారు.టిడిపి కార్యకర్తలకు పార్టీలో సుమిచిత స్థానం ఇస్తూ కార్యకర్తలకు భరోసాగా టీడీపీ అధిష్టానం ఉంటుందన్నారు.ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలను అధిష్టానం గౌరవిస్తుందని సుబ్బారావు అన్నారు.ఈ కార్యక్రమంలో పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు,టిడిపి సీనియర్ నాయకులు ఎస్.నాగబ్బాయి,పునర్ల గోపి,ఉల్లి రామారావు,కొణతాల ప్రశాంత్,ఆనందరావు,టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తా..!

- సీఎం, మంత్రి లోకేష్‌లతో ఆవిర్భావ దినోత్సవంలో సర్పంచ్ అప్పలనరస

**కొయ్యూరు మార్చి 29 ప్రభాతవార్త**



ఆవిర్భావ దినోత్సవంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లతో పాల్గొనే అవకాశం తనకు కలగడం ఎంతో ఆనందంగా ఉందని బాలారం సర్పంచ్ అప్పన అప్పల నరస సంతోషం వ్యక్తం చేశారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం లో చంద్రబాబు లోకేష్ లతో కలిసి పాల్గొన్న ఆమెను అధినేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. బాలారం నుండి రాజవొమ్మంగి వరకు రెండు జిల్లాలను కలుపుతూ రోడ్డు నిర్మాణానికి, అలాగే వైసిపి నేతల కబ్జాలో ఉన్న కంటారం పిహెచ్సి స్థలాన్ని తిరిగి పిహెచ్ సి సీకి అప్పగించే విధంగాను, కిష్టారం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి, బాలారం పంచాయతీలో యువత క్రీడాభివృద్ధికి తదితర అభివృద్ధి పనులకు తన వంతు కృషి చేస్తానని అధినేతలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అప్పన ఆనంద్ పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌పై కఠిన చర్యలు

- యువత, తల్లిదండ్రులకు ముఖ్య సూచనలు: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

**పాడేరు,మార్చి29, ప్రభాతవార్త:**



సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మీ భవిష్యత్తును ప్రమాదంలో పెట్టొద్దు" అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల దృష్ట్యా, జిల్లా ఎస్పీ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన హెచ్చరిక జారీ చేశారు. జిల్లాలో ఎటువంటి బెట్టింగ్ కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులు, ఏజెంట్లు, ఆన్‌లైన్ బుకీలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్ నిర్వహించడం, ప్రోత్సహించడం లేదా పాల్గొనడం వంటి చర్యల్లో పాల్గొన్న ఎవరైనా ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించబడతాయన్నారు.దేశవ్యాప్తంగా ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనలు ఆన్‌లైన్ బెట్టింగ్ ఎంత ప్రమాదకరమో స్పష్టం చేస్తున్నాయన్నారు. 23,000 కోట్ల రూపాయలు విలువైన అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.26 కోట్ల ఆన్‌లైన్ బెట్టింగ్ మోసం కేసులో బాధితులు సోషల్ మీడియా ప్రకటనల ద్వారా మోసపోయి భారీగా నష్టపోయారనీ ఎస్పీ గుర్తు చేశారు.బెట్టింగ్ కారణంగా అప్పుల బారిన పడి, దేశవ్యాప్తంగా 1,400 కంటే ఎక్కువ కేసులు, అనేక ఆత్మహత్యలు నమోదయ్యాయనీ అయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ వినియోగం, ఆన్‌లైన్ యాప్స్, సోషల్ మీడియా కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలి. ఎందుకంటే అనేక బెట్టింగ్ ప్లాట్‌ఫార్మ్‌లు గుప్త లింకులు, ప్రకటనల ద్వారా చేరువ అవుతున్నాయనీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. క్రీడలను జూదంగా మార్చడం ఆర్థిక నష్టానికి, కుటుంబ స్థిరత్వం దెబ్బతినడానికి దారితీస్తుందనీ జిల్లా ఎస్పీ తెలిపారు.

## గ్యాస్ సిలిండర్ తీసుకోకుండానే డెలివరీ మెసేజ్‌లు

- అయోమయంలో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ తీరుపై వినియోగదారులు ఆగ్రహం

**అరకులోయ, మార్చి 29, ప్రభాతవార్త :**



యుద్ధ ప్రభావం తో ప్రస్తుతం ఏర్పడిన గ్యాస్ కొరత ను కొంత మంది గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు అరకులోయ లో జోరుగా వినిపిస్తున్నాయి. ఆన్ లైన్ లో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వినియోగిదారులకు గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ మెసేజ్ లు రావడంతో అవాక్కవుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకులోయ లో భారత్ గ్యాస్ వినియోగదారులకు మైదాన ప్రాంతం శృంగవరపు కోట ( ఎస్ కోట ) కు చెందిన శ్రీ లక్ష్మిగ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్ లైన్ లో గ్యాస్ తీసుకుందామని బుక్ చేసుకున్న ఎస్ కోట భారత్ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులకు, గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ చేసినట్లు మెసేజ్ లు రావడంతో అవాక్కవుతున్నారు. దీనిపై ఎస్ కోట భారత్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని అడిగితే గ్యాస్ బుక్ చేసుకున్న రోజునే డెలివరీ మెసేజ్ కూడా వస్తాయని, గ్యాస్ వ్యాన్ వచ్చినప్పుడు వినియోగదారులు వస్తే కొత్తగా మళ్లీ ఓటిపి వస్తుందని అది చూపిస్తే సిలిండర్ ఇస్తామని చెప్పడంతో గ్యాస్ వినియోగదారులు మండి పడుతున్నారు. దీనిపై వినియోగదారులు మాట్లాడుతూ గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ మెసేజ్ ఎలా వస్తుందని, కావాలనే వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎక్కడి న్యాయమని, తాము పద్ధతిగా ఆన్ లైన్ లో గ్యాస్ ను బుక్ చేసుకుంటున్నామని, గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత మాత్రమే డెలివరీ మెసేజ్ రావాలి కదా, మళ్లీ ఓటిపి రావడం ఏమిటి అని వినియోగదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరుపై ఆగ్రహం చెందుతున్నారు. వినియోగదారుల పేరుతో ఆన్ లైన్ బుకింగ్‌లు జరుపుకొని, నిర్వాహకులు వినియోగదారులకి గ్యాస్ సిలిండర్లు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్లో సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలను వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు . ఇలా చాలామంది గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఇవేవీ తమకు పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం . కాగా అరకులోయ లో భారత్ గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించి గోడౌన్ లేకపోవడంతో మైదాన ప్రాంతాలు శృంగారపు కోట శ్రీ లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీస్ , మాడుగుల నుండి శ్రీ వెంకట సీతారామ భారత గ్యాస్ ఏజెన్సీ లు గ్యాస్ ను సరఫరా చేస్తున్నారు. గ్యాస్ మోసాలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి , బ్లాక్ మార్కెట్ ను అరికట్టి వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే అరకులోయలో భారత్ గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించి గోడౌను ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు

## పార్టీ జెండా మోసే వవారే నిజమైన కార్యకర్త...

- టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య)

**ముంచంగి పుట్టు, మార్చి 29, (ప్రభాతవార్త)**



తెలుగువారి భవిష్యత్తును మార్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని , భారతీయ జెండా మోసే వారే నిజమైన కార్యకర్త అని ముంచంగిపుట్టు మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఏకైక పార్టీ అని పేదవాడికి పట్టేడన్నం పెట్టడం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని ఆమె పేర్కొన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఈ పార్టీ నిలిచిందన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ముంచంగిపుట్టు మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ ఆధ్వర్యంలో మండలంలో టిడిపి నాయకులంతా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల సభలో టిడిపి నాయకులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆమె పేర్కొన్నారు. పార్టీ కోసం అహర్నిశల కష్టపడి పని చేసే వారికి అవకాశం ఉన్నప్పుడు ఖచ్చితంగా టిడిపి పార్టీ. వారికి మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొంచెం కొట్టు మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ తో పాటు ప్రధాన కార్యదర్శి కొంతేరి. జగత్ రాయ్, ఆరుకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి. కామేష్, మాజీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ శాస్త్రి బాబు, మాజీ మండల అధ్యక్షులు కిల్లో బలరాం, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రణసింగి నీలకంఠం పాత్రో, తెలుగు రైతు అధ్యక్షులు వణుగు. రామ్మూర్తి, వనబసింగి సర్పంచ్ వి. లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు రత్నమ్మ, సీనియర్ నాయకులు కిరసాని లైకోన్, మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ మండి ప్రభాకర్, టిఎన్టియు కార్యదర్శి రఘునాథ్, క్లస్టర్ ఇంచార్జ్ లు మజ్జి చిన్ని, బి రామారావు, పంచాయతీ కార్యదర్శి బి గోపాల్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు మత్స్యరాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, తెలుగు యువత ఉపాధ్యక్షులు కిల్లో. సూర్య, యూనిట్ ఇంచార్జ్ కొండ సీమ సింహాచలం, బూత్ ఇన్చార్జ్ బలరాం గ్రామ అధ్యక్షులు ముక్కి.గోపాలరావు, యూనిట్ ఇన్చార్జి ప్రమోద్ పల్లుల మల్లన్న టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవంలో తోట దొరబాబుకి సన్మానం

**కొయ్యూరు మార్చి 29 ప్రభాతవార్త**
టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కోసం పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను దిగ్విజయంగా ముందుకు తీసుకు వెళ్తున్న కార్యకర్తలను సన్మానించడంలో భాగంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండలం మొత్తం మీద సభ్యత్వ కార్యక్రమాలను డోర్ టు డోర్ ప్రతి ఒక్క కార్యక్రమంలో ముందుండి నడిపిస్తున్న మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వీర సత్యనారాయణ (దొరబాబు) పాడేరు నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

## దారుణ హత్య సంఘటనలో ముగ్గురు మైనర్ నిందితులు అరెస్ట్

- రూపా రిసార్ట్ యజమాని పై కేసు నమోదు
- మూడు రోజుల్లోనే కేసును చేదించిన పోలీసులు

**అరకులోయ, మార్చి 29, ప్రభాతవార్త :**



అరకలోయ మండలంలోని చినలబుడు పంచాయతీ, హట్టగుడ గ్రామ సమీపంలో ఉన్న రూప రిసార్ట్స్ వద్ద ఈ నెల 24 వ తేదీన మహిళ కోసం జరిగిన గొడవ లో సురేష్ అనే యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన లో ముగ్గురు మైనర్ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఆదివారం అరకులోయ పోలీసు సర్కిల్ కార్యాలయంలో పాడేరు డి.ఎస్.పి అభిషేక్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. .విజయనగరం జిల్లా, తెర్లాం మండలం జన్నివలస గ్రామానికి చెందిన నాగెళ్ళ సురేష్ (25) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నెల 24వ తేదీన మండలం లోని హట్టగూడ గ్రామ సమీపంలో ఉన్న రూప రిసార్ట్స్ లో ఓ మహిళతో కలిసి సురేష్ ఒక గది అద్దెకి తీసుకున్నాడు. అయితే రూప రిసార్ట్స్ లో పనిచేస్తున్న ముగ్గురు మైనర్ యువకులు రిసార్ట్స్ కు వచ్చిన మహిళ తో తమ లైంగిక వాంఛను తీర్చుకోవాలన్న ఉద్దేశ్యముతో రాత్రి 8:30 గంటల సమయంలో సురేష్, మహిళ తో గొడవకు దిగారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురు యువకులు రిసార్ట్స్ లోని కిచెన్ గదిలో ఉన్న కత్తులను తీసి సురేష్ ను బెదిరించారు. అయితే సురేష్, మహిళ తో కలిసి రిసార్ట్స్ గది ఖాళీ చేసి అక్కడి నుండి వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, ముగ్గురు మైనర్ యువకులు సురేష్ ని రిసార్ట్స్ గేట్ వద్ద అపి బలంగా కొట్టి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఈ సంఘటనతో మహిళ ఆందోళన చెంది అరుపులు అరవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకోవడంతో ముగ్గురు యువకులు పారిపోయారు. సురేష్ హత్య సంఘటనపై ఈనెల 24వ తేదీన పోలీసులకు సమాచారం తెలియగా, కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసి మూడు రోజుల్లోనే హత్య చేసిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ సురేష్ అనే యువకుడు గతంలో ఉషోదయ రిసార్ట్ లో పనిచేసేవాడిని, పనిచేసే సమయంలో ఓ మహిళతో పరిచయం ఏర్పాటు చేసుకున్నాడన్నాడని చెప్పారు. తర్వాత సురేష్ తన స్వగ్రామానికి వెళ్లి వివాహం చేసుకొని, హైదరాబాదు లో జ్యూలరీ షాప్ లో పనిచేస్తున్నట్లు తెలిపారు. అయితే సురేష్ ఈనెల 24వ తేదీన అరకలోయలో పాత పరిచయం ఉన్న మహిళతో కలిసి రూప రిసార్ట్స్ కు తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అక్కడ ముగ్గురు యువకులతో జరిగిన గొడవలో సురేష్ దారుణంగా హత్యకు గురైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి ముగ్గురు మైనర్ నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. కాగా అరకులోయ లోని ప్రతి రిసార్ట్స్, లాడ్జీలు, గెస్ట్ హౌస్ ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధన ప్రకారం రికార్డులు కలిగి ఉండాలని, అలా లేని రిసార్ట్, లాడ్జి లు, గెస్ట్ హౌస్ ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. అలాగే రూప రిసార్ట్ నిర్వాహకులు పై కూడా కేసును నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, సబ్ ఇన్స్పెక్టర్ గోపాలరావు పాల్గొన్నారు.

## త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న కిడారి శ్రావణ్ కుమార్

- సంప్రదాయ పెళ్లికొడుకు పసుపు .. దంచుతున్న మహిళలు కోలాహలంగా కిడారి నివాసం:

**పాడేరు,మార్చి29, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ నివాసంలో జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్ సంప్రదాయ పసుపు దంచే కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ కిడారి బంధు మిత్రులు ,మహిళా అధిక సంఖ్యలో పాల్గొని పెళ్లి కుమారుణ్ణిగా చేయడం జరిగింది. కుటుంబ సభ్యులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా పసుపు దంచే కార్యక్రమం సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.



కిడారి కుటుంబంలో పెళ్లికళ రావడంతో సంతోషం వ్యక్తం చేసారు అనువాదం అంతా మహిళలు,బంధు మిత్రులతో కళకళలాడింది. ఈ సందర్భంగా పెళ్లి ఈ ఏడాది మే13వ తేదీన జిల్లా పాడేరు కేంద్రంలో పెళ్లి నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు. కావున అందరు పాల్గొని ఆశీర్వాదించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజి ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డా.నరసింగరావు,ఈశ్వరి, సర్పంచులు బాకూరు వెంకటరమణ రాజు పాండురంగా స్వామి, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు,అండిభ సర్పంచ్ సత్యనారాయణ, మురళి,జి సి సి మేనేజర్లు కృష్ణ ప్రసాద్,వెంకటేష్సి ంహాచలం,ఉద్యోగులు,ఉపాధ్యాయులు, బీజేపీ నాయకుడు కురుసా ఉమామహేశ్వరరావు, రవి కుమార్,, సర్పంచ్ శాంతి కుమారి మాజీ జడ్పీటీసీ వసంత కుమారి, ముంచంగిపుట్టు మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ,ఎంపీటీసీ కొమ్మ రమ, ఎంపీటీసీ రాధ, సూర్యకాంతం,కేజీయా రాణి, జనసేన అరకు ఇంచార్జి శెట్టి చిరంజీవి,మహేశ్వరీ, త్రినాధ్ మాజీ సర్పంచ్ కూడ వెంకటరావు, బుక్క రాజేంద్ర, గంజాయి గంగరాజు,తదితరులు కుటుంబ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

## జడుమూరులో టీడీపీ 44వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

**గూడెం కొత్తవీధి మార్చి 29 (ప్రభాతవార్త)**



గూడెం కొత్తవీధి మండలం సంకడ పంచాయతీ జడుమూరు గ్రామంలో టీడీపీ 44 వ ఆవిర్భవ వేడుకల ఘనంగా జరిపించిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవింద రావు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పార్టీ స్థాపన 1982 మార్చి 29న హైదరాబాద్‌లో తెలుగు దేశం పార్టీ (గిదేశి)ని స్థాపించారని , "చైతన్య రథం" అనే వాహనంపై రాష్ట్రమంతటా పర్యటించి, కేవలం 9 నెలల్లోనే అధికారాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారని ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మొత్తం మూడు సార్లు (198384, 198489, 199495) ముఖ్యమంత్రిగా పనిచేశారు. పేదల కోసం రూ/కిలో బియ్యం పథకం, పక్కా ఇళ్లు, జనతా వస్త్రాలు వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టారని. ఢిల్లీ పాలకుల పెత్తనాన్ని ఎదిరించి, "తెలుగువారి ఆత్మగౌరవం" నినాదంతో జాతీయ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించారనీ స్మరించుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ మామిడి చంటిబాబు, బూత్ ఇంచార్జి సద్ద బొజ్జిపడల్, గ్రామస్తులు పాల్గున్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

**పాడేరు,మార్చి29, ప్రభాతవార్త**
గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగు బంగారం గా పేరుగాంచిన శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మరియు పాడేరు శాసనసభ్యులు, మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు మరియు ఆలయ కమిటీ సభ్యులు బోనంగి వెంకటరమణ కొణతాల సతీష్ , కిల్లు చంద్రమోహన్ కుమార్,కూర రాము, జంపరంగి సత్తిబాబు, పిట్ట నవీన్, లకే రత్న బాయ్, పలాసి రమణమ్మ ,దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి సుదీర్ఘ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం కార్యక్రమాన్ని స్వీకరించారు.

## మండలంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు సీతారాం పర్యటన..

**గొలుగొండ మార్చి 29 ప్రభాతవార్త**





ఎస్సీలకు చెందిన భూముల్లో ఇతర వ్యక్తులు సాగు చేయడంపై అందుతున్న ఫిర్యాదులు మేరకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం ఆదివారం పరిశీలించారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన సీతారాం నేరుగా లబ్యదారులతో మాట్లాడారు. కసిమి, జోగంపేట, సిహెచ్ నాగాపురం, పాత కృష్ణాదేవిపేట గ్రామాల్లో వేరువేరు సమావేశాల్లో డి పట్టా భూములు కలిగిన లబ్ధిదారులతో చర్చించారు. కసిమి పంచాయతీలో సుమారు 20 ఎకరాల భూమి ఆ క్రమంలో ఉందని అందిన ఫిర్యాదుతో ఆదివారం ఉదయం మొదటిగా కసిమిలో లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జోగుంపేట తాండవ నిర్వాసితులుగా ఉన్న ఎస్సీలకు అప్పట్లో కోటవుట్ల మండలం పొందూరులో 50 మంది లబ్ధిదారులకు 102 ఎకరాలు సాగుభూముగా పట్టాలు అందజేశారు. 1989లో ఈ పట్టాలను అందుకున్న లబ్ధిదారులు ఆ పట్టా భూములు తమ స్వాధీనంలో లేవని ఇటీవలే ఫిర్యాదు చేశారు. సిహెచ్ నాగపురంలో ఎస్సీలకు చెందిన భూములు అన్యాక్రాంతంగా ఉన్నాయని ఈ ఫిర్యాదు పై కూడా నేరుగా గ్రామంలో పర్యటించి లబ్ధిదారులతో చర్చించారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాలలో పర్యటించి అక్కడే విలేకరులతో మాట్లాడారు. డి పట్టా పొంది నా లబ్ధిదారులు ఎప్పటికీ రికార్డులు ఏమిటి తొలగింపు చేయడం జరగదని ఎప్పటికైనా వారికే ఆ భూములు చెందుతాయని స్పష్టం చేశారు. మరుగున పడిన ఎస్సీ రుణాల లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా పొందూరులో ఉన్న 102 ఎకరాల భూమి దానికి చెందుతుందని పూర్తి నివేదిక వచ్చిన వెంటనే తగు చర్యలకు కమిషన్ సిద్ధంగా ఉందన్నారు. ఏ సమస్య అయినా ఛైర్మన్ ద్వారా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, రెసిడెన్షియల్ పాఠశాల విద్య కమిటీ ఛైర్మన్ చిట్ల చలపతిరావు తహసీల్దార్ కె నూకరాజు ఎం పి డి వో యు వి ఎస్ శ్రీనువాసురావు గొలుగొండ ఎస్సై ఐ పి రామారావు కృష్ణదేవిపేట ఎస్సై ఐ రిషికేశ్వరరావు, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ వార్డిన్ నర్సీపట్నం డివిజన్ సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి అసిస్టెంట్ అధికారి బాబురావు డి వి ఎం సీ సభ్యులు సహదేముడు బి అప్పారావు ఎం డి రాజు ఈరెళ్ళ చిరంజీవి పాల్గొన్నారు.

## ఇమ్మానియేల్ నర్సింగ్ కాలేజీలో అగ్నిప్రమాదం

**- ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న యాజమాన్యం**

**మాకవరపాలెం మార్చి 29 ప్రభాతవార్త**



మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంలో నిర్వహిస్తున్న ఇమ్మానియేల్ నర్సింగ్ కళాశాలలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈమేరకు ఆదివారం జరిగిన సంఘటనలో ప్రమాదం జరిగే సమయానికి కళాశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కొండల అగ్రహారం కేంద్రంగా నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. అగ్నికీలాలతో వెగసిపడుతూ, దట్టమైన పొగతో ఆప్రాంతమంతా భయానకంగా మారడంతో ఒక్కసారిగా స్థానికులు పరుగులు తీశారు. 70 మంది విద్యార్థులు ఉండే నర్సింగ్ కళాశాలలో ఇటువంటి ఘోర ప్రమాదం జరగడంతో ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందో అంటూ యాజమాన్యం స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. కళాశాల వాచ్మెన్ మినహా ఆ భవనములో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని మండల విద్యాశాఖ అధికారి2 మూర్తి అన్నారు. కళాశాల చెందిన నర్సింగ్ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. విద్యాపరంగా వైద్య పరంగా ఎన్నో ఏళ్లగా కొండలగ్రహారం కేంద్రంగా నిర్వహిస్తున్న ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ సంస్థ, నిర్వహణ లోపం వల్లే ఇటువంటి ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు గుసగుసలాడుతున్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



టిడిపి కార్యకర్తగా పార్టీలో సభ్యులుగా ఉండటం పట్ల గర్వపడుతున్నామని టిడిపి పట్టణ అధ్యక్షుడు అద్దూరి లోవరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ 44 దినోత్సవ సందర్భంగా నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి ముందుగా పూలమాలు వేసి నివాళులర్పించిన కార్యకర్తలు అనంతరం లోవరాజు చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా ఉండటంలో ఉన్న సంతోషం ఎక్కడ ఉండదని ఇది ఒక మంచి కుటుంబం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ( కేవీ), కొప్పిశెట్టి వీరబాబు ,స్కూల్ ఛైర్మన్ శ్రీను, కక్కిరాల సురేష్ నున్న కాశీ విశ్వనాథ్ ,బిసి నాయకుడు కోసూరు శ్రీను ,పచ్చిపులుసు నాగేశ్వరరావు ,సకరు కుటుంబీకులు, ఎం. సత్తిబాబు, మాజీ సర్పంచ్ మీసాల ఉమామహేశ్వరరావు, నగిరెడ్డి వెంకటరమణ, డాక్టర్ గణేష్ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తకు గుర్తింపునిచ్చే పార్టీ టిడిపి: మార్కెట్ ఛైర్మన్ "దేవర"

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



ప్రపంచంలో తెలుగు వాడి గౌరవాన్ని చాటి చెప్పి ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలకు గుర్తింపు లభించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దేవర సత్యనారాయణ అన్నారు . మండలం లోని దేవవరం గ్రామంలో ఆదివారం తెలుగు దేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొరిమీ సూర్యగణేష్ సత్యనారాయణ , బత్తుల రమణ బాబు,యేళ్ళ చిరంజీవి,ప్రధాన కార్యదర్శి , పోతల అప్పలస్వామి , మునుకుర్తి సత్తిబాబు, కార్యదర్శి ,కొడిబొయిన ఏసుబాబు ,గింజల నూకరాజు , దేవపు అప్పలరాజు , ఈసరపు అప్పారావు, గొర్ల కన్నారావు, యలమంచిలి అప్పలరాజు, జమ్ముసుల సూరిబాబు, యువత కురందాసు లోవరాజు ,ప్రసాదుల నగేష్ , కొల్లు రమేష్ ,కొల్లు నాని , వైభోయిన గణేష్ ,సంగిపు సూరిబాబు , వెంకట రమణ ,చొప్ప నరసింగరావు ,చొప్పా లొవరాజు , చెల్లపు శ్రీను , చొప్పు బాబ్జీ,చెల్లపుబాబ్జీ తదితరులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘటం ఊరేగింపు.!

**శిరస్సుపై ధరించేందుకు భక్తుల్లో ఉత్సుకత..**

**(అడ్డురోడ్డు, ప్రభాతవార్త)**



మండలంలోని రేబాక గ్రామంలో రెండేళ్లకోసారి జరిగే గూడు పమ్మతల్లి జాతరకు ఆ గ్రామం ముస్తాబైంది. భక్తుల విశ్వాసానికి, సెంటిమెంట్ ఈ జారతలో కనబడుతోంది. ఆదివారం రాత్రి గ్రామ పురవీధుల్లో అమ్మవారి ప్రధాన ఘటాన్ని ఊరేగించారు. ఈ ఘటాన్ని శిరస్సు పై ధరించేందుకు ఎంతో మంది భక్తులు రెండేళ్లపాటు నిరీక్షిస్తుంటారు. ఆ గ్రామానికి చెందిన అమ్మవారి పూజారుల ఆధ్వర్యంలో ఘటం ఊరేగింపు ఘనంగా జరిగింది. రేబాక పురవీధుల్లో భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ ఈ గ్రామంలో జాతర జరుగుతుంది. సోమవారం భారీ ఊరేగింపులు, జాగరణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు, మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలుంటాయని నిర్వాహకులు చెప్పారు. గ్రామ పెద్దలు, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవం జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం వద్ద కూడా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం వేలాదిమందికి రమణయ్యపేట గ్రామస్తులు రేబాక గూడుపమ్మతల్లి ఆలయం వద్ద అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నారు.

## ఘనంగా టిడిపి44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**( ఎస్ రాయవరం మార్చి 29 ప్రభాత వార్త )**

మండలంలో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారంఘనంగా నిర్వహించారు. పెద్ద గుమ్ములూరు గ్రామంలో ఏజర్ల వినోద్ రాజు అడ్డరోడ్డు గ్రామంలో బొలిశెట్టి గోవిందరావు,పెట్టుగోళ్ల పల్లి గ్రామంలో అల్లు నరసింహమూర్తి ,వమ్మవరం గ్రామంలో పల్లెల జగ్గారావు పార్టీ జెండాను ఆవిష్కరించి, నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కూడు. గూడు. నీడ అనే నినాదంతో పేద ప్రజల గుండెల్లో ఈనాటి ఉన్నారని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నాయకులకు సన్మాన కార్యక్రమం

**(అచ్యుతాపురం మార్చి 29 ప్రభాతవార్త )**

ఎలమంచి నియోజకవర్గం అచ్చుతాపురం మండలం మోసయ్యా పేట గ్రామంలో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోసయ్యాపేటలో టిడిపి పార్టీ సన్మానించు కోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పీల తులసి రామ్, నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సీనియర్ టిడిపి నాయకులకు ఘన సత్కారం

**మాకవరపాలెం మార్చి 29 ప్రభాతవార్త**



మాకవరపాలెం మండలంలో ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఆర్ వై పాత్రుడు రాచపల్లిలో పార్టీ జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవం జరిపించారు. అదేవిధంగా తూటిపాల బుచ్చన్న పాలెం,లచ్చన్నపాలెం, కొండల అగ్రహారం, బూరుగుపాలెం గ్రామాలలో పార్టీ సీనియర్ నాయకులు సమక్షంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు చిట్టి పాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ వేడుకలు అత్యంత వైపంగా నిర్వహించారు. మండల కేంద్రం మాకవరపాలెంలో టిడిపి సీనియర్ నాయకులు స్థానిక ఉపసర్పంచ్ లాలం రాము, సీనియర్ టీడీపీ యువ నాయకులు రుత్తల నాని, అల్లంపల్లి వెంకటరమణ రుత్తల ప్రసాద్, పైలవిక్రమ్ ఆధ్వర్యంలో 44వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సీనియర్ల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మాకవరపాలెంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సీనియర్ కార్యకర్తలుగా పని చేస్తున్న మాజీ సర్పంచ్ ఇనప సప్పల మాణిక్యం,రుత్తల చినరాంబాబు, సి.యం.రమణ, బోలెం సత్యనారాయణ, మరి కొందరు టీడీపీ సీనియర్ నాయకులను ఘనంగా శాలువతో సత్కరించారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు

**(రాంబిల్లి మార్చి 29 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం లో ఉన్న లోవపాలెం, గజరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, వాడపాలెం, వాడ నరసాపురం, కొత్తపట్నం మత్స్యకార గ్రామాలలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు అత్యంత ఘనంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు, తీర ప్రాంత గ్రామాలన్నీ పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి, పసుపు జెండాలతో కళకళలాడాయి, పార్టీ కార్యకర్తలు అభిమానులు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు, ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేశారు, భవిష్యత్తులో మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ ఎరిపల్లి చిట్టిబాబు, రాంబిల్లి మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు, కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ, వాడ నరసాపురం మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, కొవిరి సూరిబాబు, జిరాయితి చింతువా పార్టీ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్, మండల తెలుగు యువత అధ్యక్షులు ఎరిపల్లి అజయ్, చోడిపల్లి ఈశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ పిల్లి సహదేవుడు, బూత్ ఇన్చార్జ్ గనగల్ల కోదండరావ్, సీనియర్ నాయకులు వాడ్రా వెంకట రావు,కోడా శ్రీను,కారే రాముడు, కోదండరావ్,నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## వైకాపా ముఖ్య నాయకుల సమావేశంలో వైకాపా రాష్ట్ర నేత "వీసం"

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఆదివారం జరిగిన వైకాపా ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, వీసం రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కు పార్టీకి సంబంధించిన పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నందమూరి తారకరామారావు ఘన నివాళులు.!( నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త) తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నక్కపల్లి పట్టణంలో ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ టిడిపి నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ( కేవీ), వాణిజ్య విభాగం నియోజకవర్గం కన్వీనర్ కక్కిరాల సురేష్, నున్నా కాశీ విశ్వనాథ్, నగిరెడ్ల వెంకటరమణ, బీసీ నాయకులు కోసూరి శ్రీనివాసరావు, డాక్టర్ గణేష్ ,తదితరులు ఉన్నారు.

## సీనియర్ కార్యకర్తలకు సత్కారం.!

**(నక్కపల్లి ,ప్రభాతవార్త)**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలు దేవరపు కొండలరావు ,కొప్పిశెట్టి జగదీష్ లతోపాటు పార్టీ సభ్యత్వాన్ని అధికంగా చేసిన గంట్యాడ రమేష్, పిక్కి గంగరాజు లను పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించారు .మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు తో పాటు నగిరెడ్డి నరేష్ ఉన్నారు.

## శారద నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

**- సాయి నగర్ లో విషాదఛాయలు**

**అనకాపల్లి రూరల్ మార్చి 29 :(ప్రభాతవార్త)**



మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామ సమీపంలో ఉన్న శారద నది లో ఇద్దరు యువకులు స్నానానికని వెళ్లి ప్రమాదవసత్తు నీటిలో మునిగి మృతి చెందిన విషాదకరమైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై మునగపాక ఎస్సై పి ప్రసాదరావు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ ముత్రాస్ కాలనీ సాయి నగర్ ప్రాంతానికి చెందిన చింత రోహిణి కుమార్(26), తాడి హర్షవర్ధన్ (24) అనే ఇద్దరు యువకులు ఆదివారం సాయంత్రం శారదా నది లో స్నానానికి అని నీటిలోకి దిగారు. అయితే వారికి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే మునగపాక ఎస్సై పి ప్రసాదరావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాల్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం మృతదేహాలను వెలికితీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. అయితే మృతి చెందిన ఇద్దరు ఒక ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. మృతుడు రోహిణి కుమార్ తల్లిదండ్రులు శ్రీనివాస్ నూక రత్నం, మరో మృతుడు హర్షవర్ధన్ తల్లిదండ్రులు శ్రీనివాస్ భవాని లు కూలి పని చేస్తున్నారు. ఈ సంఘటనతో ఇరువురి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. చేతికి అంది వచ్చిన కొడుకులు మృత్యువు కబళించడంతో తమ కళ్ళముందే నిర్జీవంగా ఉండటం చూసి గుండెలు బాదుకుని విలపిస్తున్నారు. దీంతో ముత్రాస్ కాలనీ, సాయి నగర్ ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**(రాంబిల్లి మార్చి 29 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం చిన్న కలవలపల్లి, గోవిందపాలెం, వై లోవ, పెద్ద కలవలపల్లి, వెల్చూరు కొత్తపేట, లాలం కోడూరు, అప్పన్నపాలెం, మొదలగు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పలువురు నాయకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, దేశంలో తెలుగువాడి గొప్పతనాన్ని చాటి చెప్పిన పార్టీ ఏదైనా ఉంది అంటే ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని జేజేలు కొడుతూ,గర్వంగా, ఘనంగా జై ఎన్టీఆర్ జై తెలుగుదేశం అని నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లాలం భరత్,చిన్న కలవలపల్లి విలేజ్ క్లస్టర్ ఇంచార్జ్ జల్లి ఆదిరెడ్డి, గోవింద పాలెం విలేజ్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రేఖ అప్పలరాజు, రాంబిల్లి విలేజ్ సోములు, వై.లోవ గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్ది నారాయణరావు, పెద్ద కలవలపల్లి యూనిట్ ఇంచార్జ్ రాము, ప్రసాద్, వెల్చూరు యూనిట్ ఇంచార్జ్ రవి, కొత్తపేట పార్టీ అధ్యక్షుడు ధర్మాల సత్యనారాయణ, అప్పన పాలెం తాతబాబు, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## సింగవరం గోకివానిపాలెం గ్రామాలలో బీసీవై పార్టీ కరపత్రాల పంపిణీ

**కసింకోట, మార్చి 29, ప్రభాతవార్త;**

భారత చైతన్య యువజన పార్టీ అధినేత చేపట్టిన 5 బీసీ సాధన డిమాండ్లతో కూడిన కరపత్రాలను బీసీవై పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు ఏదూర ఆదిలక్ష్మి ఆదివారం ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు.

## వైభవంగా బద్రావతి సమేత శ్రీ భావనారాయణ స్వామి కళ్యాణం

**- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త ఎం వి ఆర్**

**అనకాపల్లి మార్చి 29 :(ప్రభాతవార్త)**

పట్టణంలో స్థానిక గాంధీ మార్కెట్ దగ్గర్లో ఉన్న దేవుడి గుమ్మం కళ్యాణ మండపంలో ఆదివారం శ్రీ బద్రావతి సమేత శ్రీ భావనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ పద్మశాలి సంఘం పిలుపుమేరకు ప్రముఖ వ్యాపారవేత్త ఎం వి ఆర్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ముందుగా పద్మశాలి సంఘం సభ్యులు మేళతాళాలతో ఎం వి ఆర్ ని ఆహ్వానించి సాల్వాతో సత్కరించారు. అనంతరం ఎంవిఆర్ మాట్లాడుతూ ఇటువంటి మహోన్నత కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే పద్మశాలి సంఘానికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ ఉమా సహిత బాల త్రిపుర సుందరి సమేత శ్రీ బుర్రేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం

**(ఎస్ రాయవరం మార్చి 29 ప్రభాతవార్త)**

శ్రీ ఉమా సహిత బాల త్రిపుర సుందరి సమేత శ్రీ బుర్రేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణము ఎదురు సన్నాహాలు మొదలు కళ్యాణం వరకు కన్నుల పండుగ సాగింది.గ్రామ ప్రజలు మరియు పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆలయ అర్చకులు వినయ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బొలిశెట్టి గోవిందరావు,సోమిరెడ్డి రాజు కొణతాల శ్రీనివాసరావు, పులి సత్తిబాబు ,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 3 లక్షల కోట్లలో అమరావతికి ఎంత ఖర్చు పెట్టారో చంద్రబాబు చెప్పాలి

**- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ**

**కసింకోట, మార్చి 29, ప్రభాతవార్త;**




కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారని, వాటిలో అమరావతికి ఎంత ఖర్చు పెట్టారని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. కసింకోట మండలంలోని తేగాడ వద్ద గల ఎస్స్టార్ గార్డెన్స్ లో ఆదివారం వైసిపిజిల్లాస్థాయి ముఖ్య నాయకుల సమావేశం వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల అభివృద్ధి కంటే వైయస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శించడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధిని మరిచి దోపిడీలు చేస్తున్నారని విమర్శించారు. కూటమిపాలనలో రైతులకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరచి పోయారన్నారు. కూటమి ప్రభుత్వ వచ్చిన రెండేళ్లకే 3 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. ఈ మూడు లక్షలు అమరావతికి ఎంత ఖర్చు పెట్టారో చంద్రబాబు నాయుడు ప్రజలకు చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం వలన రాష్ట్ర అభివృద్ధి ఎక్కడ గొంగళి అక్కడే అని అన్నారు రాష్ట్రంలో కూటమి పాలనలో అరాచకాలు దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. . వాటిని సమర్థవంతంగా వైసిపి నాయకత్వం, కార్యకర్తలు తిప్పుకొట్టాలన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మేలు చేసి ప్రసారం చేసుకోలేకపోయారని, చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీ చేయకుండానే ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే మళ్ళీ వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి సత్తా నిరూపించుకోవాలన్నారు. వైసీపీకి బలమైన కేడర్ ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో అన్ని అనుబంధ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపాతం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి కార్యకర్తలకు అన్యాయం జరగడం వాస్తవమేనని, ఆ విషయం జగన్ మోహన్ రెడ్డి గుర్తించారన్నారు. మరలా ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. స్టేజ్ మీద ఉన్న నాయకత్వమే కాకుండా, స్టేజ్ కింద ఉన్న నాయకత్వాన్ని స్టేజి మీద కూర్చోబెట్టాలని వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారని ఈ సందర్భంగా చెప్పారు. ఏప్రిల్ 24 లోపు పార్టీ అనుబంధ కమిటీలు ప్రతి నియోజవర్గంలోనూ పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, కంబాల జోగులు, ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ అనురాధ, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, జిల్లా పరిషత్ ఛైర్మన్ జల్లిపల్లి సుభద్ర, అనకాపల్లి వైసిపి సమన్వయకర్త మనసాల భరత్ కుమార్, శోభ హేమవతి, సరగడం చిన్న అప్పల నాయుడు,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, వీసం రామకృష్ణ,అనకాపల్లి కసింకోట ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, కేఎం నాయుడు, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి నీ కలిసిన "సూరకాసుల"

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రామారావులను కృష్ణాజిల్లా గుడివాడలో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూరకాసుల గోవిందు లు మర్యాదపూర్వకంగా కలిశారు.

27 గ్రామపంచాయతీలోటీడీపీ 44 వసంతాల వేడుకలు గొలుగొండ మార్చి 29 ప్రభాతవార్తతెలుగు ప్రజల గుండెచప్పుడుగా ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 వసంతాల వేడుకలను మండలంలో 27 గ్రామపంచాయతీలో పండగల నిర్వహించారు. ప్రతి గ్రామంలో టిడిపి జెండా ఎగరవేసి 44 వసంతాల మైలిరాయిలో తీసుకొచ్చిన సంస్కరణలు, సంక్షేమాలు నెమర వేశారు. పేదవాడికి కూడు గుడ్డ ఇల్లు లక్ష్యంగా నాడు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44 వసంతాలు తెలుగు ప్రజలకే గర్వకారణం అని నాయకులు అన్నారు. వసంతాల వేడుకను నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి జండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ 44 ఏళ్లలో ఐదు సార్లు అధికారం చేపట్టి ప్రజలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందించిన ఘనత టిడిపికే దక్కుతుందని జిల్లా పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. ఏ ఎల్ పురం లో మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగరవేసి కార్యకర్తలతో కలిసి ఆ వూరు బావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టిడిపి నాయకులు గ్రామ కమిటీల అధ్యక్షులు మండల కమిటీల సభ్యులు, ముఖ్య కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చోడవరం, మార్చి 29, ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం చోడవరం నియోజకవర్గంలో వాడవాడల ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి ఖ్యాతిని చాటిచెప్పిన ఏకైక వ్యక్తి స్వర్గీయ ఎన్టీ రామారావు అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో మనమంతా ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత రాష్ట్రం సర్వతో ముఖ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తోపాటు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. నేపథ్యంలో ప్రతి కార్యకర్త సైనికుడు లా పనిచేసే రానున్న రోజుల్లో పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గేదెల సత్యనారాయణ, గూనురు మల్లు నాయుడు, కే మచ్చిరాజు, జీవి సత్యనారాయణ(పెదబాబు), బొడ్డేడ నాగ గంగాధర్, టిడిపి పట్టణ అధ్యక్షులు చిన్న, పలువురు నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

మండలంలోని ఉపమాక ప్రాచీన శివాలయంలో ఆదివారం శివ,పార్వతుల వార్షిక కళ్యాణోత్సవాలు శైవాగమ సంప్రదాయం మేరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అంకురార్పణ కార్యక్రమాలు చేశారు. రాత్రి స్వామివారిని సప్పర వాహనంలోనూ, పార్వతీ దేవిని పల్లకీలో అలంకరించి కోలాట ప్రదర్శనలతో నక్కపల్లిలో వున్న మైలవరభట్ల జోగారావు ఇంటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రముఖ వేదపండితురాలు గొట్టుముక్కల గాయత్రీదేవి ఆదిదంపతుల పెళ్లిచూపులు,పెండ్లిమాటలు ఆ నాడు ఎలా జరిగాయో వివరించారు. ఎదుర్కోలు ఉత్సవం ఆద్యంతం భక్తులను అలరించింది. శింగంశెట్టి కుటుంబసభ్యులు, ఎంవీవీఎస్ఎన్ మూర్తి కుటుంబసభ్యులు నక్కపల్లిలో జరిగిన ఎదుర్కోలు ఉత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జి కొప్పిశెట్టి బుజ్జి, సహా నక్కపల్లి, ఉపమాక గ్రామాలకు చెందిన పలువురు పెద్దలు, పలుపార్టీల నాయకులు, శివయ్య భక్తులు పాల్గొన్నారు.

30skl13:30skl13.qxd 29-03-2026 22:59 Page 1



## పట్టుదల, శ్రమతోనే ఉన్నతోద్యోగం : ప్రభుత్వ విప్ వేపాడ



విజయనగరం, మార్చి29, ప్రభాతవార్త: నిరుద్యోగ యువత పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు కృషిచేయాలని ప్రభుత్వ విప్, ఎం.ఎల్. సిడాక్టర్ వేపాడ చిరంజీవిరావు సూచించారు. నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయం ఆవరణలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పూలే అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఆదివారం సాయంత్రం పోటీపరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మొయిద హనుమంతరావు, వావిలాపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదసుకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ వ్యాపార చిరంజీవిరావు హాజరై నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత లక్ష్యాన్ని ఏర్పారుచుకుని ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఎంత సేపు చదివామన్న విషయం కన్నా, ఎంత విషయం నేర్చుకున్నామన్న దే ముఖ్యమన్నారు. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ ఉండాలని, విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. మాజీ ఎంఎల్సి పాకలపాటి రఘువర్మ, శ్రీరామ్, విషయ నిపుణులు ఆర్ఎస్‌రెడ్డి, పొట్టా శ్రీనివాసరావు, బలరామ్, నిర్వాహకులు హనుమంతరావు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం



శ్రీకాకుళం, మార్చి 29, ప్రభాతవార్త: స్థానిక దమ్మలవీధి (వాడబలిజవీధి) రామమందిరంలో 27వ తేది నుండి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కాగా, 29 ఏకాదశి పర్వదినం కావడం వలన శ్రీ రంగభట్ల శ్రీనుగారి పర్యవేక్షణలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఇందులో స్థానిక ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొని స్వామివారి కళ్యాణం కనులారా తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఇందులో శ్రీరామమందిరం యువజన సంఘ సభ్యులు పొన్నాడ చంద్రశేఖర్, వంక శశికుమార్, పందిరి గోవిందరాజులు, పొన్నాడ విజయ్‌కుమార్, మైలిపిల్లి అప్పలరాజు, సూరాడ మణికంఠ, తదితరులు పాల్గొని కార్యక్రమం జరిపించారు.

## పేదల కోసం పుట్టిన పార్టీ... టీడీపీ : ఎమ్మెల్యే అశోక్



కవిటి, మార్చి 29 ప్రభాతవార్త : పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ అని ఇది స్వర్గీయ నందమూరి తారకరామారావు ఘనత అంటూ ఇచ్చాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. ఆదివారం కవిటి మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలుగు దేశం పార్టీ జెండాను ఎగురవేసి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు నాంది పలికింది స్వర్గీయ నందమూరి తారకరామారావు అంటూ ఆయన అడుగుజాడల్లో మనమంతా పయనించి పేదలు బడుగు బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, మాజీ జిల్లా కాప్సన్ సదానంద రౌలో, ఏఎంసీ ఛైర్మన్ మణి చంద్రప్రకాష్, పిఏసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, రైల్వే నెంబర్ రంగా రౌలో, తెలుగుదేశం నాయకులు బెందాళం సురేష్, బెందాళం తిరుమలరావు, వజ్జ రంగారావు, జిల్లా రైతు కార్యదర్శి పుల్లట సంతోష్, పోల్లాయి సింహాచలం, తెప్పల మోహన్‌రావు, పోల్లాయి డంబురు, మాజీ మండల కోఆప్షన్ వాసుదేవరావు తోపాటు పలువురు తెలుగుదేశం నేతలు, మహిళా ప్రతినిధులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక లేమితో ...అంతర్జాతీయ క్రీడాకారుడు

### దాతల వితరణ కోసం ఎదురుచూపు




కవిటి, మార్చి 29, ప్రభాతవార్త : శ్రీలంకలో అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న గోల్ సాట్ బాల్ పోటీలలో తలపడుతున్న అంతర్జాతీయ క్రీడాకారుడు దేవేంద్ర ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతూ దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న సంఘటన కవిటి మండలం కవిటి పంచాయతీ తొత్తుడుపుట్టుగ గ్రామానికి చెందిన జన్ని దేవేంద్ర నిదర్శనం. కవిటి పంచాయతీ తొత్తుడుపుట్టుగ గ్రామానికి చెందిన జన్ని దేవేంద్ర గత ఏడాది డిసెంబర్ 25 నుంచి 28 వరకు తమిళనాడులోని తిరుచూరులో జరిగే జాతీయస్థాయి గోల్ సాట్ బాల్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు పొంది నేడు శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ గోల్ సాట్ బాల్ పోటీల్లో పాల్గొనున్నాడు. ఈ పోటీల్లో పాల్గొనడానికి దేవేంద్రకు ఆర్థికలేమి అడ్డంకిగా మారింది. క్రీడలపై అపారమైన ప్రేమ, పట్టుదల కలిగిన ఈ నిరుపేద క్రీడాకారుడికి దాతలు సహాయం అందిస్తే, అంతర్జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి పేరు తీసుకురాగలడని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## యురేకా సైన్స్ పోటీల్లో కొల్లిపాడు విద్యార్థులకు ద్వితీయ బహుమతి



సంతబొమ్మాళి, మార్చి 29, ప్రభాతవార్త : మండలంలోని కొల్లిపాడు హై స్కూల్ విద్యార్థినిలకు యురేకా సైన్స్ ఎక్స్‌పో సైన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. శ్రీకాకుళం యుటిఎఫ్ భవన్‌లో ఇటీవల జరిగిన యురేకా సైన్స్ ఎక్స్‌పో సైన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిబిట్‌లో ద్వితీయ స్థానం సాధించిన కొల్లిపాడు విద్యార్థినులు డి.ఖ్యాతి, డి.నీలవేణిలకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ ప్రతినిధులు ఆదివారం బహుమతి ప్రధానం చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎర్త్ క్వేక్ డిటెక్ట్ సేఫ్టీ బెడ్ సిస్టం అనే సైన్స్ ప్రాజెక్ట్‌కు ఈ బహుమతి గెలుచుకున్నారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా పిలక ధనుంజయ్ కుమార్ (బయాలజీ టీచర్) వ్యవహరించారు. విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన కలిగి మూఢనమ్మకాల నిర్మూలనకు నిజజీవితంలో పాటు పడాలని పాఠశాల హెడ్మాస్టర్ మెట్ట రామారావు, పిఎస్ టీచర్ కే.సత్యనారాయణరావు అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బాలరాజు, లావణ్య, రామచంద్రరావు, మహేంద్ర, పీడీలు శ్రీనివాసరావు, శంకర్రావు, మోహన్ రెడ్డి, వెంకట్రావు మాస్టర్ విద్యార్థులు అభినందించారు.

## కలెక్టరేట్‌లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్



వీరఘట్టం, మార్చి 29 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

## సర్పంచ్‌లకు 'చింతాడ' ఆత్మీయ సత్కారం



ఆముదాలవలస, మార్చి 29, (ప్రభాతవార్త) : సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుండ టంతో వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న వైకాపా సర్పంచులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. మండలంలో ఉన్న సర్పంచులు కత్యాచార్యులపేట సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, అలాగే నియోజవర్గంలో ఉన్న సర్పంచులకు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా ఐదేళ్ల పదవీ కాలం ఏప్రిల్ 2వ తేదీకి పూర్తవుతున్నందున వైకాపా నియోజకవర్గం ఇన్‌చార్జ్ రవికుమార్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసి అభినందిం చారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ రానున్న సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పోటీకి సర్పంచులు సిద్ధంగా ఉండాలని సర్పంచులకు పిలుపు నిచ్చారు. వైకాపా తరపున పోటీ చేసిన అభ్యర్థులకు పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, గురుగుబెల్లి శ్రీనివాస రావు, మామిడి ఢిల్లేశ్వరరావు, మొండేటి కూర్మారావు, ఎన్ని రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం శ్రమించేవారికి తగిన గుర్తింపు తప్పదు




కోటబొమ్మాళి, మార్చి 29 ప్రభాతవార్త : పార్టీ కోసం నిరంతరం శ్రమించేవారికి గుర్తింపు తప్పదని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టెక్కలి నియోజవర్గం పరిధిలోని అన్ని పంచాయతీలలోని పలువురు టీడీపీ సీనియర్ కార్యకర్తలను ఆయన సత్కరించారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం మండలాల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, జీరు బీమారావు, బగాది శేషు, పినకాన అజయ్‌కుమార్‌తో పాటు ఏఎంసీ ఉపాధ్యక్షురాలు బాడాన రమణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, గోవిందపురం డీసీ కర్రి అప్పారావు, పట్ట సింహాచలం, పాగోటి ముత్తురాజు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ఇచ్ఛాపురం, మార్చి 29, ప్రభాతవార్త: మట్టల ఆదివారం (ఫామ్ సండే) పురస్కరించుకొని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి మండపల్లి సంఘం రెవరెండ్ పి.ప్రకాశరావు సంఘ కాపరి ఆధ్వర్యంలో పెద్దలు, స్త్రీల సమాజము, యవ్వ నస్తులు, పిల్లలు ఖజ్జూర మాటలు అందమైన పువ్వులతో అలంకరించి గ్రామ వీధులలో పాటలు పాడుకుంటూ, సువార్త ప్రకటిస్తూ, ప్రార్థనలు చేస్తూ ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకి ముందు ఆదివారం మట్టల ఆదివారం నిర్వహిస్తారు. అదేవిధంగా మందిరంలో కూడా కీర్తనలు ఆలపించి ఘనంగా కార్యక్రమం ముగించారు. గొల్లవీధి ఆంధ్రా బాపిస్టు చర్చి ఆధ్వర్యంలో ఫామ్ సండే ర్యాలీ నిర్వహించారు.

## బాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కోటబొమ్మాళి, మార్చి 29, ప్రభాతవార్త: బాలికలకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు తెలిపారు. స్థానిక ప్రకాశనగర్ కాలనీలో బాలికల వసతి గృహంలో ఆదివారం బాలికల సంరక్షణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా బాల బాలికలు వారి స్వీయ రక్షణ నిమిత్తం, ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి సహాయంగా పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ గూర్చి, నేషనల్ హైవే మరియు రూరల్ రోడ్లపై ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని, విధిగా లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం, ప్రమాదాలు చెప్పి రావు గనక, మద్యం సేవించి వాహనం నడుపుట ప్రమాదం, హెల్మెట్లు ధరించడం వలన ఉపయోగాలు గూర్చి వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల కొరకు 1098 ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, కోటబొమ్మాలి హెడ్ కానిస్టేబుల్ కే.గణేష్, రమణమ్మ, మెట్రిన్ కె.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అశోక్‌కు మంచి బుద్ధి ప్రసాదించు అంబేద్కరా..!!

### అంబేద్కర్ విగ్రహానికి వినతి అందించిన ఆదివాసీలు



మెళియాపుట్టి, మార్చి 29 ప్రభాతవార్త: మెళియాపుట్టి కేంద్రంలో గల గిరిజన స్థలం నందు ఆదివారం ఆదివాసీలు భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలంకరణ అనంతరం ఎమ్మెల్యే అశోక్‌కు మంచి బుద్ధి ప్రసాదించు అంబేద్కరా! అంటూ వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు లక్ష్మీపురం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివాసి సోదరునిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆఫ్ నాలెడ్జి పీపుల్, బ్లడీ బాస్టర్డ్ లాంటి వ్యాఖ్యలు సరికాదని, ఎమ్మెల్యే దిష్టిబొమ్మను తగలెడుతూ ఆదివాసీలు నిరసనలు తెలిపారు. నాగరిక సమాజంలో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని తక్షణమే తన మాటలు వెనక్కి తీసుకోవాలని, ఆదివాసీలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేదంటే ఆదివాసీలు రాస్తారోకు లు, ధర్నాలు చేసి ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెళియాపుట్టి మండల ఆదివాసీల అభివృద్ధి సేవా సంఘ అధ్యక్షులు సవర దేవేంద్రరావు, ఉపాధ్యక్షులు సుజాతమ్మ, ట్రెజరర్ రామచంద్రరావు, ఆదివాసీ సంఘ సభ్యులు పడాల రామారావు, లోకేశ్వరావు, పడాల రామస్వామి, ధర్మారావు, బుడ్డోడు, ఆసరి భాస్కరావు, మాజీ సర్పంచ్ రామస్వామి, పద్మారావు, ప్రకాశరావు, చిన్నయ్య మాస్టారు, బెజ్జి నిర్మల, సుధారాణి , తదితర ఆదివాసీలు పాల్గొన్నారు.

## వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా.. : ప్రభుత్వ విప్ అశోక్



కవిటి, మార్చి 29 ప్రభాతవార్త : ఇటీవల గిరిజనులపై తాను చేసిన వ్యాఖ్యలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో, ఇచ్చాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. బెందాళం అశోక్ ఆదివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. 'నా వ్యాఖ్యలను కొందరు కావాలని రాజకీయంగా వాడుకుంటున్నారు. దీనివల్ల నాకు తీవ్రంగా బాధ కలుగుతోంది' అని ఆయన అన్నారు. గిరిజనుల మనోభావాలు దెబ్బతిన్నట్లయితే క్షమించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఒక వర్గానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ, దాదాపు 27 వేల మంది తమ కుల గుర్తింపు స్పష్టత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాము బెంతోరియా అని చెప్పినా ఏ ప్రభుత్వాలు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో, వారి విద్య, డిగ్రీలు సరైన ఉపయోగం లేక కాఫీ షాపులు, హోటళ్లలో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించడంపై, ఒక వ్యక్తి తనపై ఆవేశంతో నీవు ఎవరు అసెంబ్లీలో ఈ కులంపై ప్రస్తావన చేయడానికి అన్న సందర్భంలో నేను ఆవేశానికి లోనై స్పందించానని అశోక్ తెలిపారు. తాను ఏ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడలేదని, ఒక వ్యక్తిపైనే స్పందించానని స్పష్టం చేశారు. ఆ ఘటన సమయంలో, అదే వర్గానికి చెందిన కొందరు అనుచరులు తనతో మాట్లాడి, తమ వ్యక్తి మాట్లాడిన తీరు సరికాదని అంగీకరిస్తూ వెంటనే క్షమాపణ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

## మూలపేట పోర్టుకు తరలిరండి : వైసీపీ



పాతపట్నం, మార్చి 29 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్చి 30న చేపట్టిన ప్రజా ఉద్యమానికి మద్దతు పలుకుతూ మన మూలపేట పోర్టుకు పదండి పోదాం ముందుకు అను కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త మూలపేట పోర్టుకు తరలిరావాలని పాతపట్నం వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయములో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మిరియాబిల్లి శ్యామసుందరరావుతో పాటు పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో 4,362 కోట్లతో ప్రారంభమై 70 శాతం పనులు పూర్తి చేసుకున్న మూలపేట పోర్ట్ ఈ జిల్లా ప్రగతికి తలమానికమని వారు పేర్కొన్నారు. ఆర్టిఐ అధ్యక్షులు ఏనుగుతల సూర్యం, మెండ సింహాచలం మాస్టర్, ఇప్పిలి నారాయణరావు, గోకవలస రాము, తాతయ్య మాస్టర్, దండుగల రామా రావు, పనుకు మోహనరావు, మజ్జి వరదరాజు, మజ్జి తిరుపతిరావు, చింతాడ త్రినాధరావు, బినియా వెంకటరమణ, నడిమింటి అర్జునరావు, సింగుపురం మురళి, పైల భోగిరాజు, కంటుబోతు గోపి, పెద్దిం టి నాగేష్, పడాల తిరుపతిరావు, నీలయ్య, లుగలాపు లక్ష్మణరావు, డకర ప్రకాశరావు, పీవీ కుమార్, గేదెల గోవిందరావు, పిన్నింటి ఫాల్గుణరావు, ఎన్ని శిరీష్, వైసిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజాంలో కార్డెన్‌సెర్చ్



రాజాం, మార్చి 29, ప్రభాతవార్త: రాజాం పోలీస్ స్టేషన్ పరిధిలోని రెల్లి వీధి, గొల్ల వీధిలో పోలీసులు ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో 70 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని విస్తృతంగా గాలింపు చేపట్టారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్పి రాఘవులుతో పాటు టౌన్ సీఐ అశోక్ కుమార్, రూరల్ సీఐ ఉపేంద్ర, ఎస్సై వెంకటేశ్వరరావు మిగతా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకే మౌలిక వసతులు



రణస్థలం, మార్చి 29, ప్రభాతవార్త : మండలంలోని వేల్పురాయి, సంచాం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన తారు రోడ్డు, సిసి రోడ్లను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి రోడ్లను జాతికి అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వీధికి సిసి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కూటమి నాయకులు పిషిణి జగన్నాధం నాయుడు, లంక శ్యామలరావు, పిన్నింటి వెంకట భానోజీనాయుడు, డీజీఎం ఆనందరావు, కోరాడ వెంకట రమణ, బాలి శ్రీనివాసరావు, మండపాక కనకారావు, సింక అప్పారావు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజాంలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజాం, మార్చి 29, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకు ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ జాతీయ రాజకీయాల్లో ఎంతో క్రియాశీలక శక్తిగా తెలుగు ప్రజలకు గుర్తింపు తెచ్చిందని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బొబ్బిలి రోడ్డులో గల దేవీ శ్రీదేవి కళ్యాణ మండపం ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 'రాజకీయం అంటే అధికారం చెలాయించడం కాదు. ప్రజలిచ్చిన అధికారాన్ని దేశ, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి వినియోగించడం.' అన్న ఎన్టీఆర్ ఆ దిశగా ప్రజలను చైతన్యపరిచారన్నారు.

# శ్రీకాకుళం వార్త

## సమాచార శాఖకు కలెక్టర్ నికాన్ జడ్ 50 కెమెరా అందజేత



శ్రీకాకుళం, మార్చి, 29 ప్రభాతవార్త : సమాచార పౌర సంబంధాల శాఖకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నికాన్ జడ్50 కెమెరా అనుబంధ పరికరాలు కొనుగోలు చేసి డిఐపిఆర్ఓ కమ్మినాన చెన్నకేశవరావుకు ఆదివారం అందజేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంనకు గతంలో డైరెక్టరేట్ నుండి సరఫరా చేసిన కెమెరాలు మరమ్మతులకు గురవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్, జిల్లా నిధులతో కొత్త కెమెరా కొనుగోలుకు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి మరింత వేగంగా, నాణ్యమైన దృశ్యరూపంలో తీసుకెళ్లేందుకు ఈ నూతన పరికరాలు దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డిఆర్ఓ వి.విశ్వేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సీతంపేట, మార్చి 29 ప్రభాతవార్త : సీతంపేట టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జెండాను ఇన్‌చార్జ్ పడాల భూదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలు, చంద్రబాబు విజన్, లోకేష్‌బాబు నాయకత్వంతో ముందుకు సాగుతూ 44వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకం అన్నారు. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆలోచనలు, సిద్ధాంతాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని భూదేవి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శి బి.జయలక్ష్మి, మాజీ ఎంపీపీ సవర కుంపి, ఆజి జడ్పీటీసీ రాజబాబు, కూర్మారావు, సూర్యారావు, ఏఎంసి డైరెక్టర్ మోహనరావు, కొత్తకోట గోవిందరావు, దేవరశెట్టి కృష్ణ, పద్మనాభం, చంటి, సంతోష్, శ్రీనివాస్, దిలీప్, భాస్కరరావు, టిపిసి మెంబెర్ మలయ్య, విశ్వనాధం, సిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే తెలుగు వారికి ఆత్మగౌరవం : ఖండాపు



వీరఘట్టం, మార్చి 29 ప్రభాతవార్త: తెలుగువారి ఆత్మగౌరవం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగు రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖండాపు వెంకటరమణ మూర్తి అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కాలేజ్ జంక్షన్ ఆవరణలో జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో 1982 మార్చి 29వ తేదీన ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేడు 44 ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటుందని ఆయన అన్నారు. గ్రామ గ్రామాన ప్రతి కార్యకర్త ఇంటిపై పసుపు జెండా రెపరెపలాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాసుబిల్లి బుజ్జి, గేదెల గజేంద్ర నాయుడు పోరెడ్డి వెంకట నాయుడు, తాండ్రోతు అప్పలనాయుడు, పప్పల మహేష్, నీలం భాస్కరరావు, యాముక అప్పలనాయుడు, సాదు నారాయణరావు, గుడివాడ మహేష్, రౌతు శ్రీనివాసరావు, సీమల అన్నం నాయుడు, లక్ష్మణరావు, శశిభూషణరావు, ముఖలింగం, శ్రీహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళి మండలంలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సంతబొమ్మాళి, మార్చి 29, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంను మండలంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా తెదేపా నాయకులు ఆవిష్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రం సంతబొమ్మాళి బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ స్థాపించి 44 ఏళ్ళు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రపంచంలో తెలుగువారి సత్తా తెలిపిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఈ సందర్భంగా కొనియాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటీసీ సభ్యులు, యువ నాయకులు, బూత్ ఇన్‌చార్జులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కొత్తూరు మండలంలో...

కొత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త : మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మండల వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి, అనంతరం స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, కర్లెమ్మ నీటి సంఘం అధ్యక్షులు బోర శ్రీరాములు, కలమట తిరుపతి రావు, సీహెచ్ జ్ఞానేశ్వర రావుతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### కృష్ణాపురంలో..

రణస్థలం, మార్చి 29 ప్రభాతవార్త : మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో గొర్లేపేట గ్రామంలో ఆదివారం 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ ముల్లు కృష్ణ, ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నడుపూరు శ్రీను, హై స్కూల్ ఛైర్మన్ గంట్యాడ శ్రీను, దుంప అప్పలనాయుడు, కంబాపు గురుమూర్తి, ముల్లు రాములు, గొర్లె రామకృష్ణ, గంట్యాడ రమణ, గొర్లె రమణ, గంట్యాడ సత్యన్నారాయణ, గొర్లె సూర్యనారాయణ, మహంతి బంగారప్పాడు, కెల్లా చిన్నరమణ, సేనాపతి జగదీష్, మహిళలు యువకులు, తదితరులు పాల్గొన్నారు. జేఆర్ పురంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44 ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. కార్యక్రమంలో రణస్థలం మాజీ ఎంపీపీ, టీడీపీ విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు డీజీఎం ఆనందరావు, జేఆర్ పురం పంచాయతీ టీడీపీ అధ్యక్షులు దెయ్యం శ్రీనివాసరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, దమ్ము శ్రీనివాసరావు, గంగి హరి, తిప్పన రమణ, సతీష్ అప్పలరాజు, లక్ష్మణరావు, జేని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా టీడీపీ : పడాల భూదేవి

వీరఘట్టం మార్చి 29 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు, ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పాలకొండ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి అన్నారు. ఆదివారం పాలకొండలోని సీఎల్ నాయుడు కల్యాణమండపంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పాలకొండ మండల కన్వీనర్ గండి రామినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటగా పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ అన్న ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు విభాగం ఉపాధ్యక్షులు ఖండాపు వెంకటరమణ మూర్తి, అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు సీఎల్ నాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు, వీరఘట్టం అధ్యక్షులు సాసుబిల్లి బుజ్జి, టౌన్ మాజీ అధ్యక్షులు గుమ్మడి సింహాద్రి ఎఎంసి డైరెక్టర్‌లు రత్నకుమారి, కొప్పర సుభాషిణి, మోహనరావు అరకు పార్లమెంట్ కార్యదర్శి జయలక్ష్మి, మాజీ ఎంపీపీ కుంపి, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తూముల రమేష్, కొత్తకోట గోవిందరావు, పద్మనాభం, చంటి, సంతోష్, శ్రీనివాస్, దిలీప్, గేదెల గజేంద్రనాయుడు భాస్కరరావు, విశ్వనాథం, శాశపు సర్వారావు, సాధు నారాయణరావు, వీరఘట్టం టౌన్ అధ్యక్షులు పప్పల మహేష్, మజ్జి జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

### పాతపట్నం మండలంలో...



పాతపట్నం, మార్చి 29 ప్రభాతవార్త : తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీక, బడుగు బలహీన వర్గాల ఆశాదీపం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని, పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. తెదేపా పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గోవిందరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్ , బూత్ ఇన్‌చార్జులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# రైలు నడపాలని నా కల..



మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి పెరిగిందామె. చిన్నప్పటి నుంచి రైలు నడపాలని కలలు కనేది. ఎన్ని అడ్డంకులు వచ్చినా తన లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. అనుకున్నట్లే లోకో పైలట్ ఉద్యోగం తెచ్చుకుని రైలు నడుపుతోంది లక్ష్మి ౖ లక్రా. ఆమె ప్రయాణం తెలియాలంటే..

లక్ష్మి ౖ మది ఝార్ఖండ్లోని డేరాటోలి అనే చిన్న గ్రామం. నలుగురు పిల్లల్లో ఈమె మూడో సంతానం. మా ఆర్థిక పరిస్థితి అంతమాత్రమే అయినా మమ్మల్ని చదివించారు నాన్న. ఆయన రోజు కూలీ పనికి వెళితేనే మా కడుపు నిండేది. అంత కష్టంలోనూ 'మేం పస్తులున్నా పర్లేదు. మీరు మంచిగా చదువుకోండి' అనేవారు. ప్రాథమిక విద్యను స్థానికంగానే పూర్తి చేశా. లోకోపైలట్ అవ్వాలని ఐటీఐ డిప్లొమా పూర్తి చేశా. చిన్నప్పుడు రాంచీలోని అమ్మమ్మ ఇంటికి రైలులో వెళ్లేవాళ్లం. అప్పుడు రైళ్లు ఆవిరితో నడిచేవి. అది చాలా వింతగా అనిపించేది నాకు. ఆవిరి లోకోమోటివ్ స్థానంలో డీజిల్, కరెంటుతో నడిచే రైళ్లు వచ్చాయి. కానీ వాటిని చూసిన ప్రతిసారీ నాలో ఏదో తెలియని ఉత్సుకత.

**అవి ఎలా పనిచేస్తాయి?** నేనూ ట్రైన్ నడపొచ్చా? ఇలా బోలెడు సందేహాలు వచ్చేవి. అమ్మానాన్నలు, తెలిసినప్పుడు అది మగవాళ్లు చేసే ఉద్యోగం. నువ్వు చేయకూడదంటూ వారించారు. కానీ నేను పట్టు వదలలేదు. 2005లో ఆర్ఆర్బీ (రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్) పరీక్ష రాసి అసిస్టెంట్ లోకో పైలట్గా ఎంపికయ్యా. ఉత్తర రైల్వే జోన్లో మొదటి మహిళా లోకో పైలట్ని నేనే అంటారు లక్ష్మి ౖ. ఉద్యోగంలో చేరిన మొదటిరోజుల్లో గడ్డు పరిస్థితులే చూశాను. మహిళా సిబ్బందికి ప్రత్యేకించి బాత్రూమ్, గదులు ఉండేవి కాదు. దాంతో ఎక్కువసేపు ఇంజన్లోనే ఉండాల్సి వస్తుంది. తరవాత సరకు రవాణా చేసే గూడ్స్ రైళ్లను నడిపేదాన్ని. కనీస అవసరాలు లేక ఒక సమయంలో బాగా ఒత్తిడికి. కానీ తట్టుకుని నిలబడ్డ. 2016లో పాసింజర్ రైళ్లకి లోకోపైలట్గా పనిచేశా. ఈ ప్రయాణంలో నా కుటుంబం నాకు తోడుగా ఉంది. మహిళలు మనల్ని మనం ఎప్పుడూ తక్కువ చేసుకోకూడదు. కష్టపడి పనిచేస్తే లక్ష ్యం ఎంత దూరంలో ఉన్నా మన సొంతం అవుతుందిఖ అంటారు లక్ష్మి ౖ. ప్రస్తుతం లోకో పైలట్లకు, అసిస్టెంట్ పైలట్లకు వేగ నియంత్రణ, సిగ్నల్స్, భద్రత వంటి విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. ▫

## రోటి పచ్చళ్లే మేలు!

**పల్లీ చట్నీ, నువ్వుల చట్నీ, కొబ్బరి చట్నీ, కరివేపాకు చట్నీ, వివిధ రకాలకాయగూరలు ఆకుకూరలత చేసుకునేచట్నీలు. ఇలాఏదో ఒకన పచ్చడి లేనిదే మనభోజనం పూర్తి కాదు.** బయటహోటల్లో భోంచేసినప్పుడు కూడా ఏదో ఒక చట్నీ వడ్డించడం మనం చూస్తూనే ఉంటాం. మన ఆహారపుటల వాటిలో చట్నీకి ఉండే ప్రత్యేకత అలాంటిది! మరి, అలాంటి చట్నీని తయారుచేసుకోవడానికి మనం ఏం ఉపయోగిస్తాం..? మిక్సీ లేదంటే వెట్ గ్రైండర్ కదూ! సులభంగా, త్వరగా చట్నీ చేయడం పూర్తవుతుంది కాబట్టే అందరూ వీటి పైనే ఆధారపడుతుంటారు. కానీ అదే సమయంలోరోట్లో రుబ్బుకున్న పచ్చడి అందించే రుచిని ఇది అందించలేదని కూడా అంటుంటారు మన పెద్దవాళ్లు. మరి , మిక్సీలో రుబ్బుకున్న పచ్చడి కంటే రోట్లో చేసుకున్న పచ్చడికి ఎందుకంత రుచి వస్తుంది. దానివల్ల మన ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఇడ్లీ, దోసె, వడ, వంటి టిఫిన్స్లోకే కాదు.. భోజనంలోకీ వివిధ రకాల పచ్చళ్లను తినడం మనలో చాలామందికి అలవాటు! అయితే మిక్సీ, వెట్ గ్రైండర్ వంటి గ్యాడ్జెట్స్ వచ్చాక మనకు ఆ పని మరింత తేలికైంది. కానీ ఇలాంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో రుబ్బుకున్న పచ్చళ్లలో కంటే రోట్లో నూరుకున్న పచ్చడిలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయంటూన్నరు పోషకాహార నిపుణులు. ◌. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. తద్వారా శరీరంలోని కణాలు రక్తంలోని గ్లూకోజ్ను మరింత సమర్థంగా ఉపయోగించుకుంటాయి. ◌ థైరాయిడ్ సమస్యతో బాధపడే వారు విపరీతమైన అలసటకు గురవుతుంటారు.అలాంటి వారు రోజూ తప్పనిసరిగా చట్నీ తీసుకవోడం మంచిది. తద్వారా ఆ అలసటను దూరం చేసుకోవచ్చు. ◌ అజీర్తి వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి రోటి పచ్చళ్లు మంచి ప్రత్యామ్నాయం. ఎందుకంటే ఇవి పొట్టలో ఉండే బ్యాక్టీరియా సామర్థ్యాన్ని మెరుగుపరిచి జీర్ణ వ్యవస్థను పటిష్టం చేస్తాయి. ◌. 'డి'. బి12 వంటి విటమిన్ల లోపం ఉన్న వారు రోజూ తీసుకునే ఆహారంలో చట్నీని తప్పనిసరిగా భాగం చేసుకోవాలి. ◌ ప్రెగ్నెన్సీ కోసం ప్లాన్ చేసుకుంటున్న వారు, సంతాన సమస్యలతో బాధపడే వారు కూడా రోటి పచ్చళ్లను రోజూ తీసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుంది. ◌ గుండె ఆరోగ్యానికి కూడా రోటి పచ్చళ్లు చక్కగా ఉపయోగపడతాయి. ▫



## చిన్న సంస్థలకు గొంతుకగా!



**'రోజుకి కొన్ని వందల ఉత్పత్తులకు వచ్చినా... వాటిలో విజయం సాధించేవి కొన్నే. సరైన ప్రణాళిక లేక పోవడమే ఇందుకు కారణమంటారు తమన్నా గుప్తా. తన సంస్థ 'ఉమాని మార్కెటింగ్' ఈ సమస్య పరిష్కారానికి సహకరిస్తున్న ఈమె గురించి తెలియాలంటే...** ముంబయికి చెందిన తమన్నా స్థానికంగానే కామర్స్లో బ్యాచిలర్స్ పూర్తి చేశారు. తర్వాత ఐఐఎం బెంగళూరులో ఎంబీఏ పట్టా పొందారు. చదువైన వెంటనే ముంబయిలోని ఇండియన్ మార్కెట్ రీసర్చ్ బ్యూరో (ఐఎస్ఆర్బీ)లో ఫీల్డ్ రీసర్చర్గా ఉద్యోగం వచ్చింది. బ్రాండ్ల నిర్మాణం, వాటి ప్రచారం, వినియోగ దార్ల నుంచి అభిప్రాయ సేకరణ చుట్టే ఈమె ఉద్యోగం. మార్కె టింగ్ సర్వే యర్గానూ పనిచేశారీమె. అప్పుడే క్షేత్రస్థాయి పరిస్థితుల మీద పూర్తి అవగాహన ఏర్పడింది. 'నిజానికి ఒక ఉత్పత్తి మార్కెట్లో నిలబడటం అంత కష్టమేమీ కాదు. అయితే దానికోసం క్షేత్రస్థాయి పరిస్థితుల మీద పూర్తి అవగాహన అవసరం. మార్కెట్ పోటీ, వినియోగదార్ల అవసరాల మీద ఎక్కువగా దృష్టి పెట్టాలి. కానీ, ఈ అంశాల మీద ఇప్పటికే చిన్నచూపే. పైగా, ధనిక వర్గాలే లక్ష ్యంగా ఉత్పత్తులను తీసుకొచ్చే వాళ్లూ ఉన్నారు. ప్రొడక్ట్ ఏ చిన్న లోపం ఉన్నా వారు వేరేవి కొనుగోలు చేయడానికి వెనకా డటం లేదు. దాంతో అమ్మకాలు ఒక్క సారిగా పడిపోయి, కంపెనీలు దివాళా తీస్తున్నా యంటారు తమన్నా. దీనికి పరిష్కారంగా మధ్య వర్తిత్వం కారణంగా చాలానే మార్కెటింగ్ కంపెనీలు వచ్చాయి.కానీ, అవన్నీ చిన్న, మధ్యతరహా అంకుర సంస్థలకు అందుబాటులో లేవు. ఆ లోటును పూరించడానికే ఉమాని మార్కెటింగ్ను ప్రారంభించాలనుకున్నారీమె.

**అనతి కాలంలోనే..** ఈ రంగంలో పదిహేనేళ్ల అనుభవం... దిగ్గజ సంస్థలతో పనిచేసిన నేపథ్యం ఉన్నా.. తన నైపుణ్యాలకి పదును పెట్టాలనుకున్నారు తమన్నా. అందుకే ఐఐఎంలో ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్లో చేరారు. అక్కడే తన ఆశయానికి మరింత బలం చేకూరుతుందని చెబుతా రీమె. కార్యక్రమం అనంతరం ఎమిజా కమిటీ అమ్మకాలకు నాయకత్వం వహించే బాధ్యతలు తీసుకున్నారు. 6 నెలల్లోనే పానసోనిక్, సింగర్, బజాజ్ వంటి సంస్థల మార్కెటింగ్లో తనదైన పాత్రను పోషించారు. ఈ రంగంలో రాణించగలను, స్వతహాగా క్లయింట్లను సంపాదించుకోగలనన్న నమ్మకం వచ్చాక ఉద్యోగానికి రాజీనామా చేశా. 2018లో ఉమాన్ని మార్కెటింగ్ ప్రారంభించ బడింది. ఐఐఎం పూర్వవిద్యార్థుల నెట్వర్క్ను ఉపయోగించుకుని... బలమైన మెంటార్ వ్యవస్థను ఏర్పరచుకున్నా. ముగ్గురు వినియోగదార్లతో డిజిటల్ మార్కెటింగ్లో నా ప్రయాణం అనిచేసుకుంటారు తమన్నా. అనతికాలంలోనే బ్రాండింగ్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారికంగా ఆవిర్భవించింది. మన దేశంలో పాత, వెనకబడ్డ బ్రాండ్లకు గొంతుగా మారి మార్కె టింగ్ వ్యూహాలను రూపొందించడంలో విజయవంత మైంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు,స్టార్టప్లకు దన్నుగా మారింది. ప్రచారం వరకు పరిమితం కాలేదు. ▫

## శ్రీ రామ రక్ష

ప్రతివారు ఉచ్చరించే పదం ఇది ఆపదలలో ఉన్నప్పుడు కష్టకాల సమయాలలో దేవుడు గుర్తుకు వస్తాడు. రామ, రామ, శ్రీరామ అనే పదాలు మనం నిత్యం ఎప్పుడైనా సరే పలుకుతూ ఉంటేమనసు ప్రశాంతంగా ఉంటుంది. మన కష్టాలు, బాధలు తొలగించేది శ్రీరాముడే. ప్రతి వారికి ఆరాధ్యుడు ఆయన. శ్రీరాముని చిత్రపటం ప్రతి గృహంలో ఉండాలి. మన తెలుగు రాష్ట్రాలలో పట్టణాలలో, ముఖ్యంగా గ్రామాలలో శ్రీరాముని కోవెల ఉంటుంది తెలుగు వారికి ప్రీతికరమైన దేవుడు శ్రీరాముడు ఇప్పటికీ మనం ఏదయినా శుభాకార్యం కావలసిన పట్టిక రాసేటప్పుడు, ఎవరికైనా ఆహ్వానం అందించాలి అనుకున్నప్పుడు తెల్ల కాగితంపై 'శ్రీరామ' అని కాని శ్రీరామ జయం అని కాని రాస్తువుంటాం. అంటే శ్రీరావునిపై అంత నమ్మకం, విశ్వాసం మనకు ఉందన్న మాట. పెళ్లి శుభలేఖలపై కూడా సీతారాములవారి ఫోటో చాలా మంది ముద్రిస్తూవుంటారు. కొంతమంది ఏకంగా పెళ్లి మంటపంపై శ్రీ సీతారామ కళ్యాణం చిత్రాన్ని ఉంచుతారు. అంటే దంపతుల వివాహానికి వారు సాక్షులు అన్న మాట. నూతన దంపతులకు ఆ శ్రీరాముడే రక్ష. ఎవరిని మనం మోసం చేసినా ఆ దైవాన్ని మోసం చేయలేం కదా. శ్రీరాముడు ఆడిన మాట తప్పలేదు. తల్లులకు తన తండ్రి దశరథ మహారాజుకు అత్యంత ప్రియమైనవాడు ఇక సోదరులకు ఇష్టమైన వాడు. హనుమంతుడు అంటే చెప్పలేని ఆనందం కలుగుతుంది. ప్రతిసారి హనుమాన్ను ఆలింగనం చేసుకునేవాడు. దానికి హనుమంతుడు పలికిన పదం మీరు మాకు శ్రీరామ రక్ష అన్న మాట ఈ రోజు ప్రసిద్ధమైంది. సకల జనావళికి శ్రీరామరక్ష. ఆ జగదభి రాముడే. ▫



## కొబ్బరి నూనె కాదు.. నీళ్లు !



కొబ్బరినీళ్లు చెమట, వేడి కారణంగా నిర్జీవమైన మాడు, కురులకు తేమను అందిస్తాయి. వీటిలోని కె. సి విటమిన్లు, మినరల్స్ కుదుళ్లకు పోషణను అందించడం, జుట్టు పెరగడంలో సాయపడతాయి. చిట్లడాన్నే కాదు దురద, దద్దుర్లు, చుండ్రు వంటివాటినీ తగ్గిస్తాయి. ఎలా ఉపయోగించాలంటే... షాంపూ చేశాక కొన్ని కొబ్బరినీళ్లను మాడు నుంచి కురుల వరకూ పట్టించాలి. పది నిమిషాలయ్యాక నీటితో కడిగేస్తే మంచి కండియర్లా పనిచేస్తుంది. అరకప్పు పెరుగు లేదా రెండు పండు అరటికాయల గుజ్జుకు రెండు స్పూన్ల కొబ్బరి నీళ్లను కలపండి దీన్ని మాడుకు పట్టించి, పావుగంటయ్యాక మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే సరి. మంచి హెయిర్ మాస్క్ లా పనిచేస్తుంది. సమానపాళ్లలో నీళ్లు, కొబ్బరినీళ్లు తీసుకుని బాటిల్లో పోసుకోవాలి. దీన్ని మాడుకి స్ప్రే చేయండి. జుట్టు నిగనిగ లాడుతూ కనిపించడమే. కాదు, చిక్కులు విడిపోవడంలోనూ సాయపడుతుందట. తలస్నానానికి ముందు కొబ్బరినూనెకు కొబ్బరి నీళ్లు చేర్చి మాడుకి పట్టించండి. కురులకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. వీలుని బట్టి, ప్రయత్నించి చూడండి. ▫

## పాలిచ్చే తల్లులూ ఇవి తినండి !



మాతృత్వం ప్రతి మహిళకూ ఓ గొప్పవరం. తల్లిపాలు... పిల్లలకు అమృతం, కానీ, చాలామంది అమ్మలకు అవి సరిపడినంతగా ఉండకపోవచ్చు. ప్రసవమయ్యాక పథ్యం పేరుతో పోషకాలను తీసుకోకుండా ఉంటే..పిల్లలకు అందవు. అందుకే, సమతులాహారాన్ని ఎంచుకోవాలి. పాలు పడటానికీ, పోషకాలు అందడానికీ కీలకమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. ముఖ్యంగా పాలకూరలో ఎక్కువ మోతాదులో ఐరన్ దొరుకుతుంది. దీన్ని ఉడికించి తినడం మంచిది. లాక్టేషన్కి సాయపడే వాటిల్లో క్యారెట్ ఒకటి. మొత్తం ఎక్కువ మొత్తంలో లభించే విటమిన్ ఎ పాపాయి ఎదుగుదలలోనూ కీలంగా పనిచేస్తుంది. సొరకాయ, బీరకాయ వంటివాటిల్లో 9095 శాతం నీరు ఉంటుంది. ఇవి సహజంగా తేమనందించే ఆహారం. పాలు పడటానికి శరీరంలో నీటి స్థాయి కూడా చాలా కీలకం. నీరు తక్కువగా ఉంటే పాల ఉత్పత్తి తగ్గుతుంది. బీరకాయ, సొరకాయ మద్యం తినడం వల్ల నీటితో పాటు ఎలక్ట్రోస్ కూడా లభిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పైగా వీటిల్లో తక్కువ కెలోరీలు ఉంటాయి. బరువు నియంత్రణలో సాయపడతాయి. ఎ, సి విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి మినరళ్లు కూడా తగినంతగా లభించడం వల్ల రోగనిరోధకత మెరుగుపడుతుంది. వీటితోపాటు చిలగడదుంపలు, గుమ్మడి, టొమాటోలు, తృణధాన్యాలు, ఓట్స్, వెల్లుల్లి, పచ్చిబొప్పాయి వంటివీ మేలు చేస్తాయట. ▫

## గూగుల్ మై ఫ్రెండ్ మూవీ సాంగ్స్ లాంచ్



ప్రణవ్ రావ్ రాణి, ప్రజక్త గైక్వాడ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "గూగుల్ మై ఫ్రెండ్". ఈ చిత్రాన్ని డాలర్స్ మీడియా అండ్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దివాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. బహు భాషల్లో పలు హిట్ చిత్రాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న గోవింద్ వరాహ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. "గూగుల్ మై ఫ్రెండ్" సినిమాకు టి. వెంకటేష్ రెడ్డి, బి.ప్రసన్నాంజనేయులు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, మరాఠీ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, సాయి రాజేశ్, వి సముద్ర, శైలేష్ కొలను, కొండా విజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ చిత్ర సాంగ్స్ లాంఛ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సాయిరాజేశ్ మాట్లాడుతూ మా దర్శకుల సంఘం సభ్యులు, మా ఆత్మీయులు గోవింద్ డైరెక్ట్ చేస్తున్న గూగుల్ మై ఫ్రెండ్ మూవీ సాంగ్స్, టీజర్ ఇతర కంటెంట్ చూశాం. ఈ కంటెంట్ అంతా ప్రామిసింగ్ గా ఉంది. ఒకేసారి తెలుగు, మరాఠీ భాషల్లో ఆయన ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

## సుయోధన సక్సెస్ మీట్



ప్రజ్వాలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలక పాత్రల్లో నటించిన చిత్రం సుయోధన. వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం (ఈ నెల 27న) ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ను హైదరాబాద్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ సుయోధన చిత్రంతో మొదటి ప్రయత్నంలోనే మా చిత్రానికి మంచి విజయాన్ని అందించారు. మా నెక్స్ట్ మూవీకి ఇంతకంటే పెద్ద బ్లాక్ బస్టర్ కొట్టాలని అనుకుంటున్నాం. ప్రస్తుతం అన్ని ఏరియాల నుంచి రెస్పాన్స్ బాగుంది. ఈ సినిమా చేసిన అనుభవంతో నెక్స్ట్ మరో మంచి చిత్రంతో మీ ముందుకు వస్తాం. అయితే ఈ సారి ఏదైనా పేరున్న సంస్థతో భాగస్వామ్యం అయి సినిమా నిర్మించాలని అనుకుంటున్నాం. ఎంతో కొంత అనుభవం, అవగాహన తెచ్చుకున్న తర్వాత చిత్ర పరిశ్రమలోకి రావాలని కొత్త నిర్మాతలకు నా సలహా. త్వరలోనే మంచి సబ్జెక్ట్ చూసుకుని కొత్త మూవీ అనౌన్స్ చేస్తాం. ఈ సారి మా సంస్థలో రాబోయే సినిమా పక్కా ప్లానింగ్తో ఉంటుంది. అన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ చిన్న సినిమాలను ప్రేక్షకులకు చేర్చడంలో మా మీడియా మిత్రులు ముందుంటారు. సుయోధన చిత్రాన్ని కూడా వారే ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి, సాయికుమార్ పోటాపోటీగా నటించారు. మా డైరెక్టర్ మాధవ్ సినిమా చేసిన విధానం చూస్తుంటే అనుభవం ఉన్న దర్శకుడిలా రూపొందించారు. ప్రతి ఫ్రేమ్ చాలా బాగుంది. అన్నారు. డైరెక్టర్ వైఎస్ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ సుయోధన మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రతి షోకు స్క్రీన్స్ పెరుగుతున్నాయి. ఓవర్సీస్లోనూ మంచి రెస్పాన్స్ వస్తోంది. అక్కడి నుంచి మిత్రులు మూవీ చాలా బాగుందంటూ ఫోన్స్ చేస్తున్నారు అని అన్నారు.

## తెర

## బైకర్ కోసం శర్వా 23 కేజీలు తగ్గారు: డైరెక్టర్ అభిలాష్ రెడ్డి

శర్వానంద్, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్పై రూపొందిన రేసింగ్ డ్రామా బైకర్తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న సినిమా గ్లింప్స్లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి. ఏప్రిల్ 3న థియేటర్లలో గ్రాండ్గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు...

**బైకర్ ఆడియన్స్కు ఎలాంటి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది?**

బైకర్ 100 థియేటర్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా. డాల్బీ విజన్లో కూడా షూట్ చేశాం. ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమా సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. సినిమా థియేటర్లో చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

**ఈ కథ రాయడానికి ఇన్స్పిరేషన్?**

బైక్ అనేది అందరికీ ఒక ఎమోషన్. ఇందులో రేసింగ్ తో పాటు చాలా మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. ఫాదర్ సన్ మధ్య ఉండే ఎమోషన్ కనెక్ట్ అవుతుంది.

**షూటింగ్లో మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?**

ఈ సినిమాలో రేసింగ్ సీక్వెన్స్లను రియల్ రేసర్స్తో షూట్ చేశాం. షూట్ చేసినప్పుడు చాలా యాక్సిడెంట్లు జరిగాయి. కేవలం యాక్షన్కే 60 రోజులకు పైగా పట్టింది. ఈ సినిమా రెండు టైమ్లైన్స్లో జరుగుతుంది. 90స్లో టూ స్ట్రోక్ బైక్స్ ఉండేవి, అవి ఇప్పుడు లేవు. వాటిని డిజైన్ చేయడానికి చాలా టైం పట్టింది. ఇందులో రేసింగ్ ఇండోనేషియాలో షూట్ చేశాం. ఆ బైక్స్ అన్నీ మళ్లీ ఇండియాకు తీసుకురావడం కూడా చాలా పెద్ద ప్రాసెస్. అలాగే ఈ సినిమా కోసం న్యూజీలాండ్, ఆస్ట్రేలియా నుంచి రేసర్స్ని రప్పించాము.

**ఇండియాలో ఈ స్పోర్ట్స్ ఉందా?**

ఉంది. కానీ రావాల్సిన పాపులరిటీ రాలేదు. ఇందులో రాజశేఖర్ క్యారెక్టర్తో ఇదే అంశాన్ని ప్రెజెంట్ చేస్తున్నాం. ఇండియాలో శ్యామ్ కొఠారి అనే వెటరన్ రేసర్ ఉన్నారు. కానీ ఆయనకి క్రికెట్లో కపిల్ దేవ్కి వచ్చినంత గుర్తింపు రేసింగ్లో రాలేదు. ఈ రేసింగ్ స్పోర్ట్ మనకి ఎప్పటినుంచో ఉంది, కాకపోతే ఇందులో కొంచెం రిస్క్ ఎక్కువ. ఇది ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ రేసింగ్ విషయంలో కొన్ని ట్రూ ఇన్సిడెంట్స్ను ఇన్స్పిరేషన్గా తీసుకున్నాం. రాజశేఖర్ కోచ్ అలాగే ఫాదర్ క్యారెక్టర్లో కనిపిస్తారు. ఆయన చుట్టూ ఒక కథ తిరుగుతుంది.

**ఎఫ్ వన్ చూసిన ఆడియన్స్కి ఈ సినిమా ఎలాంటి కొత్తదనం ఇస్తుంది?**

ఎఫ్ వన్ సినిమా రిలీజ్ అయినప్పటికీ నా సినిమా పూర్తి అయిపోయి పోస్ట్ ప్రొడక్షన్లో ఉంది. ఎమోషన్, డ్రామా పరంగా రెండు చాలా డిఫరెంట్ సినిమాలు.

**ఇలాంటి సినిమాలు తీయాలంటే నిర్మాతల సపోర్ట్ చాలా ఉండాలి కదా?**

యూవీ క్రియేషన్స్లో చేసిన ప్రతి సినిమా విజువల్గా, టెక్నికల్గా చాలా గ్రాండ్గా ఉంటుంది. కథ నచ్చితే ఆ కథ కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు చేస్తారు. ఇండోనేషియాలో ఈ సినిమా క్లైమాక్స్ను షూట్ చేశాం. అక్కడ రేసింగ్ షూట్ చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇంటర్నేషనల్ అసోసియేషన్స్ వాళ్లే అక్కడ వద్దన్నారు. అలాంటి లోకేషన్లో మేము సెట్ వేసి మరీ చేశాం. ఎందుకంటే ఈ కథకి అలాంటి ప్రాంతం కావాలి.

**క్యారెక్టర్ విషయంలో శర్వా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఈ సినిమా కోసం ఆయన 23 కేజీలు తగ్గారు. కథ చెప్పినప్పుడే బైకర్ క్యారెక్టర్ ఇలా ఉండాలి అని మేము ఫిక్స్ అయ్యాము. ఆయన ఈ సినిమా కోసం దాదాపు 6 నెలలు బ్రేక్ తీసుకుని ఫిజికల్గా, మెంటల్గా ప్రిపేర్ అయ్యారు. సినిమాపై ఆయనకున్న నమ్మకంతోనే ఖచ్చితంగా బ్లాక్బస్టర్ కొడుతున్నాం అని చెప్పారు.

**బైకర్లో మీరు అచీవ్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?**

ఈ స్పోర్ట్ను షూట్ చేయడమే చాలా టఫ్. ఆ స్పోర్ట్ని స్క్రీన్పైకి తీసుకురావడం చాలా ఆనందంగా అనిపించింది. అలాగే ఈ సినిమాలో చాలా మంచి ఫ్యామిలీ డ్రామా ఉంది. నిర్మాతలు ఫస్ట్ కాపీ చూసి చాలా హ్యాపీగా ఫీల్ అయ్యారు. అందరం సినిమా మీద చాలా కాన్ఫిడెంట్గా ఉన్నాం.

**ట్రైలర్ చూశాక ప్రభాస్ గారి రియాక్షన్ ఏమిటి?**

ప్రభాస్ వంశీతో ట్రైలర్ అద్భుతంగా ఉందని చెప్పారు. ఆయన మా సినిమా కోసం ట్వీట్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది.

**ఇందులో మీ రియల్ లైఫ్ ఇన్స్పిరేషన్స్ ఏమైనా ఉన్నాయా?**

నాకు మిడిల్ క్లాస్ ఎమోషన్స్ అంటే ఇష్టం. నేను ఏం చేసినా కూడా ఆ మిడిల్ క్లాస్ ఎమోషన్లే షూట్ చేయగలను.

**దిల్ రాజు ఈ సినిమా చూసిన తర్వాత మీకు ఏం చెప్పారు?**

దిల్ రాజుకి ఈ సినిమా చాలా నచ్చింది. చాలా చక్కగా తీశానని చెప్పారు. నా నెక్స్ట్ సినిమా కూడా ఆయనతోనే చేస్తున్నాను.



## మహాకాళి అక్షయ్ ఖన్నా చివరి షెడ్యూల్ ప్రారంభం

అక్షయ్ ఖన్నా పుట్టినరోజు సందర్భంగా, దర్శకుడు ప్రశాంత్ వర్మ ఖిమహాకాళిఖి సెట్స్ నుంచి ఒక కొత్త స్టిల్ను విడుదల చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చాప్టర్ గురించి ఒక ఎక్సైటింగ్ అప్డేట్ను ఇచ్చారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్పై ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రశాంత్ వర్మ షోరన్నర్గా వ్యవహరిస్తుండగా, పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పౌరాణిక చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది. చిత్ర బృందం 100 రోజుల షూటింగ్ను విజయవంతంగా పూర్తి చేయగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్లో ప్రారంభమైంది. శుక్రాచార్యుడి కీలక పాత్ర కోసం అక్షయ్ ఖన్నా తన చిత్రీకరణను పూర్తి చేశారు. నిర్మాతలు త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. మల్టీ స్టూడియోల వీఎఫ్ఎక్స్ పనులు శర వేగంతో సాగుతున్నాయి.



## డాన్ బాస్కో ఫస్ట్లుక్ రిలీజ్



ఎమర్జింగ్ ప్రొడక్షన్ హౌస్ రాధా కృష్ణ ఎంటర్టైన్మెంట్స్, విదేశాల్లో అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో బ్లాక్బస్టర్ సినిమాలను విజయవంతంగా డిస్ట్రిబ్యూట్ చేసి తనదైన గుర్తింపు తెచ్చుకున్న సంస్థ రాధాకృష్ణ ప్రొడక్షన్ హౌస్ ఇప్పుడు కామెడీ ఎంటర్టైనర్"డాన్ బోస్కో సినిమాను రూపొందిస్తోంది. వెంకట్ ఉప్పుటూరి నిర్మాత. యంగ్ హీరో రుష్య దత్త ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నా రు. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకంది. జైలర్, నా సామి రంగ సినిమాలతో గుర్తింపు పొందిన అందాల నటి మిర్నా మీనన్ ఇందులో హీరోయిన్గా నటిస్తోంది. శనివారం మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్తో పాటు ఒక ముఖ్యమైన అప్డేట్ను విడుదల చేశారు. పోస్టర్లో రుష్య దత్త చాలా స్టైలిష్గా కనిపిస్తూ, ఒక చేతిలో కటానా లాంటి కత్తిని పట్టుకుని, మరో చేతితో కాలర్ను పైకెత్తుతూ బోల్డ్ పోజ్లో కనిపిస్తున్నారు ఫస్ట్ లుక్ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతి రీయూనియన్ జ్ఞాపకాల కోసమే కాదు.. కొన్ని విముక్తి (రిడెంప్షన్) కోసం కూడా ఉంటాయి అనే క్యాప్షన్ మరింత ఎగ్జైట్మెంట్ను క్రియేట్ చేస్తున్నాయి. ఇందులో మురళీ శర్మ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాత్రలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మిర్నా మీనన్ లెక్చరర్ సుమతి పాత్రలో కనిపించనుంది. మోనిక, రాజ్కుమార్ కాసిరెడ్డి, విష్ణు ఓయ్ తదిత రులు కూడా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కచ్చితంగా ఈ మూవీ మంచి ఎంటర్టైనర్గా మెప్పించనుందనే హామీ కలుగుతోంది.

30-3pg10exHMNWJQEBV.qxd:30-3pg10exHMNWJQEBV.qxd 1/1/02 6:28 AM Page 1



# ఛేజింగ్‌లో చెలరేగిన రోహిత్, రికల్టన్

*ఛేజింగ్‌లో రోకో అదరగొడుతోంది. ఐపీఎల్ తొలి రోజు విరాట్ కోహ్లీ చెలరేగి ఆడితే... రెండో రోజు కోల్‌కతా నైట్ రైడర్స్‌పై రోహిత్ శర్మ పూనకం వచ్చినట్లే బ్యాట్‌తో ఊగిపోయాడు. రికల్టన్ కూడా తోడవడంతో 221 పరుగుల లక్ష్యం కూడా వీరి ముందు చిన్నబోయింది. 148 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్‌తో కేకేఆర్ బౌలర్లను కుమ్మేశారు. దీంతో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో గ్రాండ్‌గా బోణీ చేసింది.*

## ముంబై బోణీ




**ముంబై:** వాంఖడే వేదికగా జరిగిన ఐపీఎల్ రెండో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ దుమ్మురేపింది. సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని మరో5బంతులు మిగిలి ఉండగానే 4వికెట్లు కోల్పోయి అందుకుంది. ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ(38 బంతుల్లో 78), రికల్టన్(43 బంతుల్లో 81) చెలరేగి ఆడారు. ఇద్దరూ సిక్స్‌ల వర్షం కురిపించారు. రోహిత్ శర్మ 6 సిక్స్‌లు, రియల్టన్8 సిక్స్‌లు మొత్తం 14 సిక్స్‌లు బాదారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో మూడు సిక్స్‌లు, మూడో ఓవర్లో 2 సిక్స్‌లు, వరుణ్ ఓవర్లో 4,6,4, కార్తిక్ ఓవర్లో 2 సిక్స్‌లు... ఇలా పవర్ ప్లేలోనే 80 రన్స్ చేశారు. 12 ఓవర్లోనే 148 రన్స్ అందించారు.

కేకేఆర్‌తో మ్యాచ్ అంటేనే పూనకం వచ్చినట్లు ఊగిపోయే హిట్‌మ్యాన్, మరోసారి అదే తరహా ప్రదర్శనతో రెచ్చిపోయి ఐపీఎల్ చరిత్రలో ఈ ఫ్రాంచైజీపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (1093 పరుగులు) పేరిట ఉండేది. ఈ మ్యాచ్‌లో రోహిత్ కేవలం 23 బంతుల హాఫ్ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో ఇదే రోహిత్‌కు ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ, అంతకుముందు 2015 ఎడిషన్‌లో సీఎస్‌కేపై 25 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఈ హాఫ్ సెంచరీతో రోహిత్ ఐపీఎల్‌లో మరో మైలురాయి అందుకున్నాడు. ఈ హాఫ్ సెంచరీ రోహిత్‌కు ఐపీఎల్‌లో 50వది.

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. అజింక్యా రహానే కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేకేఆర్‌కు మెరుపు ఆరంభాన్ని అందించాడు. కేవలం 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతను.. మొత్తంగా 40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు సాధించాడు. రహానేకు జతగా మరో ఓపెనర్ ఫిన్ అలెన్ కూడా చెలరేగిపోయాడు. కేవలం 17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు చేశాడు. తొలి వికెట్‌కు 69 రన్స్ అందించారు. అలెన్ ఔటయ్యాక వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన గ్రీన్.. 10 బంతుల్లో బౌండరీ, సిక్సర్ సాయంతో 18 పరుగులు చేసి ఔటయ్యాడు.

గ్రీన్ ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన రఘువంశీ ఆరంభంలో కాస్త నిదానంగా ఆడినా, ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. 29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేసి ఔటయ్యాడు. రఘువంశీ మెరుపుల కారణంగానే కేకేఆర్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. వైస్ కెప్టెన్ రింకూ కూడా 21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ మూడు వికెట్లు, హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.








# చెన్నై, రాజస్థాన్‌లో బోణీ ఎవరిదో?

**గౌహతి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు మరో ఆసక్తికర పోరు జరగనుంది. గౌహతి వేదికగా అయిదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ... రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఇరు జట్లలోనే హార్డ్ హిట్టర్లు ఉండడంతో ఈ మ్యాచ్ లోనూ పరుగుల వరద ఖాయం.

గత సీజన్‌లో ఈ రెండు జట్లు కూడా పేలవ ప్రదర్శనతో లీగ్ స్టేజ్ లోనే నిష్క్రమించాయి. ఈసారి భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నాయి. ఎంఎస్ ధోనీ గాయం సీఎస్‌కేకు లోటుగా మారిగా, సంజూ శాంమ్సన్ చెన్నై జట్టులోకి రావడం అనుకూలంగా మారింది. టీ ట్వంటీ ప్రపంచకప్ నాకౌట్ స్టేజ్‌లో దుమ్మురేపి టీమిండియాకు కప్ అందించిన సంజూ శాంమ్సన్... అదే ఊపును ఐపీఎల్‌లోనూ కొనసాగించడంపై దృష్టి సారించాడు. చెన్నై ఈసారి యువ ఆటగాళ్లపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగా, శివమ్ దూబేతో పాటు ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మలు మ్యాచ్ ఫినిషర్లుగా ఉన్నారు. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంకు తోడు సంజు శాంమ్సన్ బహుముఖ ప్రజ్ఞ జట్టుకు సమతుల్యతను చేకూరుస్తాయి. అయితే, పిక్క కండరాల గాయం కారణంగా జట్టుకు దూరమైన ఎం.ఎస్. ధోనీ లేకుండానే ఈ మ్యాచ్ జరగనుంది ఇది జట్టుకు ఆరంభంలోనే ఎదురైన ఒక ఎదురు దెబ్బ. బౌలింగ్‌లోనూ చెన్నై పటిష్టంగా ఉంది.

రాజస్థాన్ జట్టు ఓపెనింగ్ జోడీ రాణిస్తే దానికి తిరుగుండదు. యశస్వి జైస్వాల్‌తో కలిసి యంగ్ డైనమైట్ వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్ ఓపెన్ చేస్తారు. వీరిద్దరు ఫ్లయింగ్ స్టార్ట్ ఇస్తే భారీ స్కోరు ఖాయం. గత సీజన్‌లో ఇబ్బందిపడిన మిడిల్‌ఆర్డర్‌లో ఇప్పుడు రవీంద్ర జడేజా రాకతో బలోపేతమైంది. దీనికి తోడు షిమ్రాన్ హెట్మైర్, ధ్రువ్ జురెల్ రాణించాల్సి ఉంటుంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్‌తో పాటు అనుభవజ్ఞుడైన సందీప్ శర్మ రూపంలో పేస్ అటాక్ ఉంది. రవి బిష్ణోయ్ చేరిక స్పిన్ బౌలింగ్ విభాగానికి వైవిధ్యాన్ని చేకూర్చింది. రెండు జట్లు తలపడినపుడు చెన్నై పైచేయిగా ఉంది.

**రెండు జట్ల వివరాలు**

**రాజస్థాన్ రాయల్స్ తుది జట్టు(అంచనా):** యశస్వి జైశ్వాల్, వైభవ్ సూర్యవంశీ, ప్రిటోరియస్, రియాన్ పరాగ్(కెప్టెన్), షిమ్రాన్ హెట్మైర్, రవీంద్ర జడేజా, ధృవ్ జురెల్, జోఫ్రా అర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, నండ్రె బర్గర్. **ఇంఫాక్ట్ ప్లేయర్:** శుభమ్ దూబే/తుషార్ దేశ్‌పాండే

**చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** ఆయుష్ మాత్రే, సంజూ శాంమ్సన్, రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), డీవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే, కార్తిక్‌శర్మ, ప్రశాంత్ వీర్, రాహుల్ చాహర్, నూర్ ఆహ్మద్, ఖలీల్ ఆహ్మద్, మాట్ హెన్రీ **ఇంఫాక్ట్ ప్లేయర్:** జేమీ ఓవర్టన్

## పోలీస్ ఫుట్‌బాల్‌లో తెలంగాణకు రెండో ఓటమి

**హైదరాబాద్, మార్చి 29(వార్త క్రీడా ప్రతినిధి):** హైదరాబాద్ అతిథ్యమిస్తున్న అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టు వరుసగా రెండో ఓటమి పొందింది. గ్రూప్-ఎఫ్‌లో పోటీపడుతున్న తెలంగాణ... రెండో మ్యాచ్‌లో 0-3 గోల్స్‌తో రాజస్థాన్ చేతిలో ఓడింది. పూర్తి సమయంలో గోల్ చేయడంలో తెలంగాణ విఫలమైంది. మరోవైపు చక్కని పాసింగ్‌లతో రాజస్థాన్... తెలంగాణ డిఫెన్స్‌ను చేధిస్తూ మూడు గోల్స్ సాధించింది. మరో మ్యాచ్‌లో అస్సాం రైఫిల్స్ 5-0 గోల్స్ తేడాతో చండీఘర్‌పై విజయం సాధించి గ్రూప్-ఎఫ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. కాగా మహిళల గ్రూప్‌ఎలో ఎస్ఎస్‌బి గోల్స్ వర్షం కురిపించింది. ఏకంగా 16-0 గోల్స్‌తో జార్ఖండ్‌పై గెలుపొందింది. మరోమ్యాచ్‌లో సిఐఎస్ఎఫ్ ఏకైక గోల్‌తో సీఆర్‌పిఎఫ్‌పై విజయం సాధించింది. ఏప్రిల్ 5 వరకు జరగనున్న అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ మ్యాచ్‌లు.. గచ్చిబౌలీలోని జీఎంసీ స్టేడియంతో పాటు ఆర్టిలరీ గోల్కొండ, శ్రీనిధి, అజీజ్‌నగర్ గ్రౌండ్‌లో జరుగుతున్నాయి.


పోలీస్ ఫుట్‌బాల్ గ్రూప్-ఎఫ్‌లో పోటీపడుతున్న తెలంగాణ, రాజస్థాన్ జట్లు



## కిమి అంటోనెల్లి రికార్డ్ విన్

### వరుసగా రెండో గ్రాండ్ ప్రి ఫార్ములా వన్ కైవసం

**సుజుకా(జపాన్):** 19ఏళ్ల ఇటాలియన్ ఫార్ములా వన్ డ్రైవర్ కిమి అంటోనెల్లి... జపాన్ గ్రాండ్ ప్రి గెలుపొందాడు. రెండు వారాల్లో మెర్సిడెస్‌కు డ్రైవన్‌కు ఇది రెండో గ్రాండ్ ప్రి విజయం. బ్యాక్ టు బ్యాక్ విజయాలతో ప్రపంచ ఛాంపియన్ షిప్ రేసులో టాప్ పొజిషన్‌లోకి దూసుకెళ్లాడు. ఫార్ములా వన్ చరిత్రలో ప్రపంచ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు.

కిమి అంటోనెల్లి పోల్ పొజిషన్‌తో జపాన్ గ్రాండ్ ప్రి ఫైనల్ రేసును ప్రారంభించాడు. పేలవమైన ఆరంభంతో వెనకబడ్డాడు, రేసు మధ్యలో వచ్చిన సెఫ్టీ కార్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంటోనెల్లి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. చివరి ల్యాప్‌లలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి, ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్లెర్క్‌లను వెనక్కి నెట్టాడు. 45 సెకన్ల స్వల్ప తేడాతో అగ్రస్థానంతో రేసు పూర్తి చేసి విజేతగా ఆవిర్భవించాడు. రెండు వారాల కిందట చైనా గ్రాండ్ ప్రి నెగ్గి సంచలనం సృష్టించిన కిమి అంటోనెల్లి... వరుసగా రెండో ఫార్ములా వన్ టైటిల్ అందుకున్నాడు. గత నాలుగేళ్లుగా జపాన్ గ్రాండ్ ప్రిలో విజయం సాధిస్తున్న రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్... 11వ స్థానం నుండి రేసు ప్రారంభించి ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఫినిషింగ్ లైన్ దాటగానే కిమి అంటోనెల్లి సంబరాల్లో మునిగిపోయాడు.

ఈ రోజు తన వేగం అద్భుతంగా ఉందని రేసు ముగిసిన తర్వాత కిమి అంటోనెల్లి సంతోషం వ్యక్తం చేశాడు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బహ్రెయిన్, సౌదీ అరేబియా గ్రాండ్ ప్రి రేసులు రద్దు చేశారు. దీంతో మే3న జరిగే మియామి గ్రాండ్ ప్రి వరకు సుదీర్ఘ విరామం లభించనుంది.

## మియామి విజేత సబలెంకా



**మియామి:** టాప్ సీడ్ సబలెంకా వరుసగా రెండో టైటిల్ అందుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో 6-2, 4-6, 6-3తో కోకో గాఫ్‌ను ఓడించి మియామి ఓపెన్ టైటిల్ సొంతం చేసుకుంది. ఇటీవల ఇడియన్ వెల్స్ టైటిల్ నెగ్గిన సబలెంకాకు ఇది వరుసగా రెండో టైటిల్. అలాగే వరుసగా రెండో మయామి ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. బెలారస్‌కు చెందిన ప్రపంచ నంబర్ వన్ సబలెంకా.. తొలి సెట్‌ను అలవోకగా గెలుపొందింది. రెండో సెట్‌లో పుంజుకున్న కోకో గాఫ్ ... సబలెంకా జోరుకు బ్రేక్ వేస్తూ సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే కీలక మూడో సెట్‌లో సబలెంకా ముందు కోకో గాఫ్ నిలవలేకపోయింది. బలమైన ఏస్‌లతో విరుచుకుపడింది. హార్డ్‌కోర్ట్ డబ్ల్యుటిఎ1000లో వరుసగా రెండు టైటిల్స్ నెగ్గిన అయిదో క్రీడాకారిణిగా, రెండో బెలారస్ భామగా నిలిచింది. ఒకే ఏడాదిలో రెండుటైటిళ్లను గెలుచుకున్న స్వియాటెక్, స్టెఫీ గ్రాఫ్, కిమ్ క్లిస్టర్స్, విక్టోరియా అజరెంకాల సరసన సబలెంకా చేరింది.

## ఈవారంలో 4 కంపెనీల లిస్టింగ్

**ముంబయి, మార్చి 29:** కొత్తవారంలో నాలుగు మెయిన్‌బోర్డు ఐపిఓలు మార్కెట్లకు వస్తున్నాయి. కేంద్ర గనుల ప్రణాళిక డిజైన్ సంస్థ సిఎంపిడిఐ ఈనెల 30వ తేదీ లిస్ట్ అవుతుంది. పవరికా లిమిటెడ్, సాయి పేరెంటరల్స్, అమీర్‌చంద్ జగదీష్ ఖుమార్‌లు ఏప్రిల్ 2వ తేదీ లిస్ట్ అవుతాయని తెలుస్తోంది. సోమవారం కోల్ ఇండియా అనుబంధ సంస్థ సిఎంపిడిఐ ఎన్ఎస్, బిఎస్ఇల్లో లిస్ట్ అవుతుంది. ఇష్యూ ధర రూ.172గానిర్ణఇంచారు. ఐపిఒనుంచి 1842 కోట్లు ఆఫర్ ఫర్ సేల్‌గా నిర్వహిస్తారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో బిడ్లు దాఖలయ్యాయి.




సంస్థాగత బయ్యర్లు 3.48 రెట్లు ఎక్కువ బిడ్లు దాఖలుచేస్తే ఇతర ఇన్వెస్టర్లు 35శాతం, రిటైల్ ఇన్వెస్టర్లు 33శాతం కోటాకు బిడ్లు వేసి సాధించారు. అలాగే పవరికా ఐపిఒ కూడా రూ.1100 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. తాజా ఇష్యూలో రూ.700 కోట్లు ఆఫర్ ఫర్‌సేల్ కింద రూ.400 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఇష్యూధర రూ.395గా నిర్ణయిస్తారు. ఈ కొనుగోళ్లు 24నుంచి 27 మధ్యలోనే పూర్తిస్థాయిలో బుక్ అయ్యాయి. సంస్థాగత బయ్యర్లు 4.74 రెట్లు ఎక్కువ బుక్‌చేసారు. ఇతర ఇన్వెస్టర్లు కేగిరీ 47శాతం, రిటైలర్లు 16శాతం చొప్పున బుక్‌చేసుకున్నారు. ఇక సాయి పేరెంటరల్స్ ఐపిఒ రూ.409 కోట్లుగా ఉంది. 285కోట్లు తాజా ఇష్యూలోను, రూ.124 కోట్లు ఆఫర్‌ఫర్‌సేల్‌గాను ఉంఉంది. ఇష్యూ రిటైల్‌కేటగిరీలో 12శాతం, అర్హత కలిగిన సంస్థాగత ఇన్వెస్టర్లు 1,73శాతం, ఇతరులు 2.45రెట్లు కొనుగోలుచేసారు. ఇష్యూధర రూ.392గా ఉంది. ఇక అమిర్‌చంద్ జగదీష్‌కుమార్‌కంపెనీ ఐపిఒ రూ.440 తాజా ఇష్యూగా ఉంది. రిటైల్‌కేటగిరతలో 1.44 రెట్లు క్యూఐబిలో 1.18 రెట్లు, ఇతర కేటగిరీలో 13.40 రెట్లు బిడ్లు కొనుగోళ్లు జరిగాయి. ఏరోప్లేన్ బ్రాండ్‌మీద కంపెనీ బాస్మతి బియనయం ఎగుమతులుచేస్తుంది. ఇతరబ్రాండ్లు లా టేస్ట్, ఆలిబాబా, వరల్డ్ కప్‌ఫేర్లమీద కూడాచేస్తుంది. ఇక ఇష్యూధర రూ.212గా నిర్ణయించింది.

## 1.75 లక్షల కోట్లు క్షీణించిన ఎంక్యాప్




**ముంబయి, మార్చి 29:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో ఏడు సంస్థల మార్కెట్ విలువలు రూ.1.75లక్షలకోట్లు క్షీణించాయి. శెలవులు ఎక్కువ ఉన్న చిన్నవారంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా నష్టపోయింది. సంస్థ మార్కెట్ విలువలు రూ.89,720.3కోట్లు క్షీణించి రూ.18,24,515.62 కోట్లుగా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి విలువలు రూ.37,248.59 కోట్లు క్షీణించి రూ.11,64,018.69 కోట్లుగా ఉన్నాయి. ఎస్‌బిఐ 35,399.42కోట్లు క్షీణించి 9,41,569.15 కోట్లుగా ఉంది.ఇక ఐసిఐసిఐబ్యాంకు ఎంక్యాప్ రూ.8,121.76 కోట్లు ఆవిరి అయి రూ.8,83,551.30 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.2480.42 కోట్లు దిగజారి రూ.10,50,413.33 కోట్లుగా ఉంది. హిందూస్థాన్ యూనిలీవర్ ఎంక్యాప్ రూ.2091.13కోట్లు తగ్గి 4,87,540.19 కోట్లుగా ఉంది. టిసిఎస్ కూడా 271.35 కోట్లు పతనం అయి రూ.8,64,668.65 కోట్లుగా ఉంది. ఇక ఎల్‌అండ్ విలువలు మాత్రం రూ.18,051.68 కోట్లుపెరిగి రూ.4,90,536.19 కోట్లకు చేరింది.బజాజ్‌ఫైనాన్స్ ఎంక్యాప్ కూడా 8680.36 కోట్లుపెరిగి రూ.5,25,395.48 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ రూ.6245.3 కోట్లు పెరిగి రూ.5,15,034.67 కోట్లకు పెరిగింది. వరుసక్రమంలో రిలయన్స్ నంబర్‌వన్‌గా నిలిస్తే తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్; ఎల్‌అండ్‌టి, హిందూస్థాన్‌యూనిలీవర్‌లు వరుసగా పది ర్యాంకులు సాధించాయి.

# రూపాయి కట్టడికి ఆర్బీఐ ఎన్వోపీ పరిమితి

**మంబయి, మార్చి 29:** భారత కరెన్సీ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో వరుసగా పడిపోతుండటంతో రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. రూపాయి పతనం కట్టడికి, మార్కెట్లో గందరగోళాన్ని తగ్గించేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం రూపాయి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో దేశంలోని అన్ని బ్యాంకులు తమ వద్ద ఉండే విదేశీ కరెన్సీ నిల్వలపై పరిమితిని పాటించాలి. ప్రతి రోజూ వ్యాపార సమయం ముగిసే సమయానికి భారత రూపాయికి వ్యతిరేకంగా బ్యాంకులు ఉంచుకునే నెట్ ఓపెన్ పొజిషన్ 100 మిలియన్ డాలర్లకు మించకూడదు. ఈ నిబంధనను ఏప్రిల్ 10వ తేదీలోగా అన్ని బ్యాంకులు అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఎన్‌వోపీ పరిధి బిలియన్ డాలర్లుగా ఉంది. గత కొద్ది రోజులుగా రూపాయి విలువ వరుసగా రికార్డు స్థాయి కనిష్టాలకు పడిపోతోంది. ఫిబ్రవరి చివరలో మొదలైన పశ్చిమ ఆసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ (ముడి చమురు) ధరలు భారీగా పెరిగాయి. దీని ప్రభావం నేరుగా రూపాయిపై పడింది.

పెట్టుబడుల ఉపసంహారణ. విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి తమ డబ్బును వేగంగా వెనక్కి తీసుకుంటున్నారు. దీనివల్ల డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి బలహీనపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ దాదాపు 10 శాతం కంటే ఎక్కువ పడిపోయింది. 2011-12 తర్వాత రూపాయికి ఇది అత్యంత దారుణమైన ఏడాదిగా నిలిచింది. శుక్రవారం నాటికి డాలర్ విలువ రూ. 94.84 వద్ద ఆల్‌టైమ్ రికార్డు కనిష్టానికి చేరింది. త్వరలోనే ఇది రూ. 95 మార్కును దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్యాంకులు సాధారణంగా తమ లాభాల కోసం డాలర్లను కొని ఉంచుకుంటాయి. ఇలా బ్యాంకులు పెద్ద ఎత్తున డాలర్లను




హోల్డ్ చేయడం వల్ల మార్కెట్లో రూపాయి విలువ ఒక్కసారిగా పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ పెట్టిన 100 మిలియన్ డాలర్ల పరిమితి వల్ల బ్యాంకులు ఇష్టానుసారంగా డాలర్లను నిల్వ ఉంచలేవు. దీనివల్ల మార్కెట్లో డాలర్ల లభ్యత పెరిగి రూపాయి విలువ పడిపోకుండా అడ్డుకట్ట వేయవచ్చు.

రూపాయి విలువలో వచ్చే అనవసరపు హెచ్చుతగ్గులను నియంత్రించడానికి ఇది ఒక బ్రేక్ లాగా పనిచేస్తుంది. గతంలో బ్యాంకులు తమ మూలధనంలో 25 శాతం వరకు ఇలాంటి పొజిషన్లు ఉంచుకునే వీలుండేది కానీ ఇప్పుడు ఆర్‌బీఐ నేరుగా ఒకపరిమితిని విధించడం ద్వారా పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి కేంద్ర బ్యాంకు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతవరకు సఫలమవుతుందో వేచి చూడాలి.

# వచ్చేనెలలో 14రోజులు బ్యాంకులకు సెలవులు

**ముంబయి, మార్చి 29:** ప్రతి నెల మాదిరిగానే ఏప్రిల్ నెలలో కూడా బ్యాంకు సెలవులు ఎక్కువ ఉన్నాయి. ఆర్‌బిఐ కేలండర్ ప్రకారం చూస్తే ఏప్రిల్‌లో బ్యాంకులు మొత్తం 14 రోజుల పాటు మూతపడతాయి. వీటిలో 2 శనివారాలు, 4 ఆదివారాలు సహజంగానే సెలవులు. ఖాతాదారులు తమ బ్యాంకింగ్ సంబంధిత కార్యకలాపాలు, ప్రయాణాలు, వ్యక్తిగత లావాదేవీల పనుల గురించి ముందుగానే ఏప్రిల్ 2026 బ్యాంకు సెలవుల జాబితా తెలుసుకోవడం ముఖ్యం.

ఏప్రిల్ నెలలో ప్రాంతీయ పండుగలు, ప్రభుత్వ సెలవులు, వారాంతాలు వంటి సెలవులున్నాయి. నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆన్‌లైన్ సేవలు సాధారణంగా పనిచేస్తాయి. ఏప్రిల్ 1 ఆర్థిక సంవత్సర ముగింపు కారణంగా దేశంలోని దాదాపు అన్ని బ్యాంకులకు సెలవు. రెండోతేదీ మౌండీథర్స్ డే సందర్భంగా కొచ్చి, తిరువనంతపురంలోని బ్యాంకులకు సెలవు. మూడో తేదీ గుడ్ ఫ్రైడే సందర్భంగా అగర్తలా, చండీగఢ్, గౌహతి, జైపూర్, జమ్మూ, శ్రీనగర్ మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు. 11, 12 తేదీల్లో శని ఆదివారాలు సెలవులు. 14వ తేదీ బి.ఆర్. అంబేద్కర్ జయంతి, తమిళ నూతన సంవత్సరం, బైసాఖీ వంటి పండుగల సందర్భంగా ఐజ్వాల్, భోపాల్, చండీగఢ్, ఇటానగర్,




కోహిమా, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, షిల్లాంగ్, సిమ్లా మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు. 15వ తేదీ బెంగాలీ నూతన సంవత్సర దినంతోపాటు అగర్తల, గౌహతి, ఇటానగర్, కొచ్చి, కోల్‌కతా, సిమ్లా, తిరువనంతపురంలలో బ్యాంకులకు సెలవు.

16వ తేదీ బోహాగ్ బిహు సందర్భంగా గువాహతిలో బ్యాంకులకు సెలవు. 19వ తేదీ ఆదివారం ఆ తర్వాత 20వ తేదీ బసవ జయంతి, అక్షయ తృతీయ సందర్భంగా బెంగళూరులోని బ్యాంకులకు సెలవు. 21వ తేదీ గరియా పూజ సందర్భంగా అగర్తలా బ్యాంకులకు సెలవు. 25,26 తేదీలు చివరి శని ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సెలవులుంటాయి.

బ్యాంక్‌లకు ఏప్రిల్ నెలలో దాదాపు సగం రోజులు సెలవులు ఉండడంతో పెద్ద ఎత్తున వ్యాపారం చేసే వ్యాపారులు, ఇతరులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### మార్కెట్ల నుంచి రూ.1.14 లక్షలకోట్లు

## ఎఫ్‌పిఐల విత్‌డ్రా




**ముంబయి, మార్చి 29:** విదేశీ ఇన్వెస్టర్లు ఈనెలలో ఇప్పటివరకూ మార్కెట్లనుంచి రూ.1.14 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతుండటం, డాలరుతోరూపాయి క్షీణించడం వంటివి పెట్టుబడులు విత్‌డ్రాపై ప్రభావంచూపించాయి. గతంలో రూ.94,017 కోట్లు విత్‌డ్రా అయిన సందర్భాలున్నాయి. 2024 అక్టోబరులో మాత్రమే భారీ ఎత్తున పెట్టుబడులు విత్ డ్రా అయ్యాయి. మళ్లీ 2026 మార్చినెలలోనే భారీస్థాయిలో ఈక్విటీలనుంచి ఎఫ్ఐఐలు విత్‌డ్రా చేసారు. మొత్తం విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఇప్పటివరకూ 1.27 లక్షలకోట్లు విత్‌డ్రా చేసినట్లు తేలింది. మార్చినెల మొత్తంగా కూడా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. రూ.1,13,380 కోట్లు క్యాష్ మార్కెట్‌నుంచి విత్‌డ్రా అయ్యాయి. ఫిబ్రవరిలో అయితే ఎఫ్‌పిఐలు రూ.22,615కోట్లు పెట్టుబడులుపెట్టారు. గడచిన 17 నెలల్లో ఎన్నడూలేనంతగా గరిష్ఠస్థాయిలో ఫిబ్రవరి పెట్టుబడులున్నా మార్చినెలలో మళ్లీ భారీ స్థాయిలో పెట్టుబడులు వెనక్కితీసుకున్నారు. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ మాట్లాడుతూ పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయి క్షీణత, గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు వచ్చే జమలు తగ్గడం వంటి ఆందోళనలే పెట్టుబడులు వెనక్కిపోయాయని చెప్పారు. వీటికితోడు ముడి చమురు దరలుపెరగడంతో భారత్ ఆర్థికవృద్ధి, కార్పొరేట్ రాబడులు వంటివి కూడా ఎఫ్‌పిఐలు విత్‌డ్రాకు దోహదంచేసాయన్నారు. అమెరికా బాండ్ల రాబడులు పెరగడం కూడా ప్రపంచ వ్యాప్తంగా నగదు లభ్యత మరింత క్లిష్టం అయింది. అయితే ఇతర వర్ధమాన దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌మార్కెట్ల తీరు మెరుగ్గానే ఉందని ఇన్వెస్ట్‌మెంట్ సలహా సంస్థలు చెపుతున్నాయి. ఇతర మార్కెట్లలోకూడా ఎఫ్‌పిఐలు అమ్మకాలకే మొగ్గుచూపించారు. తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లలో కూడా ఇదే తీరు కనిపించడం వెనుక యుద్ధవాతావరణమేనని తెలుస్తోంది.

## కెపిఎంజిలో వర్క్‌ఫోర్స్ తగ్గింపు




**మంబయి, మార్చి 29:** కన్సల్టెన్సీ సంస్థ కెపిఎంజి బ్రిటన్ విభాగం భారీ స్థాయిలో వర్క్‌ఫోర్స్ తగ్గించుకునేందుకు నిర్ణయించింది. ఆడిట్ డివిజన్‌లోనే ఎక్కువమందిపై వేటువేస్తోంది. సుమారు 600 మంది ఉద్యోగులకు ఇప్పటికే వర్తమానం పంపించిందని అంచనా. మరికొంతమందితో అంతర్గత సంప్రదింపులు కూడా కొనసాగిస్తోంది. తర్జనబర్జనల తర్వాత 440 మంది ఉద్యోగులు సంస్థను వీడే అవకాశం ఉంది. సంస్థల పరిధిలోని నాలుగు కీలక వాణిజ్యయూనిట్లలో బ్రిటన్ ఒకటిగా కొనసాగుతోంది. ఎక్కువగా అసిస్టెంట్‌మేనేజర్లు వృత్తిపరమైన అకౌంటింగ్ అర్హతలున్నవారికి ఎక్కువ ఉద్వాసన చెపుతోంది, మొత్తంగా లే ఆఫ్‌లు ఆరు శాతం వరకూ ఉంటుందని అంచనా.ప్రస్తుతం 7100మంది ఉద్యోగులు పనిచేస్తున్న కెపిఎంజి టెక్నాలజీ అప్‌డేషన్ భాగంగానే లే ఆఫ్‌లు తప్పడంలేదని చెపుతోంది. ప్రస్తుత మార్కెట్‌పరిస్థితుల్లో తరచూ కంపెనీలను వీడి వెళుతున్నవారు, కంపెనీలు మారుతున్నవారు తక్కువగానే ఉన్నారని అయితే ఎఐ, ఇతర టెక్ అప్‌డేట్‌లు కూడా అవసరం అవుతున్నందున యాంత్రీకరణ దిశగా నడుస్తున్నప్పటికీ ఆడిట్ విభాగంలోనే ఈ కోతలు ఎక్కువ ఉంటున్నట్లు తెలుస్తోంది.ఈ లేఆఫ్‌లు ఒక్క కెపిఎంజికే పరిమితం కాలేదు. మెకిన్‌సే కూడా 10శాతం వర్క్‌ఫోర్స్‌ను వచ్చే రెండేళ్లలో తగ్గించాలని నిర్ణయించింది.ఎఐ అమలుతో ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ కూడా వర్క్‌ఫోర్స్ తగ్గింపువైపు చూస్తోంది. కొత్తటూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని కంపెనీ హెచ్చరించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.